# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 115 | హైదరాబాద్ | గురువారం 23-10-2025 | పేజీలు : 12 | వెల : 1.00





ఒలింపిక్ హీరో నీరజ్ చోప్రాకు సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్ హోదా

## నేటి భారతం

- వేపచెట్టు నీడలో విశ్రాంతి తీసుకుంటే శరీరం కాదు, మనసూ చల్లబడుతుంది.
- వేప చేదు అయినా జీవనానికి మేలు చేసే తీయటి ఔషధం
- ప్రతి గ్రామంలో ఒక వేపచెట్టు ఉంటే, ఆ గ్రామానికి వైద్యుడు అవసరం లేదు.
- వేపచెట్టు పుట్టిన చోట వ్యాధులు తట్టుకోలేవు.
- వేప చేదు రుచి నేర్పుతుంది ఆరోగ్యమే అసలైన మాధుర్యం అని.
- వేపచెట్టు మన సంప్రదాయం, మన సంస్కృతి, మన ఆరోగ్య రక్షకుడు.
- చల్లని నీడ, చేదు ఔషధం, పవిత్రత ఈ మూడు వేపచెట్టుకే ప్రత్యేకం.
- వేపచెట్టు వాడకం తెలిసినవాడు, వ్యాధి అనే పదం మరిచిపోతాడు.
- ప్రకృతికి దేవత, ఔషధానికి మూలం వేపచెట్టు వేపచెట్టు నాటడం అంటే, ఆరోగ్యాన్ని నాటడం.
- ఇప్పటికైనా ప్రభుత్వాలు, అధికారులు మేలుకోవాలి
- ప్రజలు తమ కర్తవ్యాన్ని గ్రహించాలి లేకపోతే ప్రపంచ వినాశనం తప్పదు
- చనిపోతున్న వేపచెట్ల సంరక్షణ చేపట్టాలి.

– కేసారం పెంటారెడ్డి,
సీనియర్ సామాజిక, రాజకీయ విశ్లేషకులు

### శబరి గిరుల్లో చారిత్రక ఘట్టం..
# ఇరుముడితో పడిమెట్లెక్కిన రాష్ట్రపతి
### శబరిమలలో ముర్ము ప్రత్యేక పూజలు



- శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఈ పుణ్యక్షేత్రానికి వెళ్లిన తొలి మహిళా దేశాధినేతగా రికార్డు
- సాంప్రదాయబద్ధంగా ఇరుముడి ధరించి 18 పవిత్ర మెట్లు ఎక్కిన వైనం
- వీవీ గిరి తర్వాత శబరిమల వెళ్లిన రెండో భారత రాష్ట్రపతిగా గుర్తింపు
- భక్తిని చాటుకున్నారంటూ రాష్ట్రపతి పర్యటనపై బీజేపీ ఎంపీ బండి సంజయ్ ప్రశంస

11లో

### మంటలు అంటుకుని దగ్ధమైన
# ఢిల్లీ పబ్లిక్ స్కూల్

- నాదర్‌గుల్‌లో స్కూల్ బస్సులో మంటలు
- అప్రమత్తమై బస్సు దిగిపోయిన డ్రైవర్
- విద్యార్థులను ఇళ్ల వద్ద దింపి వెళుతుండగా ఘటన






### ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణంపై
## రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- భవన నిర్మాణ పనుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష
- రెండేళ్లలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- నిర్మాణ పనులు వేగవంతం చేయడం కోసం సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచన

11లో

# మరో మహమ్మారి
# కబళించబోతోందా..?

పొద్దున్నే నిద్రలేవగానే వేపచెట్టును దర్శించుకోవాలని పెద్దలు చెబుతుంటారు.. తెల్లవారుజామున వేపచెట్టునుంచి వచ్చే అత్యంత విలువైన ప్రాణవాయువు ఆక్సిజన్ పీల్చుకుంటే మన శరీర రుగ్మతలు మటుమాయం అయిపోతాయి.. మనసు కూడా ప్రశాంతంగా మారుతుంది.. ఓ రకంగా చెప్పకోవాలంటే మానవాళి జీవితాల్లో వేపవచెట్టు ఒక ప్రాముఖ్యతను సంతరించుకుంది.. లెక్కలేని ఔషధ గుణాలున్న వేపచెట్టును పరిరక్షించుకోకపోతే.. మనకు రక్షణ కరువవుతుంది.. అన్ని చెట్లల్లోనూ వేపచెట్టు అత్యధికంగా ఆక్షిజన్ ను విడుదల చేస్తుంది.. గాలిలోని ప్రమాదకర సూక్ష్మక్రిములను నాశనం చేస్తుంది.. అలాంటి వేపచెట్టు కనుమరుగైపోతే మన పరిస్థితి ఏమిటి అన్నది ఒక్కసారి అవలోకనం చేసుకోవాలి.. ఇంతకు ముందే చూసాం.. అప్పట్లో వేపచెట్లు చనిపోవడం మొదలయ్యాక.. ఆ వెంటనే కోవిడ్ అనే మహమ్మారి ప్రపంచాన్ని చుట్టేసింది.. లక్షల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.. కారణం ఆక్షిజన్.. గాల్లో ఎప్పుడైతే ఆక్సిజన్ తగ్గిపోతుందో.. అప్పుడు ప్రమాదకర సూక్ష్మ క్రిములు విజృంభిస్తాయి.. అదే జరిగింది.. ఇప్పుడు కూడా అదే జరుగబోతోంది.. వేపచెట్లు వేలసంఖ్యలో చనిపోతున్నాయి.. గాలిలో ఆక్షిజన్ మాయం అయిపోతున్నది.. దీంతో మరో ప్రమాదం ఈ విశ్వాన్ని చుట్టుముట్టబోతోంది అన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు విశ్లేషకులు, వైద్య నిపుణులు.. ఇలాంటి ప్రమాదం ముంచుకురాకముందే మేలుకోవాలి.. ప్రభుత్వాలు స్పందించాలి.. ఫారెస్ట్, హార్టికల్చర్ శాఖలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి.. ప్రజలందరూ వేప చెట్లను సంరక్షించుకోవాలి.. అమెరికా లాంటి దేశాలు వేపచెట్టుపై పేటెంట్ హక్కులు పొందడానికి ప్రయత్నం చేస్తున్నారు.. అలాంటిది వేపచెట్లకు ఆలవాలమైన భారతావని ఏమి చేస్తోంది..? వేపచెట్లను కాపాడుకోలేకపోతే మన జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..

- ప్రపంచాన్ని కుమ్మేసిన కోవిడ్..
- అలాంటి ప్రళయం రాబోతోందని సంకేతాలు..
- కారణం తెలిస్తే ఒళ్ళు జలదరిస్తుంది..
- ఔషధాల గని వేపచెట్టుకు ప్రమాదం..
- వాతావరణంలో తగ్గనున్న ఆక్షిజన్..
- ఎన్నో ఆయుర్వేద ఔషధాల్లో వేపచెట్టు వినియోగం..
- వేప ఆకులు, చిరును, వేపనూనె, వేపచెక్క ఇలా ఎన్నెన్నో..
- తెగుళ్లతో చనిపోతున్న వేపచెట్లు..
- కోవిడ్ కు ముందు ఇలాగే జరిగింది..
- మళ్ళీ ఆ పరిస్థితులు రాబోతున్నాయన్నది నిపుణుల ఆందోళన..
- ప్రభుత్వం మేలుకోవాలి.. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలి..
- ప్రజలు అప్రమత్తం అవ్వాలి.. విలువైన వేప సంపదను కాపాడుకోవాలి..
- మానవాళి సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న వేపచెట్టును కాపాడుకోవాలని పిలుపునిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "




### గల్ఫ్ ప్రవాసులకు అండగా
# ప్రవాసాంధ్ర భరోసా

- యూఏఈ పర్యటన కోసం దుబాయ్ చేరుకున్న సీఎం చంద్రబాబు
- విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికిన అధికారులు, ప్రవాసాంధ్రులు
- గల్ఫ్ ప్రవాసుల కోసం 'ప్రవాసాంధ్ర భరోసా' బీమా పథకం ప్రారంభం
- దురదృష్టవశాత్తు మరణిస్తే కుటుంబానికి రూ. 10 లక్షల వరకు పరిహారం
- ఎల్లుండి ప్రవాసీయులతో భారీ సమావేశంలో పాల్గొననున్న సీఎం







## దేశానికి పొలిటికల్ ఇస్లాం
# పెను ప్రమాదం


: యోగి ఆదిత్యనాథ్

- శివాజీ, గురుగోవింద్ సింగ్, మహారాణి ప్రతాప్ పొలిటికల్ ఇస్లాంపై పోరాడారన్న యోగి
- పొలిటికల్ ఇస్లాం ద్వారా దేశాన్ని విడగొట్టే శక్తులను ఉపయోగించుకుంటున్నారని వ్యాఖ్య
- యూపీలో హలాల్ సర్టిఫికెట్‌ను జారీ చేశామని వెల్లడి

### ఒక్కరోజే రూ. 9 వేలు
# తగ్గిన బంగారం ధరలు..

- హైదరాబాద్‌లో రూ. 1,25,250కి పడిపోయిన పసిడి ధరలు
- రూ. 28 వేలు తగ్గి రూ. 1,58,000కు పడిపోయిన వెండి ధర
- అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం 4,022 డాలర్లు

11లో



# సంపాదకీయం

## అమెరికాలో నో కింగ్స్ ఉద్యమం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2.0 పాలనపై ఏడాది తిరగకుండానే అమెరికన్లు తిరుగుబాటు షురూ చేశారు. 2025, జనవరి 20న ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. మొదటి రోజు నుంచే సంచలన నిర్ణయాలు. అడ్మినిస్ట్రేటివ్ ఆర్డర్లు జారీ చేస్తూ అందరిలో భయం సృష్టించారు. రోజురోజుకూ తన పరిధిని మించి నిర్ణయాలతో ఇటు అమెరికన్లు.. అటు ప్రపంచ దేశాలు నిత్యం భయపడుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా వ్యతిరేక శక్తులు పెరుగుతున్నాయి. తన నిర్ణయమే ఫైనల్ అన్నట్లు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఇదే తరుణంలో ట్రంప్ వేధింపులతో విసిగిపోయిన అమెరికన్లు ట్రంప్‌కు వ్యతిరేకంగా ఉద్యమం మొదలు పెట్టారు. అక్టోబర్ 18న అమెరికా అంతటా, అలాగే మిత్ర దేశాల్లోనూ 'నో కింగ్స్' పేరుతో భారీ నిరసనలు జరిగాయి. ఇది కేవలం రాజకీయ కార్యక్రమం కాదు.. రాజ్యాధికారానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ఉద్యమంగా నిరసనకారులు పేర్కొంటున్నారు. దాదాపు 2,700 నగరాల్లో ఆందోళనలు జరగడం అమెరికా అధ్యక్షుడిపై వ్యతిరేకతకు అద్దం పడుతోంది. ఇందులో సుమారు 70 లక్షల మందికి పైగా పాల్గొన్నారు. ఈ ఉద్యమానికి ప్రేరణ.. 2016లో ప్రారంభమైన 'ఇండివైజబుల్' అనే సంస్థ నుండి వచ్చింది, ఇది మొదట ట్రంప్ అనుసరించే విధానాలకు వ్యతిరేకంగా ఏర్పడింది. ఇప్పుడు, వేలాది సంస్థలు కలిసి ఈ ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తున్నాయి. అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్, టీచర్స్ ఫెడరేషన్, మూవ్ ఆన్ వంటి సంస్థలు ఇందుకు తోడ్పడుతున్నాయి. తాజాగా ఉద్యమకారులు.. ఒక కొత్త సూత్రాన్ని ప్రవేశపెట్టారు. దేశంలో కనీసం 3.5 శాతం ప్రజలు స్థిరంగా వీధుల్లోకి దిగితే ప్రభుత్వం మారే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఇది ఎరికా చెనోవెత్, మారియా స్టీఫెన్ వంటి రాజకీయ శాస్త్రవేత్తల పరిశోధన ఆధారంగా రూపొందించారు. ఈ సిద్ధాంతం ఉద్యమానికి శాస్త్రీయ చట్టబద్ధతను ఇచ్చినా, దానికీ పరిమితులు ఉన్నట్టు నిపుణులు కూడా సూచిస్తున్నారు. ప్రజలు, స్వతంత్ర సంస్థలు ట్రంప్‌పై అనేక ఆరోపణలు చేస్తున్నారు. పాలనా తీరుపై అభ్యంతరాలు చెబుతున్నారు. వలసదారుల నిర్బంధం, బహిష్కరణను వ్యతిరేకిస్తున్నారు. రాజ్యాంగ సంస్థలపై ఆధిపత్యం చెలాయించడాన్ని నిరసిస్తున్నారు. నేషనల్ గార్డ్సను నగరాలకు నియమించడాన్ని తప్పు పడుతున్నారు. ప్రజా ధనాన్ని తన సొంత అవసరాలకు వాడుకోవడంపై మండిపడుతున్నారు. కోర్టుల తీర్పులను లెక్కచేయకపోవడంపైనా జనాగ్రహం పెల్లుబిగుస్తోంది. పెట్టుబడిదారుల అనుకూల ఆర్థిక విధానాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉన్నట్లు అమెరికన్లు భావిస్తున్నారు. ఈ చర్యల వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ కుదేలవడంతోపాటు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. వినియోగదారులపై విపరీమైన భారం పడుతోంఇక నిరసనలపై ట్రంప్ స్పందిస్తూ.. 'వాళ్లు నన్ను రాజు అంటున్నారు, కానీ నేను కాను' అని ట్రంప్ వ్యాఖ్యానించినప్పటికీ, ఆయన స్వయంగా షేర్ చేసిన ఏఐ వీడియో ప్రపంచవ్యాప్తంగా విమర్శలకు దారితీసింది. ఆ వీడియోలో ఆయనను రాజుగా చూపిస్తూ నిరసనకారులపై దూషణ చేయడంపై జనం మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వీడియో ద్వారా అధ్యక్షుడి భాషను కాకుండా, అహంకారంగా ప్రజలు భావిస్తున్నారు. ట్రంప్ పెట్టిన ప్రారంభ హెచ్చరిక రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై సైకాలజికల్ ప్రెజర్ సృష్టించే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఉక్రెయిన్‌కు అత్యాధునిక దాడి సామర్థ్యమున్న క్షిపణులు అందిస్తామని చెప్పడం ద్వారా అమెరికా మళ్లీ విధేయత చూపించే ప్రయత్నం చేసింది. అయితే ఆ ప్రకటన తర్వాత మాస్కో నుంచి తీవ్రమైన హెచ్చరికలు వచ్చాయి. "ఉక్రెయిన్కు క్షిపణులు ఇస్తే, రష్యా?అమెరికా సంబంధాలకు తిరిగిపోని నష్టం జరుగుతుంది" అని పుతిన్ స్పష్టంగా వార్నింగ్ ఇచ్చాడు. దెబ్బకు ట్రంప్ వెనక్కు తగ్గారు. ఓవల్ ఆఫీసులో ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్?కతో సమావేశమైతో మహాక్ క్షిపణుల అంశంపై మాట్లాడారు. జెలెన్స్?క, "అవి లభిస్తే పుతిన్ శాంతి చర్చలను సీరియస్‌గా తీసుకుంటాడు" అని అభిప్రాయపడ్డారని అమెరికా మీడియా పేర్కొంది. కానీ ట్రంప్ మాత్రం "ప్రస్తుత సమయంలో అమెరికా నిల్వలను తగ్గించలేను. నా ప్రాధాన్యం యుద్ధాన్ని ముగించడం" అని స్పష్టంగా చెప్పారని సమాచారం. ఈ అభిప్రాయం ఆయన కొత్త విధానంగా భావిస్తున్నారు. పుతిన్‌తో జరిగిన ఇటీవల భేటీ కూడా ఈ మార్పుకు కారణమని వాస్తవాలు సూచిస్తున్నాయి. ట్రంప్, రష్యా సహకారం లేకుండా ఉక్రెయిన్ శాంతి సాధ్యం కాదనే నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. అందుకే ఆయుధాలు పంపడంపై కాకుండా శాంతి చర్చలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. దీని వెనుక మరో అంశం కూడా ఉంది. అమెరికా అంతర్గత రాజకీయ ఒత్తిడి. కాంగ్రెస్‌లో కొందరు సెనేటర్లు యుక్రెయిన్‌కు ఆయుధాలు పంపడాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీంతో ట్రంప్ నిర్ణయానికి రాజకీయ మద్దతు కూడా లభిస్తోంది. ట్రంప్ పదే పదే మాట మార్చుతున్నారని విమర్శలు వస్తున్నా, ఆయనకు ఇది ఒక ప్రతిస్పందనాత్మక దౌత్యతంత్రం కావచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. హెచ్చరికల ద్వారా రష్యాను భయపెట్టే ప్రయత్నం చేస్తూ, చివర్లో వెనక్కు తగ్గడం ద్వారా శాంతి ఆదిపత్యం చూపే వ్యూహం అవుతుందేమో అన్న అభిప్రాయం కూడా ఉంది. అయితే ఈ యూటర్న్ ఆయన విశ్వసనీయతకు దెబ్బతీస్తోంది. ప్రపంచ నేతగా సామరస్యానికి బదులు అయోమయం సృష్టిస్తున్నారనే విమర్శలు పెరుగుతున్నాయి .'నో కింగ్స్' ఉద్యమం ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది.. వ్యక్తి పూజను వీడి.. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టారు. ప్రస్తుతం రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అమెరికా విభజన దశను ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో ప్రజల నిరసన శక్తి తక్షణ ప్రభావం చూపకపోయినా, ఇది ట్రంప్ సామ్రాజ్యాన్ని కూల్చి ఒక చారిత్రాత్మక మలుపు కావచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.

# మూడేళ్ల ముందు నుంచే ప్రచారం



విజయవాడ, అక్టోబరు 22,

ఎన్నికలకు ఇంకా మూడున్నరేళ్ల టైమ్ ఉంది. కానీ రేపో మాపో ఎలక్షన్ అన్నట్లుగా..సీఎం చంద్రబాబు అప్పుడే ప్రచారం స్టార్ట్ చేశారు. ఎక్కడికి వెళ్లినా మీ ఓటు మాకేనని అభ్యర్థిస్తున్నారు. ప్రతీ అంశంలో ప్లస్‌లు, మైనస్‌లు బేరీజు వేసుకుని మరీ ముందుకెళ్తున్నారు. కూటమిలో గ్యాప్ రాకుండా..ప్రజల్లో ప్రభుత్వంపై బ్యాండ్ నేమ్ రాకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే. .ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని డిసైడ్ అయ్యారు.రేపే నోటిఫికేషన్. పది రోజుల్లో ఎలక్షన్స్. ఈ ఎన్నికలు చాలా కీలకం అన్నట్లుగా ఉంది ఏపీ రాజకీయం. ఇష్యూ ఏదైనా..టాపిక్ మరేదైనా అధికార, విపక్షాలు ప్రతీదాన్ని అడ్వాంటేజ్‌గా మల్చుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు పొలిటికల్ స్టెప్పులు ఆసక్తికరంగా మారాయి. కూటమిగా అధికారంలోకి వచ్చి 15 నెలలు అయిందో లేదో..అప్పుడే రాబోయే ఎన్నికల కసరత్తును స్పీడప్ చేశారు.ఏపీలో షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు 2029 మేలో జరుగుతాయి. అప్పటివరకు పాలన చూసుకుంటూ నెట్టుకురావొచ్చు. కానీ నాలుగోసారి సీఎంగా బాబు ప్రమాణం చేసిన మరుసటి రోజు నుంచే..రేపటి కోసం ఫ్యూచర్ ప్లాన్ నడుస్తూనే ఉంది. రేపే ఎన్నికలు ఉన్నాయా అన్నట్లుగా. .కార్యక్రమాలు ..కూటమి ప్రభుత్వ పాలన..సంక్షేమ పథకాలు..ఇలా అన్నీ బ్యాలెన్స్ చేస్తున్నారు. ఎక్కడికెళ్లినా కూటమికి వెన్నుదన్నుగా ఉండాలని ప్రజలను కోరుతున్నారు. మళ్లీ వైసీపీ వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఉదాహరణలతో మరీ చెబుతున్నారు. ఏ పథకం అయినా కార్యక్రమం అయినా జనం మధ్యనే చేస్తున్నారు.ఇక ఇప్పటికే సూపర్ సిక్స్.. సూపర్ సక్సెస్ అంటూ డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేసింది కూటమి. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి సీఎం చంద్రబాబే గ్రౌండ్‌లోకి దిగేందుకు రెడీ అవుతున్నారు. నవంబర్ నెల నుంచి క్షేత్రస్థాయిలో పర్యటిస్తాను అని బాబు ప్రకటించేశారు. ప్రజల దగ్గరికే వెళ్లి పథకాల అమలుపై ఆరా తీయాలని..అలా అయితే ఏవైనా లోటు పాట్లు ఉంటే సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారట. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అప్పటి దాకా ప్రజల మధ్యనే ఉండేలా ప్రణాళిక రచిస్తున్నారట.పబ్లిక్ పల్స్‌ను పట్టుకోవడంలో చంద్రబాబు మార్క్ వేరే. థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ. పైగా గ్రౌండ్ లెవల్‌లో ఏం జరుగుతుందో..జనం ఒపీనియన్ ఏంటో ఎప్పటికప్పుడు రిపోర్టులు తెప్పించుకుని స్టడీ చేయడం బాబుకు ముందు నుంచి అలవాటుగా ఉందట. ఎప్పటికప్పుడు సర్వేలు కూడా చేయించుకుంటూనే ఉన్నారు. వీటన్నింటికీ మించి ఫస్ట్ రిపోర్టులాగా.. క్షత్రస్థాయిలో పర్యటిస్తే..జనాల ఒపీనియన్ తెలుసుకోవచ్చని అనుకుంటున్నారట. ఇక 2029 ఎన్నికల్లో కూడా మొన్నటి లాగే..అద్భుతమైన విజయం సాధించాలంటే ఏమి చేయాలనేదానిపై గ్రౌండ్ ప్రిపేర్ చేస్తున్నారు. విపక్షం ఇంకా ఫీల్డ్‌లోకి దిగకముందే ఓ అడుగు ముందుకేసి పబ్లిక్‌కు దగ్గర కావొచ్చని ప్లాన్ వేస్తున్నారట చంద్రబాబు.అటు వైసీపీ కూడా ఇన్ హౌజ్ మీటింగ్‌లో బిజీగా ఉంది. ఘోర పరాజయం..నేతల జంపింగ్‌లు..లీడర్ల అరెస్టులు..ఆ తర్వాత లిక్కర్ స్కామ్ కేసు..ఇలా వరుస ఇష్యూలతో స్ట్రగుల్స్ ఫేస్ చేసిన వైసీపీకి..ఈ మధ్యే ప్రభుత్వాన్ని కార్నర్ చేసేందుకు రెండు పెద్ద ఇష్యూస్ తగిలాయి.

నకిలీ మద్యం వ్యవహారం.. మెడికల్ కాలేజీల పీపీపీ విధానంపై..స్ట్రాంగ్ వాయిస్ వినిపించి..ప్రొటెస్ట్‌లు, విమర్శలు.. అలిగేషన్స్‌తో..కూటమి సర్కార్‌పై కాస్త గట్టిగానే వాయిస్ రేజ్ చేసి జనం దృష్టిని ఆకట్టుకోలిగింది .ఇలా ఎప్పటికప్పుడు ఇష్యూ బేస్డ్‌గా జనంలోకి వెళ్తూ..ఎన్నికల వ్యూహ రచనలో కూడా జగన్ బిజీగా ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. మిర్చి, మామిడి రైతుల పక్షాన జగన్ పర్యటనలు చేసి చర్చకు తెరలేపారు. లేటెస్ట్‌గా మెడికల్ కాలేజీ అంశాన్ని వైసీపీ చాలా బలంగా జనాల్లోకి తీసుకెళ్లింది. వైసీపీ నేతల మెడికల్ కాలేజీల టూర్లతో పాటు..మాజీ సీఎం జగన్ నర్సీపట్నంలో పర్యటించిన మెడికల్ కాలేజీ పీపీపీ విధానంపై కూటమి సర్కార్ తీరును తప్పుబట్టారు.ఇక జిల్లాల పర్యటన చేస్తానని గతంలోనే ప్రకటించిన ఫ్యాన్ పార్టీ అధినేత..ముందుగా నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ లీడర్, క్యాడర్‌కు భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. మరోసారి రాష్ట్రవ్యాప్త పాదయాత్రకు కూడా జగన్ ప్లాన్ చేస్తున్నారని అంటున్నారు. అది ఎప్పుడు ఉంటుందో ఇప్పటికి క్లారిటీ లేదు. అయితే జిల్లాల టూర్ లేక పాదయాత్రకు సంబంధించి త్వరలో షెడ్యూల్ ఇచ్చి వైసీపీ కూడా ప్రజాక్షేత్రంలోకి దిగబోతోందట.అయితే ఫ్యాన్ పార్టీ ఇప్పటి నుంచే పబ్లిక్‌లోకి వెళ్లడమనేది అపోజిషన్ పార్టీగా వాళ్లకు తప్పదు.

కానీ అధికారంలో ఉన్న కూటమి ఇప్పుడే అలర్ట్ అవడం.. క్షేత్రస్థాయి పర్యటనకు సీఎం చంద్రబాబు రెడీ అవుతుండటం ఇంట్రెస్టింగ్‌గా మారింది. మొత్తానికి ప్రభుత్వం మారి రెండేళ్లు కాకముందే ఏపీలో రాజకీయం రంజుగా మారేలా కనిపిస్తోంది.


# ఎంపీగానే రాఘవరెడ్డి పోటీ...



ఒంగోలు, అక్టోబరు 22,

ఊహించిందే జరిగింది. ఒంగోలు ప్రజలకు అంతో క్లారిటీ ఉంది. ఆయన కూడా అదును చూసి ప్రకటన చేశారు. బర్త్ డే సందర్భంగా..సంచలన స్టేట్‌మెంట్ ఇచ్చారు ఒంగోలు టీడీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని అంటూనే..తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డి ఒంగోలు నుంచి ఎంపీగా పోటీ చేస్తారని తెలిపారు. చంద్రబాబు ఆదేశాల ప్రకారమే గత ఎన్నికల్లో తాను పోటీ చేశానని చెప్పుకొచ్చారు.మాగుంట కుటుంబ రాజకీయ వారసుడిగా రాఘవరెడ్డిని రంగంలోకి దింపాలని శ్రీనివాసులు రెడ్డి ఎప్పటి నుంచో ఆరాటపడుతున్నారు. వయస్సు మీద పడుతుండటంతో తన కుటుంబ వారసుడిని రంగంలోకి దింపేందుకు ఇదే కరెక్ట్ సమయమని భావిస్తున్నట్లు తెలుస్తోంది. 2024 ఎన్నికల్లోనే టీడీపీ నుండి తన కుమారుడిని ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దింపేందుకు శతవిధాలా ప్రయత్నించారు ఎంపీ మాగుంట. మొన్నటి సారి ఎంపీగా మాగుంట శ్రీనివాసులురెడ్డి, గిద్దలూరు లేదా దర్శి అసెంబ్లీ నుంచి మాగుంట కుమారుడు రాఘవరెడ్డి పోటీ చేస్తారని ప్రచారం నడిచింది. కానీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు రాఘవరెడ్డి ఆసక్తి చూపలేదట.టీడీపీ అధిష్టానం రాఘవరెడ్డిని ఎంపీ అభ్యర్థిగా పరిగణలోకి తీసుకున్నా.. సర్వేల్లో మాగుంట శ్రీనివాసులురెడ్డికే ప్రజలు ఓటేశారని ఆయన వైపే మొగ్గు చూపారు. ఢిల్లీ లిక్కర్ కేసులో రాఘవరెడ్డిపై ఆరోపణలు..అరెస్టులు వంటి కీలక పరిణామాలతో తప్పని పరిస్థితుల్లో మాగుంటనే బరిలో దింపింది టీడీపీ అధిష్టానం. ఓవైపు వయోభారం..మరోవైపు తన కుమారుడి పొలిటికల్ ఎంట్రీ కోసం ఆశపడుతున్న మాగుంట శ్రీనివాసులురెడ్డి..తన తనయుడు రాజకీయ అరంగేట్రానికి ఇదే సరైన టైమ్ అని భావిస్తున్నారట. తాను రాజకీయాల్లో యాక్టీవ్‌గా ఉన్నప్పుడే తన కుమారుడిని వారసుడిగా లైన్‌లోకి దింపి తమ కుటుంబ చరిష్మాను నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉన్నారట మాగుంట. దీంతో జన్మదిన వేడుకల సందర్భంగా తన మనసులో మాటను మరోసారి బయటపెట్టారు ఎంపీ మాగుంట.రాఘవరెడ్డి ఇప్పటికే పొలిటికల్‌గా యాక్టీవ్‌గా ఉంటున్నారు. తన తండ్రి శ్రీనివాసులురెడ్డి రాజకీయ వ్యవహారాలతో పాటు వ్యాపారాల్లో చేదోడువాదోడుగా ఉంటూ అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. గత ఎన్నికల టైమ్‌లో కూడా రాఘవరెడ్డి ప్రచారం చేశారు. మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒంగోలు పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు నియోజకవర్గాల్లో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. గత ఎన్నికల తర్వాత కూడా యాక్టీవ్‌గా ఉంటూ వస్తున్నారు రాఘవరెడ్డి. నియోజకవర్గాల వారీగా నేతలను కలుస్తూ..సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపుతున్నారు. అటు యువతతో..ఇటు సీనియర్ నేతలతో కోఆర్డినేట్ చేసుకుంటూ అందరికీ దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు.ఫ్యామిలీకి 30 ఏళ్ల పొలిటికల్ ట్రాక్ రికార్డు ఉంది. మాగుంట శ్రీనివాసులరెడ్డి తన సోదరుడు మాగుంట సుబ్బిరామిరెడ్డి మరణం తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి రాజకీయాల్లోకి వచ్చారు. 1998, 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఒంగోలు నుంచి ఎంపీగా విజయం సాధించారు. 2014 ఎన్నికలప్పుడు మాగుంట కాంగ్రెస్ పార్టీకి రిజైన్ చేసి టీడీపీలో చేరి 2014లో ఒంగోలు ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత 2015లో ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల తరుపున ఎమ్మెల్సీగా గెలిచారు. 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి..2024 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి గెలిచారు మాగుంట శ్రీనివాసులురెడ్డి. ఇక ఇప్పుడు తన ఫ్యామిలీ రాజకీయ వారసత్వాన్ని కంటిన్యూ చేసేందుకు కొడుకు రాఘవరెడ్డిని బరిలోకి దింపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. మరి మాగంటి వారసుడిగా రాఘవరెడ్డి పాలిటిక్స్‌లో ఎంతవరకు రాణిస్తారో చూడాలి మరి.

# అలజడి రేపుతున్న కొలికపూడి



విజయవాడ అక్టోబరు 22,

టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ మరోసారి అలజడి రేపారు. తిరువూరులో ఆయన మాట్లాడుతూ ఎంపీ కేశినేని చిన్నిపై తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఇద్దరి మధ్య ఉన్న విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. మరోవైపు కొలికపూడిపై టీడీపీ నేతలు ధ్వజమెత్తుతున్నారు. ప్రశాంతంగా ఉన్న తిరువూరులో కావాలనే కలకలం రేపుతున్నారని మండిపడుతున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిని టార్గెట్ చేస్తూ కొలికపూడి తీవ్ర విమర్శలు చేశారు. పార్టీ పదవులు అమ్ముకుంటూ అవినీతి పాల్పడుతున్నారని మండిపడ్డారు. గతంలో పార్టీ పదవులు ఇచ్చేందుకు క్షేత్రస్థాయిలో లీడర్లు తిరిగే వాళ్లని ఇప్పుడు ఎంపీ కార్యాలయంలోనే కూర్చొని పదవులు డబ్బులు ఇచ్చే వాళ్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. రేషన్ మాఫియా, ఇసుకు మాఫియా నడుపుతూ పార్టీ పదవులు అమ్ముకుంటున్నారని అన్నారు. ఎంపీ కార్యాలయంలోని మూల్పూరి కిశోర్ చేస్తున్న దందాతో పార్టీ నేతలకు అన్యాయం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ కార్యాలయం కేంద్రంగా సాగుతున్న దందాను అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు కొలికపూడి. ఈ నెల 24న రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. తిరువురులో జరుగుతున్న పరిణామాలు వివరిద్దామని కార్యకర్తలకు సూచించారు. అయితే ఎంపీపై కొలికపూడి చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. దీంతో కొలికపూడిపై టీడీపీ నేతలు మండిపడుతున్నారు. ప్రశాంతంగా ఉన్న ప్రాంతంలో రాజకీయ అలజడి రేపుతున్నారని ఆగ్రహంతో ఉన్నారు. కొలికపూడి మద్యం దుకాణాల నుంచి నెల నెల వసూళ్లు చేస్తున్నారని, మట్టి మాఫీయను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగుల బదిలీల కోసం కూడా కొలికపూడి డబ్బులు వసూలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కూడా కొలికపూడి ఏదో రకంగా వార్తాల్లో ఉంటూ వస్తున్నారు. పార్టీలో తిరుగుబాటు చేస్తూ, ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తూ ఇప్పటికే అధిష్ఠానం వద్ద పలుమార్పులు క్లాస్‌లు కూడా తీసుకున్నారు. ఇప్పుడు మరో కొత్త వివాదంతో మరోసారి సంచలనంగా మారుతున్నారు. పలు మార్లు చంద్రబాబు, ఇతర నేతలు పిలిచి ఆయనకు హితబోధ చేశారు. కానీ ఆయనలో మార్పు కనిపించలేదు.

# పెట్టుబడి వేటలో లోకేష్

విశాఖపట్నం అక్టోబరు 22,



ఏపీ ప్రభుత్వం దూకుడు పెంచింది. పెట్టుబడుల వేటలో పడింది. ఒకవైపు మంత్రి నారా లోకేష్ ఇప్పటికే ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నారు. సీఎం చంద్రబాబు నవంబర్ మొదటి వారంలో లండన్ పర్యటనకు వెళ్ళనున్నారు. అయితే తాజాగా ఈరోజు గల్ఫ్ దేశాల పర్యటనకు బయలుదేరనున్నారు చంద్రబాబు. దుబాయ్, అబుదాబి, యూఏఈ లో పర్యటించనున్నారు. వచ్చే నెలలో విశాఖలో పెట్టుబడుల సదస్సు జరగనుంది. పారిశ్రామికవేత్తల కోసం ఆయన పర్యటన కొనసాగునుంది. స్వయంగా ఆదేశాలకు వెళ్లి పారిశ్రామికవేత్తలతో రోడ్ షో నిర్వహించనున్నారు .పెట్టుబడులను ఆహ్వానించనున్నారు. ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూల వాతావరణాన్ని వారికి వివరించనున్నారు.

ప్రధానంగా ఏపీలో రియల్ ఎస్టేట్, భవన నిర్మాణం, లాజిస్టిక్స్, రవాణా, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్నోవేషన్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆయన పారిశ్రామికవేత్తలను ఆహ్వానించనున్నారు. వివిధ దేశాల నుంచి పెట్టుబడుదారులను ఆకర్షించి.. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి బాటలు వేయాలని భావిస్తున్నారు. సీఎం చంద్రబాబు వెంట మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి వెళ్ళనున్నారు. వివిధ శాఖల ఉన్నతాధికారులను సైతం తీసుకెళ్లనున్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అవకాశాలను పారిశ్రామికవేత్తలకు వీరంతా వివరించనున్నారువచ్చే నెలలో విశాఖలో పెట్టుబడుల సదస్సు జరగనుంది. ప్రపంచ దిగ్గజ సంస్థలు కూడా వచ్చే అవకాశం ఉంది. ఏపీ ప్రభుత్వం వారితో కీలక ఒప్పందాలు చేసుకునే పరిస్థితి ఉంది. అందుకే ఇప్పుడు భారీగా పెట్టుబడులు వచ్చే వీలుగా సీఎం చంద్రబాబు గల్ఫ్ పర్యటనకు వెళ్తున్నారు. అక్కడ ఉండే ఎన్నారై, ప్రవాసాంధ్రులను సైతం కలవనున్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టించే వీలుగా వారిని ఒప్పించనున్నారు. మరోవైపు నవంబర్ రెండు నుంచి ఐదు వరకు లండన్ పర్యటనకు వెళున్నారు చంద్రబాబు. అది కూడా పెట్టుబడుల సాధనే లక్ష్యంగా కొనసాగనుంది. ఏపీ అభివృద్ధికి పరిశ్రమల రాక అనేది కీలకం అని భావిస్తున్న కూటమి ప్రభుత్వం.. విశాఖ పెట్టుబడుల సదస్సును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గతంలో సీఎం చంద్రబాబు సింగపూర్, దావోస్ లలో పర్యటించి పెట్టుబడుదారులను ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియా, సీఎం చంద్రబాబు గల్ఫ్ దేశాల పర్యటన ఒకే సమయంలో జరుగుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఏపీకి భారీగా పెట్టుబడులు వస్తాయని మాత్రం ఒక అంచనా ఉంది.

# నక్వీకి వార్నింగ్.

ముంబై, అక్టోబరు 22,
పాకిస్తాన్ దేశమే కాదు.. అక్కడి పాలకులు కూడా దుర్మార్గులే. ఇది అనేక సందర్భాల్లో నిరూపితమైంది. ఇప్పుడు కూడా నిరూపితం అవుతోంది. చివరికి క్రికెట్ జట్టును పర్యవేక్షించే వ్యక్తులు కూడా దుర్మార్గంగానే వ్యవహరిస్తున్నారు. భారత్ మీద విషాన్ని కక్కుతున్నారు. ప్లేయర్లు మాత్రమే కాదు.. బోర్డును పర్యవేక్షించేవారు కూడా ఇలా వ్యవహరించడం పట్ల యావత్ క్రికెట్ ప్రపంచం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇటీవల ఆసియా కప్ జరిగింది. ఇందులో టీమిండియా ఫైనల్ మ్యాచ్లో పాకిస్తాన్ జట్టుపై అద్భుతమైన విజయం సాధించింది. ట్రోఫీ అందుకునే విషయంలో టీమిండియా నిరసన వ్యక్తం చేసింది. పహల్గాం దాడి, సరిహద్దు వద్ద ఉద్రిక్తతలు వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని టీమిండియా ఎసిసి చీఫ్, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ మోసిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకోవడానికి ఆసక్తిని ప్రదర్శించలేదు. టీమిండియా ప్లేయర్ల నిరసన నేపథ్యంలో ఎసిసి చీఫ్ ఆసియా కప్, మెడల్స్ తన వెంట తీసుకొని పోయారు. నఖ్వీ వ్యవహరిస్తున్న తీరు పట్ల భారత క్రికెట్ మేనేజ్మెంట్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆసియా కప్ ఫైనల్ జరిగిన రెండు రోజుల తర్వాత ఎసిసి ఎజిఎం సమావేశంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతేకాదు ఎసిసి చీఫ్ కు గట్టి హెచ్చరికలు పంపించింది. ట్రోఫీ సరైన విధానాల్లో పంపించాలని.. లేకపోతే పర్యవసనాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. కాదు అధికారిక ఈమెయిల్ ద్వారా కూడా సందేశం పంపించింది. అయితే ఇప్పటివరకు ఏసీసీ చీఫ్ నుంచి ఎటువంటి ప్రత్యుత్తరం రాలేదు. దీంతో ఈ విషయాన్ని అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలికి తెలియజేస్తామని ఇప్పటికే భారత క్రికెట్ యాజమాన్యం ప్రకటించింది. ట్రోఫీని తమ వద్దకు ఎలా రప్పించుకోవాలో తెలుసని.. ఎందుకు దశలవారీగా ముందుకు సాగుతామని భారత క్రికెట్ యాజమాన్య ప్రకటించింది.. అయితే ఎసిసి కార్యాలయంలో భారత జట్టుకు ట్రోఫీ అందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని నఖ్వీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఎసిసి చీఫ్ గా మాత్రమే కాకుండా, నఖ్వీ పాకిస్తాన్ మంత్రిగా కూడా ఉన్నారు. దీంతో అతని చేతుల మీదుగా ఎట్టి పరిస్థితుల్లో ట్రోఫీని తీసుకునే పరిస్థితి లేదని బీసీసీ స్పష్టం చేసింది. అయితే అంతర్జాతీయ మీడియాలో వస్తున్న కథనాల ప్రకారం ఆసియా కప్ దుబాయ్ లోని ఏసీసీ కార్యాలయంలోనే ఉందని తెలుస్తోంది.

# 66వేలపెట్టుబడి.. 660 రూపాయిల ఆదాయం

ముంబై, అక్టోబరు 22,
ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉల్లి రైతులకు కోయకుండానే కన్నీళ్లు వస్తున్నాయి. పెట్టిన పెట్టుబడిలో పదో వంతు కూడా వారి చేతికి రావడం లేదు. కనీసం పంటను మార్కెట్కు తరలించిన ఖర్చులు కూడా రాకపోవడంతో.. అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడం.. చేతికొచ్చిన ఆ మాత్రం పంటకు రేటు లేకపోవడంతో భారీ నష్టాలను చవిచూస్తున్నారు. మరికొందరు రైతులు.. పంటను కోసి, వాటిని మార్కెట్కు తీసుకెళ్లినా ఆ ఖర్చులు కూడా రావడం లేదని.. పంటను కోయకుండా అలాగే పొలాల్లో వదిలేస్తున్నారు. మహారాష్ట్ర రైతు సుదామ్ ఇంగ్లే ఉల్లి సాగు కోసం రూ.66 వేల పెట్టుబడి పెట్టారు. భారీ వర్షాల కారణంగా పంట దెబ్బతినడంతో.. 7.5 క్వింటాళ్ల ఉల్లి పంట మాత్రమే వచ్చింది. ఆ ఉల్లి పంటను మార్కెట్కు తరలించగా.. రవాణా ఖర్చులు పోను ఆయనకు కేవలం రూ. 664 మాత్రమే మిగిలాయి. పెట్టుబడి కూడా తిరిగి రాకపోవడంతో ఆవేదన చెందిన సుదామ్ ఇంగ్లే.. మిగిలిన పంటను అమ్మడం కంటే పొలానికి ఎరువుగా మార్చడమే మేలు అని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఎడతెరిపి లేని వర్షాలు, ధరలు భారీగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని.. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే రైతుల ఆత్మహత్యలు పెరుగుతాయని తీవ్ర హెచ్చరికలు చేశారు. ఈ దయనీయ పరిస్థితి మహారాష్ట్రలోని ఉల్లి, టమోటా, సోయాబీన్ వంటి అనేక పంటలు సాగు చేసే రైతులందరిదీ అని ఈ వార్త తెలియజేస్తోంది. పంట కోసం ఆరుగాలం శ్రమించిన అన్నదాతలకు ఈసారి మిగిలింది కన్నీరేనని తీవ్ర ఆవేదన వ్యక్తం అవుతోంది. పెట్టుబడి ఖర్చులు కూడా తిరిగి రాకపోగా.. కనీసం మార్కెట్కు పంటను తరలించిన రవాణా ఖర్చులూ దక్కని దయనీయ పరిస్థితి మహారాష్ట్ర రైతన్నలను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. మహారాష్ట్ర పూణే సమీపంలోని పురందర్కు చెందిన రైతు సుదామ్ ఇంగ్లే.. తన పొలంలో ఉల్లి సాగు కోసం సుమారు రూ.66 వేల ఖర్చు చేశారు. అయితే ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా పంట పూర్తిగా దెబ్బతింది. అయినప్పటికీ.. కొంత భాగాన్ని కాపాడి దాన్ని బస్తాల్లో నింపి.. రూ.1,500 ఖర్చు చేసి పురందర్ మార్కెట్ యార్డుకు తరలించారు. అక్కడ 7.5 క్వింటాళ్ల ఉల్లిపాయలను విక్రయించగా.. రవాణా, లోడింగ్ ఖర్చులు (రూ. 1,065) పోను ఆయన చేతికి వచ్చింది కేవలం రూ. 664 మాత్రమే. అంటే రూ.66 వేలు ఖర్చు పెడితే కనీసం వెయ్యి రూపాయలు కూడా మిగలలేదు. ఆ రైతు అమ్మిన ఉల్లిపాయలు నష్టం ఆధారంగా కిలోకు రూ. 3, రూ. 2, రూ. 10 చొప్పున అమ్ముడుపోయాయని తెలుస్తోంది. తనకు జరిగిన నష్టాన్ని చూసి సుదామ్ ఇంగ్లే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక ఎకరం భూమి నుంచి వచ్చిన పంట మాత్రమేనని.. తనకు మరో ఒకటిన్నర ఎకరాల్లో ఉల్లి పంట ఉందని పేర్కొన్నారు. దాన్ని మార్కెట్కు తీసుకెళ్లి మరింత నష్టపోవడం కంటే.. రోటవేటర్ వేసి పొలానికి ఎరువుగా మార్చేస్తానని చెప్పారు. అమ్మడం కంటే అదే లాభదాయకమని వాపోయారు. తన లాంటి పెద్ద రైతుల పరిస్థితే ఇలా ఉంటే.. అప్పులు చేసి సాగు చేస్తున్న చిన్న రైతులు ఎలా బతకాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతాయని ఆయన హెచ్చరించారు. మహారాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతుల పరిస్థితి ఇదే విధంగా ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలు.. పడిపోతున్న ధరలు అన్నదాతల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఉల్లిపాయలు, టమోటాలు, బంగాళాదుంపల నుంచి దానిమ్మ, సీతాఫలం, సోయాబీన్ వరకు దాదాపు ప్రతీ పంట పండించిన రైతుకు ఈ సీజన్లో ఇలాంటి పరిస్థితే ఎదురైందని చెబుతున్నారు. నాసిక్ ప్రాంతంలో ఏకంగా 80 శాతం ఉల్లిపాయ పంట వర్షాల కారణంగా దెబ్బతినగా.. కాపాడిన పంట కూడా నాణ్యత లేకపోవడం వల్ల అతి తక్కువ ధరలకు అమ్ముడవుతోంది. చేతిలో డబ్బు లేకపోవడంతో రైతులు కొనుగోలు శక్తిని కోల్పోయారు. దీంతో గ్రామీణ మార్కెట్లలో దీపావళి కళ పూర్తిగా కరువైంది. నగరాల్లో మాత్రమే దీపావళి వేడుకలు జరుగుతున్నాయని.. పల్లెల్లో దీపం కొనుక్కోవడానికి కూడా డబ్బు లేదని పేర్కొంటున్నారు. రైతులు ప్రభుత్వ విధానాలను కూడా తప్పుబట్టారు. 2023లో ఉల్లి ధరలు పెరిగినప్పుడు కేంద్రం ఎగుమతులను నిషేధించడం వల్ల ఇతర దేశాలు అంతర్జాతీయ మార్కెట్ను ఆక్రమించాయని, దీనివల్ల భారతదేశం తమ ఎగుమతి వాటాను కోల్పోయిందని ఆరోపించారు. ధరలు పెరిగినప్పుడు ఎగుమతిని నిషేధించిన ప్రభుత్వం.. మార్కెట్ ధరలు కుప్పకూలినప్పుడు గిట్టుబాటు ధర ఇచ్చి ఉల్లి పంటను కొనుగోలు చేయదా అని ప్రశ్నించారు. వ్యవసాయం అంటే కష్టాల జీవితమేనా అని రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. రైతులు గిట్టుబాటు ధర పొందగలిగితేనే రాష్ట్రంలో నేరాలు తగ్గుతాయని.. నిరుద్యోగ యువత నేరాల వైపు వెళ్లదని రైతు నాయకులు అభిప్రాయపడ్డారు.

# అమీన్ పూర్ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం లో కార్తీక పూజలు

సంగారెడ్డి అక్టోబరు 22,
కార్తీక మాసం వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడలో ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం లో కూడా ఇవాళ మొదటి రోజు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున దేవాలయానికి తరలివచ్చి, భగవంతునికి అభిషేకాలు, ఆరతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు మధుపతి మాట్లాడుతూ, ఈ దేవాలయం ఆరో శతాబ్దానికి చెందినది. బృగు మహర్షి ఇక్కడ తపస్సు చేశారని పూరాణాల్లో ప్రస్తావన ఉంది, ఇక్కడి నుండి శ్రీశైలం వరకు సొరంగ మార్గం ఉందని చెబుతారు అన్నారు. కార్తీక మాసం నెలరోజుల పాటు ప్రతిరోజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. భక్తులు విరివిగా పాల్గొని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆశీర్వాదం పొందాలని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.
==================================

# తుకారాంగేట్ పీఎస్ పరిధిలో యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్ అక్టోబరు 22,
తుకారాం గేట్ పీఎస్ పరిధి అడ్డగుట్ట డీ సెక్షన్ లో యువకుడు ఇంట్లో ఫ్యాన్ కు ఉరి వేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతుడు మహేష్(38) కు భార్య ఇద్దరు పిల్లలు వున్నారు. మద్యానికి బానిసై ఆరోగ్య, కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడు.

# హెగ్డే ఆసుపత్రిలో సంతానలేమిపై అవగాహన కార్యక్రమం

హైదరాబాద్ అక్టోబరు 22,
సంతానలేమి సమస్యలతో బాధపడుతున్న జంటలకు హెగ్డే ఫెర్టిలిటీ హాస్పిటల్ చక్కటి పరిష్కారం అందిస్తుందని డాక్టర్ వందన హెగ్డే తెలిపారు. హైదరాబాద్ హెగ్డే హాస్పిటల్ ఫెర్టినిటీ సెంటర్ ఆధ్వర్యంలో ఇన్ఫెర్టిలిటీ అంశంపై పేషెంట్లకు అవగాహన కల్పించారు. ఆధునిక జీవనశైలిలో మార్పుల కారణంగా సంతానాలు ఏమి సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని ఆమె తెలిపారు. సంతానం కలగకపోవడానికి కారణం కేవలం స్త్రీలు మాత్రమే కాదని పురుషులలో వీర్యకణాల సమస్య కారణము ఉండవచ్చని తెలిపారు. స్త్రీలలో పిసిఓడి లాంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు . ఇలాంటి సమస్యలకు వైద్యుల సలహాలు తీసుకుని పరీక్షలు చేయించుకుంటే సంతానోత్పత్తి కలుగుతుందని వందనా తెలిపారు.
==========================

# బాలానగర్ పోలీసు స్టేషన్ లో ఓపెన్ హౌస్

హైదరాబాద్ అక్టోబరు 22,
దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులను స్మరించుకుంటూ,ప్రతి ఏటా అక్టోబర్ 21 న పోలీసు అమరవీరుల సంస్మరణ దినం తో పాటు అక్టోబర్ 21 నుండి 31 వరకు పోలీసు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం బాలా నగర్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని బాలా నగర్ డిసిపి సురేష్ కుమార్ ప్రారంభించారు. దేశ రక్షణ,ప్రజల భద్రత కోసం అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటు?సమాజానికి పోలీసులు అందించే సేవలను విద్యార్థులకు వివరించారు పోలీసులు. బాలానగర్ డిసీపీ సురేష్ కుమార్ మాట్లాడుతూ?నేరాల నియంత్రణలో పోలీసులు పాత్రను వివరించడమే కాకుండా,షీ టీమ్స్,సైబర్ క్రైమ్,ఆయుధ చట్టం వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి,బాలానగర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది,వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.
====================================

# జీవీకే లో 200 మంది విద్యార్థులకు ఎంబిబిఎస్ పట్టాల ప్రదానం

హైదరాబాద్ అక్టోబరు 22,
జీవీకే ఎడ్యూటెక్ టెక్ సంస్థ డైరెక్టర్ డా.జి.విద్యా కుమార్ బ్రదర్స్ ఆధ్వర్యంలో విదేశాలలో ఎంబిబిఎస్ విద్యను పూర్తిచేసుకున్న 200 మంది విద్యార్థులకు పట్టా ప్రదానం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ డాక్టర్ రామచంద్రనాయక్, మాజీ సెంట్రల్ యూనియన్ మినిస్టర్ డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి, మాజీ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాబరణం కృష్ణ మోహన్ రావ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటి స్పీకర్ రామచంద్ర నాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో మెడికల్ సీట్లు పెంచి మెడికల్ విద్యను పేద ప్రజలకు అందిస్తున్నారని కొనియాడారు. ప్రైవేట్ లో మెడికల్ విద్యను అభ్యసించాలంటే చాలా ఖర్చుతో కూడుకుందని అలాంటి వారికోసం జీవీకే సంస్థ వారు యువతకు చేయూతను అందించే విధంగా ఎంబిబిఎస్ ను విదేశాలలో తక్కువ ఫీజులతో పూర్తి చేయించడం ఎంతో అభినందనీయమన్నారు. విదేశాలలోని వైద్య కళాశాలతో ఒప్పందం కుదుర్చుకొని 20 లక్షలలో పూర్తి చేయటం గొప్ప విషయమన్నారు. తెలంగాణ యువతను విద్య, వైద్యం వైపు నడిపిస్తున్న జీవీకే బ్రదర్స్ కు అభినందనలు తెలిపారు. విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించి రాష్ట్రానికి సేవలందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని దుయ్యబట్టారు. డాక్టర్ అయిన వారు మెరుగైన వైద్యం అందించే దిశగా కృషి చేయాలని విద్యార్థులకు డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్ హితవు పలికారు.

# తొమ్మిదవ అంతస్థు పై నుంచి పడి కార్మికుడికి తీవ్ర గాయాలు

రాజేంద్రనగర్ అక్టోబరు 22,
తొమ్మిదవ అంతస్తు నుండి కారు మీద పడి ఓ కార్మికునికి తీవ్ర గాయాలు అయ్యాయి. అత్తాపూర్ లో ఘటన జరిగింది. పెద్ద శబ్దం రావడంతో అపార్ట్మెంట్ వాసులు బయటకు పరుగులు తీసారు. పార్క్ చేసిన కారు మీద కార్మికుడిని చూసి భయభ్రాంతులను గురైయారు. అతడినిహుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

# నేడు భగినీ హస్త భోజనం


**–కార్తీక శుద్ధ విదియ నాడు సోదరి ఇంట్లో సోదరుడు భోజనం చేస్తారో వారికి నరలోక ప్రాప్తి, అపమృత్యు భయం ఉండదు**
**–సోదరీమణులకు భగినీ హస్త భోజన శుభాకాంక్షలు**

( పెండ్యాల రామ్ కుమార్ మంథని )




భగిని' అంటే...చెల్లెలైనా కావచ్చు., అక్క అయినా కావచ్చు. 'హస్తభోజనం' అంటే... చేతి భోజనము అని అర్థం. అంటే.. సోదరి చేతివంట సోదరుడు తినడం అన్నమాట. ఇందులో కొత్త విషయం ఏముందని మీరు అడగచ్చు. సాధారణంగా వివాహమైన చెల్లెలు, అక్క ఇంటిలో తల్లిదండ్రులుగానీ., అన్నదమ్ములుగానీ భోజనం చేయడానికి ఇష్టపడరు. కారణం తినకూడదని కాదు. ఆడపిల్ల ఋణం ఉంచుకోవడం పుట్టింటివారికి ఇష్టం ఉండదు. శుభసందర్భాలలో., శుభకార్యాలలో వచ్చి భుజించినా తప్పులేదు కానీ., ఊరికే వచ్చి తినడం మర్యాద కాదని మన సాంప్రదాయం. కానీ కార్తీక శుద్ధ విదియనాడు మాత్రం వివాహం అయిన సోదరి ఇంటిలో సోదరుడు భుజించితీరాలని శాస్త్రం నిర్ణయించింది. దీనికి ఓ కథ కూడాఉంది. ఆ కథ ఏమిటంటే.... సూర్యభగవానునకు సంధ్యాదేవి వలన కలిగిన సంతానంలో యముడు, యమున ఒకరు. 'యమునకు' అన్నయ్య 'యముడు' అంటే ఎంతో ఇష్టం. యమునకు కూడా అంతే. యముడు తన చెల్లెలును ప్రేమగా 'యమీ' అని పిలిచేవాడు. యమునకు వివాహం జరిగింది. అత్తవారింటికి కాపురానికి వెళ్లింది. ఒకరోజు యమునకు తన అన్నను చూడాలని కోరిక కలిగింది. తన ఇంటికి విందుకు రమ్మని యమధర్మరాజుకు వర్తమానం పంపింది. విందుకు వస్తానని యమధర్మరాజు యమునకు మాట ఇచ్చాడు. అ రోజు అన్నయ్యకు ఇష్టమైన పదార్థాలన్నీ చేసి అన్నయ్య రాకకోసం ఎదురుచూస్తూ కూర్చుంది యమున. ఎంతసేపయినా అన్నయ్య రాలేదు. ఈ రోజు పని వత్తిడి వల్ల రాలేకపోతున్నానని, 'కార్తీక శుద్ధ విదియ' నాడుతప్పకుండా విందుకు వస్తానని చెల్లెలికి వర్తమానం పంపాడు యమధర్మరాజు. యమున సంతోషించి ఆ రోజున కూడా తన అన్నయ్యకు ఇష్టమైన పదార్థాలన్నీ తయారుచేసింది. అన్నమాట ప్రకారం యమధర్మరాజు చెల్లెలు ఇంటికి విందుకు వచ్చాడు. యమున తన అన్నయ్య నుదుట పవిత్ర తిలకం దిద్ది, పూలమాల వేసి తను చేసిన పదార్థాలన్నీ అన్నకు కొసరి కొసరి వడ్డించి ప్రేమగా తినిపించింది. చెల్లెలు అనురాగానికి ముగ్ధుడైన యమధర్మరాజు ఏ వరం కావాలో కోరుకో' అని అడిగాడు. 'ప్రతి యేడు ఇదే కార్తీక శుద్ధ విదియ నాడు తన ఇంటికి విందుకురావాలనీ, అలాగే ప్రతి సోదరుడు ఈ రోజున తన సోదరి చేతి భోజనం భుజించాలనీ' వరం కోరుకుంది యమున. యమధర్మరాజు ఆ వరాన్ని యమునకు అనుగ్రహించాడు. అలాగే ఎవరైతే ఈనాడు సోదరి ఇంట్లో భోజనం చేస్తారో వారికి నరలోక ప్రాప్తి కాని , అపమృత్యు భయం కానీ ఉండకుండా చూడమని వరం అడగగా యముడు వరం ప్రసాదించాడు. అందుకే ఈ రోజున ప్రతి సోదరుడు వివాహం అయిన తన సోదరి చేతి భోజనం చేయాలని శాస్త్రం నియమం విధించింది. ఆ నియమం ఇప్పటికీ చాలా చోట్ల కొనసాగుతోంది. మహారాష్ట్రలో ఈ పండుగను 'భయ్యా-దుజ్' అని పిలుస్తారు.- నేపాల్ ప్రాంతంలో ఈ పండుగను 'భాయి-టికా' అని పిలుస్తారు.- పంజాబ్ ప్రాతంలో ఈ పండుగను 'టిక్కా' అని పిలుస్తారు. మరుసటిరోజున అన్న చెల్లెలిని భోజనానికి పిలవాలి. దీనిని 'సోదరి తృతీయ' అంటారు.

# చెత్తతో కరెంట్ తయారీ



తిరుపతి, అక్టోబరు 22,
తిరుపతిలో చెత్తతో కరెంటు తయారు చేసే ప్లాంట్ మళ్ళీ మొదలైంది! 2016లో ఆగిపోయిన ఈ ప్రాజెక్టును ఇప్పుడు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ముందుకు తెచ్చింది. 33 ఎకరాల్లో 12 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు మంత్రి ఆదేశాలతో కసరత్తు చేస్తున్నారు. చెత్తను వేరు చేసి, మండించి, విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. దీనితో తిరుపతి చెత్త సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయబోతోంది. తిరుపతి సమీపంలో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటుకు మళ్లీ ప్రయత్నాలు మొదలయ్యాయి. 2016లో రూ.100 కోట్లతో 12 మెగావాట్ల సామర్థ్యంతో ఈ ప్లాంట్ పెట్టాలని అనుకున్నారు. అప్పట్లో జిందాల్ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఒప్పందం కూడా జరిగింది. కానీ స్థలం దొరక్క ఆగిపోయింది.. దీంతో ఆ ప్రాజెక్ట్ అక్కడితో ఆగిపోయింది. ఇప్పుడు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఈ ప్రాజెక్టును మళ్లీ ముందుకు తెచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి క్లస్టర్ పరిధిలో 33 ఎకరాల స్థలాన్ని గుర్తించాలని జులైలో ఆదేశాలు ఇచ్చింది. పురపాలక శాఖ మంత్రి నారాయణ కూడా ఈ విషయంలో ఆలస్యం చేయొద్దని అధికారులకు సూచించారు. దీంతో అధికారులు ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్లాంట్ వస్తే తిరుపతిలో చెత్త సమస్యకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నారు. తిరుపతి సమీపంలో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు చేస్తే.. ఈ ప్లాంట్లో, ముందుగా చెత్త బరువును తూకం వేస్తారు. ఆ తర్వాత, అందులోని లోహాలు, కరగని ప్లాస్టిక్, టైర్లు, గాజు వస్తువులు, భవనాల వ్యర్థాలు వంటి వాటిని వేరు చేస్తారు. మండేందుకు అనువైన చెత్తను ఒక నిల్వ కేంద్రంలో (స్టోరేజ్ పిట్) నింపుతారు. ఈ నిల్వ కేంద్రంలో ఏడు వేర్వేరు భాగాలు ఉంటాయి. ప్రతి రోజు ఒక భాగంలో చెత్తను నిల్వ చేయడం ద్వారా, దానిలోని తడి శాతాన్ని తగ్గిస్తారు . ఎనిమిదో రోజున, ఆటోమెటిక్ క్రేన్ల సహాయంతో స్టోరేజ్ పిట్ నుంచి చెత్తను బాయిలర్లోకి పంపుతారు. బాయిలర్లో చెత్తను మండించడం వల్ల అందులోని నీరు ఆవిరిగా మారుతుంది. ఈ ఆవిరి శక్తిని ఉపయోగించి విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. ఉత్పత్తి అయిన విద్యుత్తును బాయిలర్ పక్కనే ఉన్న స్విచ్ యార్డుకు పంపిస్తారు. అక్కడి నుంచి, ఈ విద్యుత్తును ఏపీఎస్పీడీసీఎల్ గ్రిడ్కు అనుసంధానం చేస్తారు. ఈ విధంగా, వ్యర్థాలను ఉపయోగకరమైన విద్యుత్తుగా మార్చే ప్రక్రియ జరుగుతుంది. ఈ పద్ధతి పర్యావరణానికి మేలు చేయడంతో పాటు, విద్యుత్ అవసరాలను తీర్చడంలో కూడా సహాయపడుతుంది. చెత్తను వేరు చేయడం, నిల్వ చేయడం, ఆపై మండించి విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. చెత్తను బాయిలర్లో కాల్చినప్పుడు, వెలువడే వాయువులను ఫ్లూగ్యాస్ క్లీనింగ్ పద్ధతిలో శుద్ధి చేస్తారు. ఈ ప్రక్రియలో స్లాక్డ్ లైమ్, యాక్టివేటెడ్ కార్బన్ వంటివి వాడతారు. శుద్ధి చేసిన వాయువులను 65 మీటర్ల ఎత్తులో ఉన్న పొగగొట్టం ద్వారా బయటకు వదులుతారు. చెత్తను కాల్చగా 14 శాతం ఫ్లైయాష్ మిగులుతుంది. ఈ ఫ్లైయాష్తో రోజుకు 7500 ఇటుకలు తయారు చేయవచ్చు. ఇలా చేయడం వల్ల వ్యర్థాల నిర్వహణతో పాటు, ఇటుకల తయారీకి అవసరమైన ముడిసరుకు కూడా లభిస్తుంది. కర్నూలు సభలో ఆసక్తికర సన్నివేశాలుతిరుపతి, చంద్రగిరి పరిసరాల్లో 12 మెగావాట్లతో ఈ పవర్ ప్లాంట్ ప్లాన్ చేస్తున్నారు. రోజుకు 600 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు అవసరం అవుతాయి. తిరుపతి నగరంలో పోగయ్యే చెత్త 227 మెట్రిక్ టన్నులు ఉంటుంది. ప్లాంటుకు రోజుకు 90 మెట్రిక్ టన్నుల చెత్త తరలిస్తారు.. మిగతాది తిరుపతి పరిసరాల నుంచి సేకరిస్తారు. ప్లాంటుకు రోజుకు 500 కేఎల్డీ నీళ్లు అవసరం అవుతాయి అంటున్నారు. మొత్తం మీద పవర్ ప్లాంట్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి.

# జూబ్లీ హిల్స్ లో మంత్రి సీతక్క ప్రచారం



హైదరాబాద్ అక్టోబరు 22,
జూబ్లీహిల్స్ నియోజకవర్గం బోరబండ డివిజన్ ఫేజ్ -1 ఇంటింటీ ప్రచారం లో మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఇతర నాయకులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,. ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలకు నిరంతరం కృషి చేస్తుందని.. ప్రజల సమస్యలు తీర్చడంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ చేతి గుర్తుపైన ఓటు వేసి నవీన్ యాదవ్ గారిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ కు మూడు సార్లు అవకాశం ఇచ్చిన అభివృద్ధి జరగ లేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉన్నా కనీసం రేషన్ కార్డులు ఇవ్వలేదు. జూబ్లీహిల్స్ లో కనీస సదుపాయాలు కరువయ్యాయి. అందుకే జూబ్లీహిల్స్ నియోజవర్గం అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ గెలవాలని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఎక్కడ కష్టం వచ్చినా వాలిపోతాడు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం అధికార కాంగ్రెస్ కు పట్టం కట్టండి. ఇప్పటికే రూ.150 కోట్ల పనులు మంజూరయ్యాయి. పేదల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్, ఉచిత బస్సు రవాణ, లక్షల సంఖ్యలో రేషన్ కార్డులు పంపిణి చేశాం. పేదల కడుపు నింపేందుకు సన్నబియ్యం ఇస్తున్నాం. 4.5 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నాం. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం నవీన్ యాదవ్ ను గెలిపించుకోవడం చాలా అవసరమని అన్నారు.

భారత శక్తి

23-10-2025 , గురువారం

# రైల్వే టిక్కెట్ రీ షెడ్యూల్ అవకాశం



హైదరాబాద్, అక్టోబరు 22.
దేశంలో ప్రతిరోజూ కోట్లాది మంది ప్రజలు రైలులో ప్రయాణం చేస్తున్నారు. ఈ ప్రయాణికుల కోసం రైల్వే శాఖ వేలాది రైళ్లను నడుపుతోంది. తద్వారా ప్రజలు తక్కువ ఖర్చుతో సులభంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. అయితే, కొన్నిసార్లు ప్రయాణం ఫిక్స్ చేసుకున్నాక అనుకోకుండా మీ జర్నీ ప్లాన్ మారుతుంది. అతి కష్టమ్మీద బుక్ చేసుకున్న టికెట్ రద్దు చేసుకుంటే మళ్లీ బుక్ చేసుకోవడం కష్టమే. అందుకే మీరు టిక్కెట్‌ను క్యాన్సిల్ చేసుకోవలసిన అవసరం లేదని రైల్వేశాఖ చెబుతోంది. టికెట్ క్యాన్సిల్ సమస్యను పరిష్కరించడానికి, భారత రైల్వేశాఖ ఇప్పుడు ఒక కొత్త నియమాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, మీ జర్నీ తేదీ మారితే, టికెట్‌ను క్యాన్సిల్ చేయవలసిన అవసరం లేదు. మీరు ఇదివరకు బుక్ చేసుకున్న టికెట్‌తో మరేదైనా తేదీలో ప్రయాణించవచ్చు. అయితే రైల్వేశాఖ ఇందుకోసం కొన్ని షరతులు విధించింది. ఈ కొత్త నియమం ఎలా పని చేస్తుంది, ఎవరికి ప్రయోజనం చేకూరుస్తుందో ఇక్కడ తెలుసుకోండి. టికెట్ బుకింగ్ సిస్టమ్‌లో పెద్ద మార్పులు చేయడానికి భారతీయ రైల్వేశాఖ సిద్ధమవుతోంది. ఇప్పుడు ప్రయాణికులు టికెట్‌ను రద్దు చేయకుండా, వారి ప్రయాణ తేదీని మార్చుకోవచ్చు. ఉదాహరణకు.. మీరు నవంబర్ 20న రైలు టికెట్ బుక్ చేసుకుంటే, జర్నీని నవంబర్ 22కి వాయిదా వేసుకోవాల్సి వస్తే.. అదే టికెట్‌ను రీషెడ్యూల్ చేయవచ్చు. ఈ సౌకర్యం ఎఖీఉఅ పోర్టల్ లేదా యాప్ ద్వారా బుక్ చేసుకున్న కన్ఫర్మ్ టిక్కెట్‌లకు మాత్రమే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రైల్వే ప్రయాణికులు పాత టికెట్‌ను రద్దు చేసుకుని, కొత్త టికెట్‌ను బుక్ చేసుకుంటున్నారు. తద్వారా టికెట్ క్యాన్సిల్ ఛార్జీలు చెల్లించాలి. కొత్త రూల్ ద్వారా ఈ ఇబ్బంది ఉండదు. కొత్త తేదీలో రైలు ఛార్జీలు ఎక్కువగా ఉంటే, ప్రయాణికుడు పెరిగిన ఛార్జీల వ్యత్యాసాన్ని చెల్లించాలి. ఈ మార్పు ప్రయాణికులకు రైల్వే డిజిటల్ సేవలను మరింత సౌకర్యవంతంగా చేస్తుంది. ఈ కొత్త నియమం ప్రయాణికులకు టికెట్ రద్దు చేయకుండా, వినియోగించుకునేందుకు ఉపశమనం కలిగిస్తుంది. చాలాసార్లు అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణాన్ని వాయిదా వేసుకుంటారు. దీనివల్ల టికెట్‌ను రద్దు చేస్తే 25 శాతం నుండచి 50 శాతం వరకు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో మరీ ఆలస్యమైతే ఎలాంటి రీఫండ్ కూడా ఉండదు. ఇకనుంచి రైల్వే ప్రయాణికులు తమ టికెట్‌ను రద్దు చేయకుండా ప్రయాణించాలని యోచిస్తోంది. అందుకు బదులుగా ట్రావెల్ డేట్ అప్‌డేట్ చేసుకుంటే సరిపోతుంది. రైల్వేశాఖ కొత్త రూల్ ద్వారా ప్యాసింజర్స్ సమయం, డబ్బు రెండు ఆదా అవుతాయి. కొత్త తేదీలో అదే సీటు మళ్లీ కన్ఫర్మ్ అవుతుందని కాదు. సీటు లభ్యత ఆధారంగా టికెట్ నెంబర్ మారుతుంది. నివేదికల ప్రకారం, రైలు మిస్ అయిన సందర్భంలో కూడా ప్రయాణికులకు పాక్షిక రీఫండ్ ఇవ్వాలని ప్లాన్ చేస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన ఇంకా విడుదల కాలేదు.

# ఇంటర్ లో తగ్గిన పాస్ మార్కులు



విజయవాడ అక్టోబరు 22,
ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈసాకి కాస్త ముందుగానే నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. వచ్చ ఏడాది ఫిబ్రవరి 23వ తేదీ నుంచి ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు మొదలవనున్నాయి. మరోవైపు ఇంటర్ పరీక్షల ఫీజు గడువు అక్టోబర్ 22వ తేదీతో ముగియనుంది. ఆ తర్వాత రూ.1,000 ఆలస్య రుసుముతో అక్టోబర్ 30 వరకు ఫీజు చెల్లింపుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు ఇటీవల తెలపింది. థియరీ పేపర్లకు రూ.600, ప్రాక్టికల్స్‌కు రూ.275, బ్రిడ్జికోర్సు సబ్జెక్టుకు రూ.165 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అయితే 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థుల పాస్ పర్సంటేజీ, పాస్ మార్కుల విధానంలోనూ కీలక మార్పులు రానున్నాయి. ఈ మేరకు తాజాగా ఇంటర్ బోర్డు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం ఇంటర్ జాగ్రఫీ పేపర్ మార్కుల విధానంలో గతంలో మాదిరి 35 శాతం మార్కులు రావల్సిన అవసరం లేదు. ఇకపై కనీసం 30 మార్కులు వచ్చినా ఉత్తీర్ణత పొందినట్లుగానే పరిగణిస్తారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఫస్ట్ ఇయర్ రెగ్యులర్ విద్యార్థులకు జాగ్రఫీ ప్రశ్నపత్రం 75 మార్కులకు ఉంటుంది. దీన్ని 85 మార్కులకు చేశారు. కొత్త మార్పులతో జాగ్రఫీని ఎలెక్టివ్ (ఛాయిస్) సబ్జెక్టుగా పరిగణిస్తారు. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రంతో సమానంగా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారు. అంటే జాగ్రఫీ ప్రాక్టికల్ పరీక్షలను 50 మార్కులకు బదులు 30 మార్కులకు నిర్వహిస్తారు. ఈ ప్రాక్టికల్ పరీక్షలో కనీసం 35 శాతం అంటే 11 మార్కులు రావాల్సి ఉంటుంది. దీన్ని 30%కి తగ్గించడంతో 9 మార్కులు వస్తే ఉత్తీర్ణత పొందినట్లుగా పరిగణిస్తారు. 2025-26 విద్యా సంవత్సరంలో రెగ్యులర్ అభ్యర్థులుగా ప్రవేశం పొందిన ఇంటర్ విద్యార్థులకు మాత్రమే ఇది వర్తిస్తుం

# 300 ఇళ్లు... 350 సర్కార్ కొలువులు

కడప అక్టోబరు 22,
కడపలోని పెద్ద తండా గ్రామం జిల్లాకే ఆదర్శంగా నిలుస్తోంది. 300 ఇళ్లున్న ఈ మారుమూల తండాలో.. ఒక్కరు ఇద్దరూ కాదు.. ఏకంగా 350 మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారు. కనీస సౌకర్యాలు లేని ప్రాంతం నుంచి వచ్చిన ఈ తండా వాసులు విద్య విలువను గుర్తించి కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదిగారు. పేదరికాన్ని జయించి, బాగా చదువుకుని ప్రభుత్వ కొలువులు సాధించారు. ఇళ్ల కన్నా.. ఎక్కువ సంఖ్యలో ఉద్యోగస్తులు ఉండటం ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరుస్తోంది. కొన్నాళ్ల క్రితం వరకు కూడా ఊరికో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే చాలా గొప్పగా భావించేవారు. అయితే ఇప్పుడు చాలా మంది యువత ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకుని ఆదిశగా కష్టపడుతున్నారు. కనుక ప్రతి గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పెరుగుతోంది. అయితే ఇప్పుడు మనం చెప్పుకోబోయే గ్రామం మాత్రం వీటన్నింటికి భిన్నం. ఇక్కడ మొత్తం ఇళ్ల సంఖ్య 300 అయితే ఉద్యోగాలు చేసే వారి సంఖ్య.. 350. వీరిలో ప్రభుత్వ ఉద్యోగులే అధికం. అవును మీరు విన్నది నిజమే. ఇక్కడి చాలా ఇళ్లలో తప్పనిసరిగా ఓ ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారు. కొన్ని ఇండ్లలో ఇద్దరు, ముగ్గురు కూడా ఉన్నారు. మరి ఇంత మంది ప్రభుత్వ కొలువులు సాధించారంటే ఇదేదో బాగా అభివృద్ధి చెందిన ప్రాంతం, పట్టణాలకు దగ్గరగా ఉన్న ప్రాంతం అనుకుంటే పొరపాటే.ఇదొక మారుమూల తండా. కనీస సౌకర్యాలకు ఆమడ దూరంలో ఉంది ఈ తండా. ఇక్కడ నుంచి కాలేజీకి వెళ్లాలంటే.. 50 కిలోమీటర్లు ప్రయాణించాలి. ఇంటికి దగ్గర్లోనే బడి ఉన్నా.. చదువుకోమంటే బద్దకించే వారు ఎందరో ఉన్నారు. కానీ ఈ తండా వాసులు మాత్రం అలా కాదు. వారికి చదువు విలువ తెలుసు. అందుకే గ్రామంలోని చాలా మంది బాగా చదువుకుని ప్రభుత్వ కొలువు సాధించి.. ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. మరి ఇంతకు ఈ తండా ఎక్కడ ఉంది అంటే.... కంభంవారిపల్లి మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ పరిధిలో ఉంది పెద్ద తండా. ఇది చుట్టు పక్కల గ్రామాలకు ఆదర్శరంగా నిలుస్తుంది. సుమారు 40 సంవత్సరాల క్రితం ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. వైద్యం, విద్య తండా వాసులకు అందని ద్రాక్ష. అలాంటి గ్రామం నేడు జిల్లాకే ఆదర్శంగా నిలుస్తోంది. ఊళ్లో ఇక్కడ సుమారు 300 గడపలు ఉంటే.. ఉద్యోగులు సుమారు 350 మంది ఉన్నారు.

అటవీ ప్రాంతం కావడంతో ఈ గ్రామస్తుల పుర్వీకులు.. కట్టెలు కొట్టి, అడవిని నమ్ముకొని జీవనం సాగించేవారుఅయితే తమలానే తమ పిల్లలు కష్టపడకూడదని భావించిన వారు.. పిల్లలను బాగా చదివించారు.

పిల్లలు కూడా తల్లిదండ్రుల కష్టాన్నిఅర్థం చేసుకుని.. బాగా చదివారు. ఎక్కువ మంది పట్టణ ప్రాంతాల్లోని వసతి గృహాల్లో ఉంటూనే చదివి, ఉన్నత స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం గ్రామంలో టీచర్లు, ప్రధానోపాధ్యాయులు, పోలీసులు, బ్యాంకు మేనేజర్లు, ఆర్టీసీ ఉద్యోగులు, టీటీడీ ఉద్యోగులు, వైద్యులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉన్నారు. వీరంతా నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన వారే కావడం విశేషం. పేదరికానికి భయపడకుండా బాగా చదవి.. మంచి ఉద్యోగం సాధించి.. ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు

# నారాయణ... నారాయణ



నెల్లూరు, అక్టోబరు 22, ఏపీ రాజకీయాల్లో పిఠాపురం నియోజకవర్గం ఎప్పుడూ హాట్ టాపిక్ గానే ఉంటుంది. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మను ఉద్దేశించి మంత్రి నారాయణ చేసినట్లుగా భావిస్తున్న 'జీరో' వ్యాఖ్యలు టీడీపీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. పవన్ కల్యాణ్ గెలుపు కోసం తన సీటును త్యాగం చేసిన వర్మకు, జనసైనికులు, కొందరు కూటమి నాయకుల నుంచి ఇప్పటికే అవమానాలు ఎదురవుతున్నాయి. తాజాగా మంత్రి నారాయణ వ్యాఖ్యలతో పిఠాపురం టీడీపీలో అసంతృప్తి తీవ్రస్థాయికి చేరింది.పిఠాపురం టీడీపీలో వర్మ బలమైన నేతగా గుర్తింపు పొందారు. గతంలో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన రికార్డు ఆయనకుంది. 2024 ఎన్నికల్లో కూటమి ఒప్పందంలో భాగంగా ఈ సీటు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కేటాయించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాలు, ముఖ్యంగా ఎమ్మెల్సీ పదవి హామీతో వర్మ తన సీటును త్యాగం చేశారు. పవన్ కల్యాణ్ విజయం కోసం ఆయన, ఆయన అనుచరులు క్రియాశీలకంగా పనిచేశారు. అయితే, ఎన్నికల ఫలితాల తర్వాత పిఠాపురంలో టీడీపీ-జనసేన శ్రేణుల మధ్య సమన్వయం లోపించింది. ముఖ్యంగా వర్మకు, ఆయన అనుచరులకు జనసైనికుల నుంచి సరైన గౌరవం దక్కలేదనే ఆరోపణలు వచ్చాయి. జనసేన నేత, పవన్ సోదరుడు నాగబాబు వంటి నాయకులు సైతం పరోక్షంగా వర్మను ఉద్దేశించి సెటైర్లు వేయడం ఈ వివాదానికి ఆజ్యం పోసింది. అధిష్ఠానం ఆదేశాలకు కట్టుబడి వర్మ మౌనం వహించినప్పటికీ, ఆయన వర్గీయుల్లో అసహనం పెరిగింది., మంత్రి నారాయణ కొందరితో మాట్లాడినట్లుగా చెబుతున్న ఒక ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ ఆడియోలో, పిఠాపురంలో కూటమిలో జరుగుతున్న అంతర్గత విభేదాల గురించి ప్రస్తావిస్తూ? "వర్మ చాలా దూకుడు ఉన్న వ్యక్తి. పవన్ కల్యాణ్ గెలిచిన తర్వాత, మన పార్టీ నేత (వర్మ)తో వాళ్లకు (జనసైనికులకు) ఘర్షణ జరుగుతోంది. గత మూడు నాలుగు నెలల నుంచి అతన్ని (వర్మను) జీరో చేశాం" అన్నట్టుగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు వర్మకు తీవ్ర ఆగ్రహం తెప్పించాయి. తాను చంద్రబాబు, లోకేశ్‌ల ఆదేశాల మేరకే మౌనంగా ఉన్నానని, పార్టీ బలోపేతం కోసమే ఎటువంటి విమర్శలకూ సమాధానం చెప్పడం లేదని వర్మ స్పష్టం చేశారు. "ఎవడో కర్మ అంటే నాకేంటి, ఎవడో గడ్డిపరక అంటే నాకేంటి. వర్మ అంటే ఏమిటో పిఠాపురం ప్రజానీకానికి తెలుసు" అంటూ మంత్రి నారాయణపై పరోక్షంగా సెటైర్లు వేశారు. తాను టీడీపీలో పిల్లర్ లాంటి వాడినని కూడా స్పష్టం చేశారు.వివాదం పెద్దదై, కూటమిలో ప్రకంపనలు సృష్టించడంతో మంత్రి నారాయణ వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. తన మాటలను వక్రీకరించారని, తాను పిఠాపురంలో టీడీపీ, జనసేన మధ్య ఉన్న విభేదాలను 'జీరో' చేశామని మాత్రమే చెప్పానని వివరణ ఇచ్చుకున్నారు. సోషల్ మీడియాలో కట్ అండ్ పేస్ట్ చేసి ప్రచారం చేశారని మండిపడ్డారు. ఈ అంశంపై విశాఖ పర్యటనలో ఉన్న మంత్రి నారాయణను వర్మ కలిసి చర్చించారు. ఈ భేటీ తర్వాత వర్మ మాట్లాడుతూ.. మంత్రి నారాయణపై వస్తున్న వార్తలు అసత్య ప్రచారాలని కొట్టిపారేశారు. పేటీఎం బ్యాచ్ చేసే అసత్య ప్రచారాలను నేను పట్టించుకోనని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన సమన్వయంతోనే పనిచేస్తున్నాయని, మంత్రి నారాయణ కాకినాడ జిల్లాలో వారధిగా పనిచేస్తున్నారని వర్మ ప్రకటించడం గమనార్హం.మొత్తంగా, మంత్రి నారాయణ వ్యాఖ్యలు కూటమిలోని వర్గపోరును ముఖ్యంగా టీడీపీ పరిస్థితిని మరోసారి బట్టబయలు చేశాయి. వర్మ త్యాగాన్ని కొందరు నాయకులు తేలికగా తీసుకుంటున్నారనే భావన టీడీపీ శ్రేణుల్లో బలపడింది. హైకమాండ్ జోక్యంతో ఈ వివాదం తాత్కాలికంగా సద్దుమణిగినప్పటికీ, వర్మ విషయంలో అధిష్ఠానం హామీ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవి, ఆయనకు దక్కాల్సిన గౌరవం లభించకపోతే పిఠాపురం టీడీపీలో అసంతృప్తి రాజుకునే ప్రమాదం లేకపోలేదు. ఈ పరిణామాలు కూటమి సమన్వయానికి సవాల్‌గా నిలుస్తున్నాయి.

# స్వదేశీ మంత్ర సక్సెస్ 87 శాతం మంది చైనా వస్తువులకు 'నో'

ముంబై, అక్టోబరు 22, (



ఈ సంవత్సరం దీపావళి భారత ఆర్థిక వ్యవస్థకు ఒక కొత్త వెలుగు ఇచ్చింది. దేశ మార్కెట్లు మునుపటి అమ్మకాల రికార్డులన్నింటినీ బద్దలు కొట్టాయి. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ నివేదిక ప్రకారం.. ఈ పండుగ సీజన్‌లో భారతదేశం రికార్డు స్థాయిలో రూ.6.05 లక్షల కోట్ల వ్యాపారాన్ని సృష్టించింది. ఈ నంబర్ చాలా పెద్దది, ఇది దేశ వ్యాపార చరిత్రలో అతిపెద్ద పండుగ అమ్మకంగా మారింది. ఈ అపూర్వమైన విజయం మార్కెట్లను పునరుజ్జీవింపజేయడమే కాకుండా "ఆత్మనిర్భర్ భారత్" స్ఫూర్తికి అద్భుతమైన విజయం కూడా. అయి పరిశోధన విభాగం నిర్వహించిన ఈ సర్వేలో దేశవ్యాప్తంగా 60 ప్రధాన నగరాలు, అన్ని రాష్ట్ర రాజధానులు, టైర్-2, టైర్-3 నగరాలు ఉన్నాయి.ఈ రికార్డు స్థాయి అమ్మకాల వెనుక ఉన్న అతిపెద్ద శక్తి ఓకల్ ఫర్ లోకల్ అనే చెప్పాలి. అంఎ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓకల్ ఫర్ లోకల్, స్వదేశీ దీపావళి కోసం ఇచ్చిన పిలుపు వ్యాపారులు, వినియోగదారులిద్దరినీ అపూర్వమైన రీతిలో ప్రేరేపించిందని అన్నారు. ప్రధాని విజ్ఞప్తి ప్రజలపై ఎంతగానో ప్రభావం చూపించింది. సర్వేలో పాల్గొన్న 87 శాతం మంది వినియోగదారులు విదేశీ, ముఖ్యంగా చైనీస్ ఉత్పత్తుల కంటే భారతీయ వస్తువులను కొనడానికే ఇష్టపడ్డారు. దీని ప్రత్యక్ష ఫలితంగా, చైనా ఉత్పత్తులకు డిమాండ్ బాగా తగ్గింది. గత సంవత్సరంతో పోలిస్తే భారతదేశంలో తయారైన వస్తువుల అమ్మకాలు 25 శాతం పెరిగాయని వ్యాపారులు స్వయంగా నివేదించారు. ఈ మార్పు కేవలం ఆర్థిక గణాంకాలు మాత్రమే కాదు, మార్కెట్‌ను మార్చిన జాతీయవాదం, స్వదేశీ గర్వం స్పష్టమైన తరంగాన్ని ప్రతిబింబిస్తుంది.
ఈ దీపావళి అమ్మకాలలో అత్యంత ఆసక్తికరమైన, ముఖ్యమైన అంశం ఏమిటంటే.. కార్పొరేట్యేతర వ్యాపారాలు ? మన సాంప్రదాయ మార్కెట్లు, చిన్న వ్యాపారులు రూ.6.05 లక్షల కోట్ల టర్నోవర్‌లో సుమారు 85 శాతం వాటాను కలిగి ఉన్నారు. ఈ గణాంకాలు భారతీయ రిటైల్ మార్కెట్ నిజమైన బలాన్ని, లోతైన మూలాలకు నిదర్శనం. పెద్ద ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, మాల్స్ ఉన్నప్పటికీ, భారతదేశ సగటు వ్యాపారి ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచాడని ఇది రుజువు చేస్తోంది. గత సంవత్సరం దీపావళి మొత్తం రూ.4.25 లక్షల కోట్ల వాణిజ్యాన్ని సృష్టించింది. ఈ సంవత్సరం 25 శాతం వృద్ధి పొందింది


====================

# పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

న్యూఢిల్లీ , అక్టోబరు 22,
యూపీలోని మథుర సమీపంలో మంగళవారం రాత్రి ఘోర రైలు ప్రమాదం జరిగింది. ఢిల్లీ-ఆగ్రా రైలు మార్గంలోని చౌముహన్ ప్రాంతంలో, బొగ్గుతో వెళ్తున్న ఒక గూడ్స్ రైలుకు చెందిన 2 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఘటన కారణంగా ఢిల్లీ-ఆగ్రా, ఢిల్లీ-ముంబై వంటి ప్రధాన రైలు మార్గాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు

# పతాకస్థాయికి చేరిన ప్రచారం

హైదరాబాద్, అక్టోబరు 22,
జూబ్లీ హిల్స్ ఉపఎన్నిక ప్రచారం ఊపందుకుంది. మరో 20 రోజుల పాటు ఎన్నికల ప్రచారం జరగనుంది. నవంబర్ 9వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఉపఎన్నిక ప్రచార ఘట్టం ముగియనుంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు ఈ ఉపఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. పార్టీ కార్యకర్తలు, నేతలు తమ పార్టీ గెలుపుకు శక్తివంచన లేకుండా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కృషి చేస్తున్నారు. అయితే, ఇప్పటి వరకు అధికార కాంగ్రెస్ గెలుపుకు సీఎం రేవంత్ రెడ్డి, సిట్టింగ్ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఎప్పుడు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. వీరిద్దరూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారా, లేదా అన్న చర్చ సాగుతోంది.జూబ్లీ హిల్స్ ఉపఎన్నిక ప్రచార పర్వం వేడెక్కింది. ప్రస్తుతం ఈ ఉపఎన్నిక అటు అధికార కాంగ్రెస్‌కు, ఇటు సిట్టింగ్ స్థానం కాపాడుకొని తన బలాన్ని రుజువు చేసుకునేందుకు బీఆర్ఎస్‌కు కీలకం. అయితే, ఇప్పటి వరకు అటు సీఎం రేవంత్ రెడ్డి కానీ, ఇటు బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కానీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదు. అయితే, మరో 20 రోజుల పాటు ఈ ఎన్నికల ప్రచారం సాగనుంది. ఇప్పటికే సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్ ఈ ఎన్నికల గెలుపు వ్యూహాలపై పలు దఫాలుగా పార్టీ ముఖ్యులతో సమీక్షలు నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అటు కాంగ్రెస్ నుండి మంత్రులు రంగంలోకి దిగి ప్రచారంలో తమదైన శైలిలో ముందుకు సాగుతుంటే, ఇటు బీఆర్ఎస్ నుండి మాజీ మంత్రులు ప్రచారంలో పాల్గొంటున్నారు. అయితే, ఇప్పటి దాకా తాజా, మాజీ సీఎంల ప్రచార షెడ్యూల్‌పై మాత్రం అటు గాంధీ భవన్ వర్గాలు, ఇటు తెలంగాణ భవన్ వర్గాలు నోరు విప్పడం లేదు.ఇప్పటి దాకా అన్ని పార్టీలు తమ పార్టీ అభ్యర్థుల ఎంపికపై ప్రధానంగా దృష్టి పెట్టాయి. బీఆర్ఎస్ నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే దివంగత మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత అభ్యర్థిగా ఉన్నారు. ఇక కాంగ్రెస్ నుండి నవీన్ యాదవ్, బీజేపీ నుండి లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. శాసన సభ షెడ్యూల్ విడుదల నుండి నేటి వరకు అభ్యర్థి ఎంపిక, ప్రచార వ్యూహాలపై మూడు పార్టీలు దృష్టి పెట్టాయి. అభ్యర్థులు ఖరారు కావడంతో పార్టీ నేతలంతా జూబ్లీ హిల్స్ నియోజకవర్గ బాట పట్టారు.కాంగ్రెస్ నుండి మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, సీతక్క, వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావు ప్రచారంలో పాల్గొన్నారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లు




ఇప్పటికే జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నిక ప్రచారంలో పాల్గొన్నారు. అయితే, ఇప్పటి దాకా సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచార షెడ్యూల్ మాత్రం ఖరారు కాలేదు. ఎన్నికల ప్రచారం మరో మూడు వారాలు సాగనుండడంతో, చివరి వారం రోడ్ షోలు నిర్వహించే అవకాశం ఉందని హస్తం ముఖ్య నేతలు చెబుతున్నారు.మరోవైపు, గత శాసన సభ ఎన్నికల్లో జీహెచ్ఎంసీ పరిధిలో కాంగ్రెస్‌కు అనుకున్న ఫలితాలు రాని పరిస్థితి ఉంది. అయినా, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఈ ఉపఎన్నికలోనూ అదే ఫలితం రావచ్చని కొందరు నేతలు చెపుతుంటే, హైడ్రామా కారణంగా నగర ఓటర్లలో కాంగ్రెస్ పట్ల కొంత విముఖత ఉందని, ఇది ప్రభావం ఈ ఉపఎన్నిక ఫలితంపై చూపవచ్చని మరి కొందరు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం ఒకటి రెండు ప్రచార సభల్లో పాల్గొనవచ్చు లేదా పాల్గొనకపోవచ్చని చెబుతున్నారు. సీఎం ప్రచారం చేసినా జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పార్టీ గెలవకపోతే అది రాజకీయంగా ఓ మచ్చగా మిగలవచ్చని, అందుకే ఈ ఉపఎన్నిక ప్రచారానికి దూరంగా ఉండవచ్చని చెబుతున్నారు. అయితే, ఇప్పటి వరకు అలాంటి సంకేతాలు ఏపీ సీఎం నుండి రాలేదన్నది ఆయన సన్నిహితుల మాట.ఇప్పటి దాకా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో అటు కేటీఆర్, ఇటు హరీశ్ రావులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. వారే మాజీ మంత్రులతో సమన్వయం చేసుకుంటూ ప్రచారం సాగిస్తున్నారు. అయితే, ఈ ఉపఎన్నికల ప్రచారంలో కేసీఆర్ అసలు పాల్గొంటారా, లేదా అన్న చర్చ సాగుతోంది. సాధారణ ఎన్నికల్లో సైతం కేసీఆర్ చివరి నిమిషంలోనే ప్రచారంలో పాల్గొనడం జరుగుతూ ఉండేది. అయితే, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉపఎన్నికలో సైతం కేసీఆర్ ప్రచారంలో పాల్గొనలేదు. ఆ ఎన్నికల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ సీనియర్ నేత పద్మారావ్ గౌడ్‌లే ప్రచారం నిర్వహించారు. ఆ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేశ్ విజయం సాధించారు. అయితే, ఇటీవలి పార్టీలో జరిగిన పరిణామాలు, అటు ప్రభుత్వ విచారణలు, ఆరోపణల నేపథ్యంలో కేసీఆర్ ఉపఎన్నిక ప్రచార బరిలో దిగుతారా, లేదా అన్న చర్చ సాగుతోంది. అయితే, పార్టీ ముఖ్యనేతలు మాత్రం ఒకటి రెండు ప్రచార సభలు లేదా రోడ్ షోలు నిర్వహించాలని పార్టీ అధినేతను కోరినట్లు సమాచారం. ఇప్పటి దాకా ఈ విషయంలో కేసీఆర్ ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి.రాష్ట్రంలో ప్రత్యామ్నాయ బలంగా తయారవడానికి బీజేపీ ఎన్నో ఏళ్ల నుండి కృషి చేస్తోంది. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో తన బలాన్ని పెంచుకోవాలన్నది ఆ పార్టీ వ్యూహం. అందుకు వేదికగా జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలో తన సత్తా చాటేందుకు కమలం పార్టీ వ్యూహాలు రచిస్తోంది. ఆ పార్టీ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత రాంచందర్ రావుకు ఇది తొలి పరీక్ష. ఈ ఉపఎన్నికలో సత్తా చాటాలని ఆయన భావిస్తున్నారు. అంతే కాకుండా, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జూబ్లీ హిల్స్ ఉండడంతో అక్కడి నుండి ఎంపీగా గెలిచిన కిషన్ రెడ్డి సైతం ఈ స్థానంలో కమలం పార్టీ వికసించాలని కోరుకుంటున్నారు. గతంలో ఇక్కడి నుండే పోటీ చేసి ఓడిపోయిన దీపక్ రెడ్డికి టికెట్ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలుపు బాట పట్టాలని, తద్వారా రాష్ట్రంలో బీజేపీనే ప్రత్యామ్నాయం అని చాటేందుకు కమలం నేతలు వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. ఈ దిశగా ఇప్పటికే కిషన్ రెడ్డి, రాంచందర్ రావులు ప్రచార బాట పట్టారు. మరి కొద్ది రోజుల్లో మరో కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా ఈ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.బీజేపీ నుండి ముఖ్యనేతలు ఇప్పటికే ప్రచార బరిలో దిగగా, అధికార కాంగ్రెస్ పార్టీ నుండి సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ప్రచార తీరుతెన్నులపైనే ఇప్పుడు అందరి దృష్టి ఉంది. అటు కాంగ్రెస్ నుండి సీఎం రేవంత్, ఇటు బీఆర్ఎస్ నుండి కేసీఆర్, బీజేపీ నుండి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్ వంటి వారు ప్రచారంలోకి దిగితే మాత్రం ఈ పోటీ రసవత్తరంగా మారే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

## అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం పరామర్శించిన హనుమాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



భూపాలపల్లి, భారత శక్తి, అక్టోబర్ 22: హైదరాబాదులోని లినర్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని SUN CITY )లలో నివాసముంటున్న భూపాలపల్లి జిల్లా, మున్సిపాలిటీ పరిధిలోని జంగేడ నివాసి భూపాలపల్లి జిల్లా మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ అపార్ట్మెంట్ ఇంటిలో కరెంట్ తో షార్ట్ సర్క్యూట్ వలన అర్ధరాత్రి 11 గంటలకు అగ్నిప్రమాదం జరిగినది ఇట్టి సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. ఇందులో ప్రాణ నష్టం ఏమి జరగలేదు. ఇందులో ఉన్న సుమారు 10 తులాల బంగారం, రెండు %గాజ%లు,2 లక్షల నగదు, మూడు %బ్యూరూాం%, పెద్ద %టివి%, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, 2 ఫోన్స్, ఫర్నిచర్ ,వంట సామాగ్రి, బెడ్స్ అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి సుమారు 25 లక్షలు ఆస్తి నష్టం జరిగినది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పినారు హైదరాబాద్ నర్సింగ్ పోలీస్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగింది

ఈ సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ శ్రీ బుర్ర రమేష్ గౌడ్ ను భూపాలపల్లి మాజీ శాసనసభ్యులు గౌరవ శ్రీ గండ్ర వెంకటరమణ రెడ్డి,GMR ట్రస్ట్ చైర్మన్ గౌరవ శ్రీ గండ్ర గౌతంరెడ్డి పరామర్శించి అగ్ని ప్రమాదం గురంచి అడిగి తెలుసుకున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 22: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా నిర్మించుకునేల లబ్ధిదారులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం తాడ్వాయి మండలం లోని నందివాడ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి త్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా నిర్మించుకునే విధంగా ఇసుక, మొరం, ఇటుకలకు ఏలాంటి కొరత లేకుండా లబ్ధిదారులకు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తాడ్వాయి మండలంలో మొత్తం 441 ఇళ్లు మంజూరు కాగా మార్కవుట్ , వివిధ దశలో నిర్మాణ పనులు, స్లాబ్ లెవెల్, రూఫ్ లెవెల్ , బేస్మెట్ లెవెల్ లో నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు.

ఈ నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేసే విధంగా అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడి. విజయపాల్ రెడ్డి, డి ఈ సుభాష్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, తహసిల్దార్ శ్వేత, ఎంపీఓ సవిత రెడ్డి, ఇందిరమ్మ ఇండ్ల

## నందివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

–మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
–కష్టపడి చదివి పదవ తరగతి లో మంచి ఫలితాలు సాధించాలి



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 22: తాడ్వాయి మండల కేంద్రంలోని నందివాడ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 10 వ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత అయ్యేలా సన్నద్ధం చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచేలా చూడాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించి చదువులో వెనుకబడిన వారిని గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. 10 వ తరగతిలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారని, సిలబస్ ఎంత వరకు పూర్తయిందని, తదితర అంశాలను ప్రధానో పాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. 10 వ తరగతి విద్యార్థుల చేత బోర్డుపై ఉన్న పదాలను చదివించారు. విద్యార్థులు అందరూ వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని 100% ఉత్తీర్ణత సాధించాలని, జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్ డి ఎమ్ (మధ్యాహ్న భోజనం) ను పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనీ, నాణ్యత ప్రమాణాలు పాటించి మంచి ఆహారం అందించాలని, వంట చేసేటప్పుడు, వడ్డించేటప్పుడు శుభ్రత పాటించాలని అన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, అదే విధంగా స్లాబ్ పై పేరుకుపోయిన చెత్త ను ఎప్పటికప్పుడు శానిటేషన్ వారిచే శుభ్రం చేయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ రాజు, ఎమ్ఈఒ రామస్వామి ఎమ్మార్వో శ్వేత ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీ ఓ సవిత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవికి అర్హులెవరు?
## నామమాత్రంగానే నామినేషన్లు ముందే అధ్యక్ష పదవికి లైన్ క్లియర్




ములుగు జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 (భారత శక్తి) : కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్ష పదవికి అర్హులెవరు, అనర్హులెవరని ఆ పార్టీ నాయకులు ఉత్కంఠ గా ఎదురు చూస్తున్నారు.

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వా యిలోని పీఎస్ఆర్ గార్డెన్ లో ఏఐసీసీ పరిశీలకులు జాన్సన్ అబ్రహం, టీపీసీసీ పరిశీలకులు సాగరికరావు, నాగేందర్రెడ్డి ల ఆధ్వర్యంలో ఈనెల 14న నామినేషన్ల ప్రక్రియ నిర్వహిం చిన విషయం తెలిసిందే.

జిల్లాలో మొత్తం పది మండలాలు ఉండగా.. వాటి పరిధిలోని మండల, బ్లాక్, పార్టీ అనుబంధ సంఘాల అధ్య క్షులు, సీనియర్ నాయకుల నుంచి ముందుగానే అభి ప్రాయాలు సేకరించినట్లు సమాచారం. దీంతో ఎవరు ఎవరికి అనుకూలంగా ఉన్నారనేది రహస్యంగానే ఉంటుంది.

ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి ముందుగానే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి, ఆ పార్టీ శ్రేణులతో కలిసి లైన్ క్లియర్ చేసినట్లు పార్టీ నాయకులు, కార్యకర్తలు గుసగుస లాడుకుంటున్నట్లు సమాచారం.

,లిబరిలో ఆరుగురు:లి జిల్లా వ్యాప్తంగా అధ్యక్ష పదవికి ఆరు నామినేషన్లు దాఖల య్యాయి. జిల్లా కేంద్రానికి చెందిన కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, వెంకటాపూర్ మండలం రామానుజాపురం కు చెందిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి మల్లాడి రాం రెడ్డి లు జిల్లా అధ్యక్ష పదవికి బరిలో నిలువగా, గోవిందరావుపేట మండలం చల్వాయికి చెందిన ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, అదే మండలంలోని, చల్వాయి గ్రామానికి చెందిన సూరపునేని నాగేశ్వరరావు, ఏటూరునాగారం మండలా నికి చెందిన ఇర్సవడ్ల వెంకన్న, వెంకటాపురం పీఏసీఎస్ ఛైర్మన్ చిడం రామ్మోహన్రావు, నామినేషన్లు సమర్పించిన వారిలో ఉన్నారు.

ఇది ఇలా ఉండగా ముఖ్యంగా ముగ్గురిలో ఒకరు అధ్యక్ష పదవి దక్కించుకునే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీలోని నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

గతంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నల్లెల్ల కుమారస్వామి ఉన్నప్పుడు అటు ప్రజలకు ఇటు కార్యకర్తలకు అందుబాటులో ఉండడమే కాకుండా జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసిమెలిసి ఉంటూ ఎలాంటి భిన్నాభిప్రాయాలకు చోటు లేకుండా ములుగు జిల్లాలో కుమారస్వామి ఒంటి చేత్తో కాంగ్రెస్ పార్టీని కాపాడుకుంటూ కొనసాగుతూ వచ్చాడు. తనకు ఆరోగ్యం సహకరించక అకాల మరణం చెందిన విషయం తెలిసిందే. ఇప్పటికే పైడాకుల అశోక్ జిల్లా అధ్యక్ష పదవిలో కొనసాగుతున్నప్పటికీ ఆయనకు మళ్ళీ అవకాశం లేదనే అభిప్రాయం కాంగ్రెస్ నాయకులు నుంచి సమాచారం ఉంది.

అంతేకాకుండా ప్రస్తుత జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ములుగు జిల్లాలోని ప్రజలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఆయా నాయకులకు అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ ములుగు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా అధ్యక్ష పదవిని నిర్వహించకపోవచ్చనే అనుమానం కూడా ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న పైడాకుల అశోక్ కు జిల్లాలో ఏదో ఒక కీలకమైన పదవి వచ్చేంతవరకు తననే కొనసాగించనున్నట్లు సమాచారం.

వెంకటాపూర్ మండలానికి చెందిన మల్లాడి రాం రెడ్డి టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా పదవిలో కొనసాగుతున్నారు,

ఒక పదవి ఉండగా మరో పదవిని కట్టబెడితే ఆ పార్టీలో భేదాభిప్రాయాలు ఉంటాయని నాయకులు, కార్యకర్తల నుండి వాదనలు వినిపిస్తున్నాయి.

మరో నేత చల్వాయి గ్రామానికి చెందిన సూరపు నేనే నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సత్సంబంధాలు ఉన్నాయని తనకు జిల్లా అధ్యక్ష పదవి వస్తుందేమోననే అనుమానం లేకపోలేదు.

ఇకపోతే మిగిలింది జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో తను అంచలంచలుగా ఎదుగుతూ అదే పార్టీలో కొనసాగుతున్నాడని దీంతోపాటు జిల్లా కేంద్రానికి చెందినవాడై ప్రజలకు,కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాడని ఆ పార్టీ కార్యకర్తల నుండి అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని 10 మండలాలకు చెందిన సీనియర్ ముఖ్య నాయకులు, ఆయా మండలాలు గ్రామాలకు చెందిన వివిధ అనుబంధ సంఘాలు, పార్టీ శ్రేణుల నుండి సేకరించిన అభిప్రాయ నివేదికను టీపీసీసీకి అందజేసినప్పటికీ, ములుగు నియోజకవర్గ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తీసుకునే నిర్ణయం పైనే ఆధారపడి ఉంటుందని, ఆ పార్టీలో వాదనలు వినిపిస్తున్నాయి.

## రాజన్న సేవలో కేంద్ర మంత్రి బండి సంజయ్ సతీమణి అపర్ణ



వేములవాడ,అక్టోబర్ 22 (భారత శక్తి): దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని బుధవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సతీమణీ అపర్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కళ్యాణ మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. వారికి ఆలయ ఈవో ఎల్. రమాదేవి స్వామి అమ్మవార్ల వస్త్రాలు, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

## దేశంలో యువత నిరుద్యోగ సమస్య ఎదుర్కొంటుంది:మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

సూర్యాపేట, భారత శక్తి ప్రతినిధి,అక్టోబర్ 22: దేశంలో అన్ని రాష్ట్రాలలో గ్రామీణ యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నదని, ఉన్నత చదువులు చదివినప్పటికీ ఉద్యోగాలు రాక యువత ఇబ్బందులు పడుతున్నారని, ఇది అందరికీ ఆవేదన కలిగించే విషయమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం అయన సూర్యాపేటలోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గడచిన 20 నెలల కాలంలో 70 నుండి 75 వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని, ఇటీవల గ్రూప్ 1,గ్రూప్ 2 అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడమే కాకుండా ,లైసెన్స్ సర్వేయర్ల కు కూడా నియామక పత్రాలు అందించడం జరిగిందని, అలాగే ప్రైవేటు రంగంలో కూడా ఎక్కువ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని దేశ విదేశాల నుండి పెట్టుబడులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

## ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు సొంతింటి కల నెరవేరుతుంది.

### లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయం




మణుగూరు, అక్టోబర్ 22 (భారతశక్తి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు సొంతింటి కల నెరవేరుతుందని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సమితిసింగారం పంచాయితీ కార్యాలయంలోని ఆవరణలో ఎంపీడీఓ తేళ్ళూరి శ్రీనివాసరావు అధ్యక్షతన 126 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండ్లు కట్టుకోవాలనే ఆడబిడ్డల చిరకాల కోరికని ఇందిరమ్మ ఇండ్ల రూపం లో ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇల్లు లభిస్తుందన్నారు. గత ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమైందని, పేద వానికి ఎటువంటి లబ్ది చేకూరలేదు. కేసీఆర్ డబుల్ బెడ్రూం పేరుతో రాష్ట్ర ప్రజానీకాన్ని మోసం చేసారని విమర్శించారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా అదనంగా మరో 1000 ఇండ్లు కేటాయించాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని కోరగా అడిగిందే తడువుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి అదనపు ఇల్లు మంజూరు చేయించారని తెలిపారు. లబ్దిదారులకు పట్టాలు ఇస్తున్న క్రమంలో వారు కొంత భావోద్వేగానికి లోనయ్యారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గంలో ఒక్క ఇంటిని కూడా ఇవ్వలేదని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు మాత్రమే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని, మళ్ళీ పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పేదలకు సొంతింటి కల నెరవేరుతుందన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు విడతల వారీగా అందుతుందని ఎవరు అధైర్య పడవద్దని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిన లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. నాలుగు దఫాలుగా లబ్ధిదారుల ఖాతాలో ఐదు లక్షల రూపాయలు జమ అవుతాయని తెలిపారు. . ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన కొద్దికాలంలోనే 60 వేల ఉద్యోగాలను భర్తీ చేయడం ద్వారా నిరుద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నిండాయన్నారు. రైతుబంధు, రైతు భరోసా, రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం, రెండు లక్షల రూపాయల రుణమాఫీ, క్వింటా సన్నబియ్యానికి 500 రూపాయల బోనస్, పండించిన పంటకు మద్దతు ధర, ఉచిత కరెంటు, ఇలా మరెన్నో పథకాలను రైతుల కోసం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం ద్వారా ఆర్థికంగా లబ్ది చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడం కోసం వడ్డీ లేని రుణాలు. 10 సంవత్సరాల కేసీఆర్ దొర ఏలుబడిలో ఒక్క రేషన్ కార్డు కూడా పేదవాడికి అందించడంలో విఫలమయ్యారని ఎద్దేవాచేశారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే కొత్త రేషన్ కార్డులను పేదలకు అందజేశామన్నారు.

## ఘనంగా డాక్టర్ సునీల్ కుమార్- జన్మదిన వేడుకలు



సూర్యాపేట, భారత శక్తి ప్రతినిధి,అక్టోబర్ 22: సూర్యాపేట ప్రముఖ వైద్యులు, జ్యోతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత, జనరల్ సర్జన్ బిజ్జ సునీల్ కుమార్ జన్మదిన వేడుకలను బుధవారం గుగులోతు లింగా నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సూర్యాపేట రూరల్ కాసరబాధ రోడ్డులోని అపూర్వ బదిరుల పాఠశాల విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని జ్యోతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులకు పండు పంపిణీ చేసి, శ్రీ సాయి బ్లడ్ బ్యాంకులో లింగా నాయక్, సురేష్, వినోద్, వినయ్, నాగరాజు, హరీష్, ఉపేందర్, శంకర్ తో పాటు పలువురు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా లింగా నాయక్ మాట్లాడుతూ డాక్టర్ సునీల్ కుమార్ గారి పుట్టినరోజు సందర్భంగా రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాటోత్ సురేష్, జాటోతు భాను, జాటోతు నరసింహ, చింటూ, వినోద్ కుమార్, అశోక్, నవీన్, ధరావత్ వినయ్, నాగరాజు, మనోహర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ ఆర్టీవో కార్యాలయంలో ఏసీబీ సోదాలు..



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 22 ( భారత శక్తి): నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్టీవో, డీటీవో కార్యాలయాలలో బుధవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను ఏసీబీ అధికారులు పరిశీలించారు కార్యాలయంలో ఏజెంట్ల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఈ దాడులు నిర్వహించినట్లు ఏసీబీ డీఎస్పీ జి మధు. పేర్కొన్నారు. వాహనదారులు తమ రిజిస్ట్రేషన్ లను డ్రైవింగ్ లైసెన్స్ లను ప్రభుత్వ వెబ్సైట్ ద్వారానే బుక్ బుక్ చేసుకోవాలని సూచించారు ఏజెంట్ల ద్వారా కార్యానికి వస్తే ఎక్కువ డబ్బులు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. ఎవరైనా లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు సంప్రదించాలని సూచించారు.

## ప్రభుత్వ హాస్పిటల్ కు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలి: మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి



సూర్యాపేట,భారతశక్తి ప్రతినిధి, అక్టోబర్ 22: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి నూతనంగా నియామకమైన వైద్యాధికారులకు సూచించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా నియామకం అయిన వైద్యాధికారులు డాక్టర్ ఎస్ సాయి కృష్ణ,డాక్టర్ యన్ అమూల్య, డాక్టర్ బి ప్రణీత్ నాయక్,డాక్టర్ ప్రతిమలకు నియామక పత్రాలను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్,ఎస్పి కే నరసింహ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చంద్రశేఖర్,తదితరులు హాజరయ్యారు.

## న్యాయమూర్తి జ్యోతిర్మయిని కలిసిన బార్ కార్యవర్గం

ఘనంగా సన్మానించి,పూల మొక్క అందజేత.



వేములవాడ,అక్టోబర్ 22 (భారత శక్తి) : వేములవాడ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి ఆరు నెలల కాలం మెటర్నటీ సెలవులో వెళ్లి, నేడు తిరిగి మళ్ళీ బాధ్యతలు చేపట్టడంతో బుధవారం బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం ఆధ్వర్యంలో కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసీ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జ్యోతిర్మయి మాట్లాడుతూ బెంచ్ కు బార్ కు మధ్య సత్సంబంధాలు బలంగా ఉండాలని, న్యాయవాదులకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్య నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు కటకం జనార్ధన్, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీ గుజ్జే మనోహర్, సీనియర్ ఈసీ మెంబర్ కనికరపు శ్రీనివాస్, లేడీ రిప్రజెంటివ్ జక్కుల పద్మ, జూనియర్ ఈసీ మెంబర్లు యమ తిరుపతి, బూర సరిత ఉన్నారు.

## మొగుళ్ళపల్లిలోని వివిధ పాఠశాలలను తనిఖీ చేసిన తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ మెంబర్ సెక్రెటరీ, జిల్లా జడ్జి చిలుకమారి పంచాక్షరి




**భూపాలపల్లి, భారత శక్తి, అక్టోబర్ 22:** మొగుళ్ళపల్లి మండలంలోని ఎం. జె. పి స్కూల్ అలాగే కస్తూర్బా స్కూల్, గ్రామపంచాయతీ భవనంలో ఏర్పాటు చేసిన విలేజ్ లీగల్ కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ను తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ మెంబర్ సెక్రెటరీ (జడ్జి) చిలుకమారి పంచాక్షరీ గారు ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలల ప్రిన్సిపాల్స్ తో కలిసి వంటగదులను, డైనింగ్ హాల్స్, టాయిలెట్స్ మరియు తరగతి గదులను జడ్జి గారు పరిశీలించారు. అనంతరం పంచాక్షరి జడ్జిగారు మాట్లాడుతూ పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మంచి నాణ్యతమైన భోజనం అందించాలని ,మంచి చదువు బోధించాలని, స్కూల్ ప్రిన్సిపాల్ లకు సూచించారు. అలాగే విద్యార్థులతో మాట్లాడుతూ భవిష్యత్తులో మీరు ఏ లక్ష్యం కోసం చూస్తున్నారో ఆ లక్ష్యం అందే వరకు ఉన్నతమైన చదువులు చదివి మీ లక్ష్యాన్ని చేరుకోవాలని జడ్జి గారు సూచించారు. ఈ కార్యక్రమంలో పి.ఎల్.వి మంగళపల్లి శ్రీనివాస్, ఎస్ ఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్ అభిలాష అభినవ్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 22 (భారత శక్తి) : నిర్మల్ గ్రామీణ మండలంలోని నాగ్నాయిపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనం పనులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భవన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భవన నమూనా మ్యాపులను పరిశీలించి, అవసరమైన సవరణలపై సూచనలు చేశారు.

భవన నిర్మాణం నాణ్యవంతంగా, సమయానికి పూర్తి కావాలని, సరిపడినంతమంది కూలీలను నియమించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ప్రదేశం కేటాయించాలన్నారు. భవనం చుట్టూ హద్దుల గుర్తులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరా మహిళా శక్తి భవనాలు రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతను పెంపొందించేందుకు చేపట్టిన ప్రాధాన్యమైన కార్యక్రమమనికలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు.

అనంతరం కలెక్టర్ పట్టణంలోని బంగాల్‌పేట్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతోందని, పనులను నాణ్యవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. దశలవారీగా నిధులు విడుదల చేయడం జరుగుతుందని, అధికారులు పర్యవేక్షణను క్రమం తప్పకుండా కొనసాగించాలని కలెక్టర్ అన్నారు. నిరుపేద లబ్ధిదారుల తమ సొంత ఇంటి కలను నెరవేర్చినందుకు ప్రభుత్వానికి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ చందు జాదవ్, డీఈ తుకారం రాథోడ్, ఏఈఈ చందన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్లు ప్రభాకర్, రాజు, ఎంపీడీవో గజానన్, హౌసింగ్, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి సంగీత పోటీలలో సత్తాచాటిన పారమిత విద్యార్థులు




కరీంనగర్ ప్రతినిధి, అక్టోబర్ 22(భారతశక్తి):డ్రీమర్స్ డ్రీమ్, లక్నో ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి సంగీత పోటీలలో పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అవార్డులు పొందారని పాఠశాల డైరెక్టర్ హనుమంత రావు తెలిపారు. ఈ పోటీల వాయిద్య సంగీత విభాగంలో 7వ తరగతికి చెందిన కిట్ల.చరణ్ జాతీయస్థాయి 7వ స్థానం , 6వ తరగతికి చెందిన ఎ.వి.కె. కార్తీక్ జాతీయస్థాయి 24వ స్థానం, గాత్ర సంగీత విభాగంలో 8వ తరగతికి చెందిన సోనాక్షి సురేష్ జాతీయస్థాయిలో 17 వ స్థానం పొంది బహుమతులు, సర్టిఫికెట్స్ అందుకున్నాడు. జాతీయస్థాయిలో బహుమతులు పొందిన విద్యార్థులను, సంగీత ఉపాధ్యాయులు జితుమణి శర్మ , కిరణ్ కుమార్ లను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాఎం ఇ.ప్రసాద రావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, రాకేష్, వి.యు.యం. ప్రసాద్, వినోద్ రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ హన్మంత రావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, సమన్వయకర్తలు భవానీ , రబీంద్ర పాత్రో, నిఖిత లు పాల్గొన్నారు.

## ఫైల్ నేమ్ 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఆధ్వర్యంలో మహా ధర్నా విజయవంతం చేయండి



భూపాలపల్లి, భారత శక్తి, అక్టోబర్ 22 : బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసి ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలో 42% బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 24 న ఇందిరా పార్క్ హైదరాబాద్లో జరగబోయే మహా ధర్నాను ప్రియమైన బిసి. ఎస్. ఎస్టి మైనారిటీ బంధువులందరూ కలిసి అజరై విజయవంతం చేయడం కోసం తరలి రావాలని 42 శాతం బీసీ ధర్నా ఆహ్వాన కరపత్రాలు విడుదల చేశారుఈ కార్యక్రమానికి ధర్మ సమాజ్ పార్టీ,బీసీ ఎస్సీ ఎస్టీ జాక్ జిల్లా కన్వీనర్ కొత్తూరు రవీందర్ మాట్లాడారు.గత 78 సంవత్సరాల స్వతంత్ర భారత ప్రయాణంలో, దేశ జనాభాలో మెజారిటీ అయిన బీసీలు (%దీుఖఎఝుతీస జశ్రీుంంవం%) ప్రతి రంగంలోను అణచి వేయబడ్డారు. రాజకీయ, ఆర్థిక, విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఎక్కడ కూడా వారికి జనాభా నిష్పత్తికి సరిపడ ప్రాతినిధ్యం లేదు. రాజకీయంగా చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు లేవు: అందువల్ల చట్ట సభలలో వారి ఉనికి నామమాత్రమే. ఉద్యోగాలు మరియు విద్యా రంగాల్లో కూడా రిజర్వేషన్లు పూర్తిగా అమలు కావటం లేదు. రాష్ట్రంలో 130 కులాల బీసీ సమూహం, 2.40 కోట్లతో, 60% జనాభా ఉండగా వారు పొందుతున్న రిజర్వేషన్లు కేవలం 29% మాత్రమే. కేంద్రంలో రిజర్వేషన్లు 1993 నుంచి అమలు కాగా రాష్ట్రంలో 1972 నుంచి అమలు కావడంతో లక్షలాది బీసీ యువత ఉద్యోగాలు, విద్యా అవకాశాలు కోల్పోయారు. ఆర్థికంగా, వ్యాపార రంగంలో కూడా బీసీల ఉనికి లేనట్లుగానే ఉంది. ఈ పరిస్థితుల్లో, బీసీ సమాజం "మా వాటా మాకు కావాలి మా అధికారం మాకు కావాలి" అనే నినాదంతో మేల్కొని తమ న్యాయబద్ధమైన హక్కుల కోసం యుద్ధం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడినవి "హిస్సా, ఇజ్జత్, హుకుమత్"ల కొరకు పోరాడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. సామాజిక తెలంగాణ మా ధ్యేయం. అని ఉద్యమించాల్సిన పరిస్థితులు ఏర్పడినవి. సామాజిక న్యాయం ఒక ప్రహసనముగా మారిందని అన్నారు.ఈ కార్యక్రమంలో మహర్షి, ప్రసాద్ మహేష్, మల్లన్న, రాకేష్, జయకర్, రవి, దేవేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ హౌస్'తో విద్యార్థులకు విజ్ఞానం: పట్టణ సీఐ వీరప్రసాద్




వేములవాడ,అక్టోబర్ 22 (భారత శక్తి) : "ఓపెన్ హౌస్" లాంటి కార్యక్రమాల వలన విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందని వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ అన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించే స్మారకోత్సవాలలో భాగంగా బుధవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ లో "ఓపెన్ హౌస్" పోలీస్ శాఖ వినియోగించే పరికరాల ప్రదర్శన కార్యక్రమాన్ని ఆర్.ఎస్సై సముద్రాల రాజుతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోలీస్ స్టేషన్ లో సందర్శించి పోలీసుల విధులు వారి బాధ్యతలపై అవగాహన పొందారు. అలాగే ట్రాఫిక్ నియమాలు రోడ్డు భద్రత వాటిని పాటించే అవసరాన్ని వివరించే ప్రదర్శనలు,చర్చలు నిర్వహించారు.పోలీస్ అధికారులు, సిబ్బంది తమ విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు,వివిధ పరికరాలు వాటి పనితీరు,సాంకేతిక సాధనలను గురించి, వేలిముద్రలు సేకరించు పరికరాలు వాటి ఉపయోగాల గురించి పట్టణ సీఐ వీరప్రసాద్ విద్యార్థులకు వివరిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసుల విధులు, వారు వాడే ఆయుధాలు, పరికరాలు,బాధ్యతలు,శాంతిభద్ర నిర్వహణ తదితర అంశాలను విద్యార్థి దశలోనే తెలుసుకోడానికి ఈ కార్యక్రమం దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లలలో చిన్ననాటి నుండి పౌర బాధ్యతా,భావం, భద్రత పైన అవగాహన పెంచే ప్రయత్నం జరిగిందని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను అడిగి అధికారుల నుంచి సమాధానాలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కఠినమైన పాఠ్యాంశాలు నేర్పించేందుకు బుధవారం బోధన:జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్,అక్టోబర్ 22, (భారతశక్తి ప్రతినిధి) విద్యార్థులకు కఠినమైన పాఠ్యాంశాలను నేర్పించేందుకు బుధవారం బోధన కార్యక్రమం ఉపకరిస్తుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతి బుధవారం అన్ని పాఠశాలల్లో బుధవారం బోధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బోధన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పర్యవేక్షించారు. మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. 9వ తరగతి విద్యార్థులతో పాఠాలు చదివించారు. ప్రతి విద్యార్థితో పాఠాన్ని చదివిస్తూ స్పష్టంగా అర్థవంతంగా చదివేందుకు మెళకువలు నేర్పారు. ప్రతి విద్యార్థి నోట్ బుక్ లో రైటింగ్ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ బుధవారం బోధనలో ఏదైనా సబ్జెక్టులోని కఠినమైన పాఠాన్ని ఎంచుకొని చదవాలని అన్నారు. శ్రద్ధ అంకితభావంతో నేర్చుకోవాలని సూచించారు. బుధవారం బోధన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్య ఇస్తూ కఠినమైన పాఠాల పట్ల దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

విద్యార్థులతో కలిసి భోజనం

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్ పిల్లలకు కొన్ని సూచనలు చేశారు. కూరలు ఎక్కువగా తినాలని, ఆకుకూరలు, గుడ్లు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఏ ఆహార పదార్థాల్లో ఏ పోషకాలు ఉంటాయని విద్యార్థులను ప్రశ్నిస్తూ వారికి వివరించారు. పాఠశాలలో విద్యార్థులకు ఏవైనా అవసరాలు ఉంటే వెంటనే కల్పించాలని విద్యాధికారిని ఆదేశించారు. విద్యార్థులు చేతులు కడుక్కునే చోట నల్లాలు లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాజేష్, ఎంఈఓ రవీందర్ పాల్గొన్నారు.

## ఏకాగ్రతకు యోగా, ధ్యానం అవశ్యం క్లాసికల్ హఠయోగా గురువు శ్రీకాంత్ ఉద్బోధ



**సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 22** :మెరుగైన ఏకాగ్రత, అంతర్గత సామరస్యం కోసం విద్యార్థులు, అధ్యాపకుల దైనందిన జీవితంలో యోగా, ధ్యానాన్ని అనుసంధానించడం అవసరమని ఐఐటీ మద్రాసు పూర్వ విద్యార్థి, క్లాసికల్ హఠయోగా గురువు శ్రీకాంత్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్టూడెంట్ లైఫ్ సహకారంతో సాధన యోగా, ధ్యానం పరిచయ కార్యక్రమాన్ని బుధవారం రెండు సెషన్లుగా యోగా, ధ్యాన సంఘం నిర్వహించింది.సద్గురు జగ్గీ వాసుదేవ్ మార్గదర్శక వీడియో సూచనల మద్దతుతో సద్గురు గురుకులం వద్ద శిక్షణ పొందిన శ్రీకాంత్ ఈ కార్యక్రమాన్ని మధ్యాహ్నం 12.00 నుంచి 1.00 గంట వరకు, సాయంత్రం 3.00 నుంచి 4.00 గంటల వరకు రెండు సెషన్లుగా జరిపారు. వ్యక్తిగత శ్రేయస్సు, వృత్తిపరమైన ప్రభావాన్ని పెంచడానికి యోగా, ధ్యానాన్ని శక్తివంతమైన అభ్యాసాలుగా పరిచయం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు.యోగా అనేది మనస్సు, శరీరం, శ్వాస ఏకం కావడానికి, అనుభవపూర్వంగా రావడానికి ఒక మార్గంగా శ్రీకాంత్ అభివర్ణించారు. యోగాలో సమతుల్యత మొదటి అడుగన్నారు. శ్వాస, మనస్సు మధ్య లోతైన సంబంధాన్ని ఎలుగెత్తి చాటారు. ముక్కు ద్వారా శ్వాసించడం ద్వారా శరీర శక్తి మార్గాలను శుద్ధిచేసి, ప్రశాంతపరిచే నాడీ శుద్ధి ప్రాణాయామాన్ని సదస్యులతో చేయించారు. సద్గురు రికార్డు చేసిన సూచనలను అనుసరించి ఏడు నిమిషాల పాటు ధ్యానాన్ని సాధన చేయించారు.ఈ కార్యక్రమానికి అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది నుంచి ఉత్సాహభరితమైన స్పందన లభించింది. వీరిలో చాలామంది ఇటువంటి అభ్యాస కార్యక్రమాలకు క్రమం తప్పకుండా హాజరు కావడానికి సుముఖత వ్యక్తపరిచారు. స్టూడెంట్ లైఫ్ మేనేజర్ ఎస్. వెంకటేష్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సిద్ధ రామేశ్వర స్వామి మహా క్షేత్ర, ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రమాణ స్వీకారం



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 22: సిద్ధ రామేశ్వర స్వామి (స్వయంభు లింగ) మహా క్షేత్ర, ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ముఖ్య అతిథులుగా ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షట్కార్ పాల్గొన్నారు.

కామారెడ్డి నియోజకవర్గం బిక్నూర్ మండల కేంద్రంలోని సిద్ధ రామేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ కమిటీ నూతన చైర్మన్ పాలకవర్గ సభ్యులతో షబ్బీర్అలీ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. సిద్ధరామేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ గా, తాటిపాముల లింబాద్రి, వైస్ చైర్మన్ గా అందే దయాకర్ రెడ్డి, డైరెక్టర్లుగా, సింగారపు నర్సమ్మ, నీలా అంజయ్య, అనుగు అమృత, సామ సంతోష్ రెడ్డి, పెంజర్ల ఈశ్వర్ రెడ్డి, ముత్తన్న ఓల్ల కిష్టయ్య, నాగర్తి రమేష్ రెడ్డి, గుడిసె నారాయణ, లింగి భాగయ్య, మోకాళ్ళ బాపురెడ్డి, చీకోటి ప్రభాకర్, అక్కు కార్తీక్,ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ భిక్కనూరు సిద్ధ రామేశ్వర ఆలయం చాలా పురాతన మైనది, మహిమలు గల దేవాలయం. సిద్ధ రామేశ్వర ఆలయం ద్వారానే బిక్కనూరు గ్రామానికి దేశవ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని అన్నారు.ఈ ఆలయం నా నియోజకవర్గంలో ఉండడం నా అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు. నాకు ఆలయ అభివృద్ధి చేసే అవకాశం కల్పించిన సిద్ధ రామేశ్వరుడు,ఆలయ కమిటీ సభ్యులు, నిజాయితీగా స్వామి వారి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని మీకు ఈ అవకాశం దొరకడం చాలా గొప్ప విషయమని సిద్ధ రామేశ్వరుని కరుణతోనే మీకు ఈ పదవులు వచ్చాయని దాన్ని గుడి అభివృద్ధితో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

కోరికలు కోరుకున్న వారికి కొంగు బంగారంమై కోరికలు నెరవేరుతాయని, ఆలయ దర్శనం చేసుకుంటే మనసు ఎంతో ప్రశాంతంగా ఉంటుందని అన్నారు.ఆలయ అభివృద్ధికి నా వంతు శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు.అనంతరం సురేష్ కుమార్ షట్కర్ మాట్లాడుతూ,నూతనంగా ఎన్నికైన కమిటీకి శు భాకాంక్షలు తెలియజేశారు.సిద్ధ రామేశ్వర ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రమాణ స్వీకార ఉత్సవంలో పాల్గొని స్వామివారి దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు.షబ్బీర్ అలీ ముస్లిం అయినా ఆలయాల అభివృద్ధిలో ముందు వరుసలో ఉంటారు. సిద్ధ రామేశ్వరాలయం చాలా పురాతనమైనది, మహిమలు గల ఈ ఆలయ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని చెప్పారు.

ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, పీసీసీ జనరల్ సెక్రెటరీ ఇంద్రకరణ్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఇలియాస్, ఎడ్ల రాజిరెడ్డి, భీమ్ రెడ్డి, గూడెం శ్రీనివాస్ రెడ్డి, అనంతరెడ్డి, సుతారి రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మిరాజాగౌడ్ , జనగామరాజు, బల్యాలసుదర్శన్, గోనె శ్రీనివాస్, దేవరాజ్ గౌడ్, ఇంద్రసేనారెడ్డి, లింగారెడ్డి, ఐరెని సందీప్, గంపప్రసాద్, నరసింహారెడ్డి, అంతంపల్లి సుధాకర్ రెడ్డి గుడుగుల శ్రీనివాస్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

**విద్యార్థులకు ఆన్లైన్ వ్యాసరచన పోటీలు**

**ప్రజలకు షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీలు**

**పోలీసు కమీషనర్ గౌష్ ఆలం**

కరీంనగర్ ప్రతినిధి, అక్టోబర్ 22(భారతశక్తి): పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు పలు పోటీలను నిర్వహించనున్నట్లు పోలీస్ కమీషనర్ గౌస్ అలం తెలిపారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూవిద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు బుధవారం నుంచి 28వ తేదీ వరకు అన్ని రకాల విద్యార్థులందరికీ ఆన్‌లైన్ ద్వారా వ్యాసరచన పోటీలు నిర్వహించబడుతున్నాయి.

డ్రగ్స్ నిర్వహణ నివారణలో పోలీసుల పాత్ర విద్యార్థులు ఎలా దూరంగా ఉండగలరు అనే అంశంపై పోటీలు తెలుగు, ఉర్దూ మరియు ఇంగ్లీష్ మూడు భాషల్లో నిర్వహించబడతాయి. విద్యార్థులు రాసిన వ్యాసాలను అక్టోబర్ 28వ తేదీ వరకు ఈ క్రింది ఆన్‌లైన్ లింక్‌లో అప్‌లోడ్ చేసుకోవచ్చు, https://forms.gle/jaWLdt2yhNrMpe3eAప్రతి భాష నుండి కమీషనరేట్ లెవెల్ టాప్ ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేయబడును..షార్ట్ ఫిల్మ్ పోటీలు ఫోటోగ్రఫీ కాంపిటేషన్ పోలీసులకు సంబంధించినవి .ప్రజలందరికీ పోలీసులకు సంబంధించిన అంశాలపై షార్ట్ ఫిల్మ్ పోటీలు ఇటీవల తీసిన పోలీసులకు సంబంధించిన ఫోటోగ్రఫీ కాంపిటేషన్ కూడా నిర్వహించబడుతుంది. పోటీదారులు తమ షార్ట్ ఫిల్మ్ కమీషనరేట్ లోని పోలీస్ కమీషనర్ కార్యాలయంలో నందు అందజేయవచ్చు.ఈ పోటీలలో కూడా కమీషనరేట్ లెవెల్ టాప్ ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేయబడును.పోలీస్ అమరవీరుల వారోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రజలు, విద్యార్థులు ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొనాలని పోలీస్ కమీషనర్ కోరారు.

## జాగృతిలో జిల్లా బ్యూటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేరినా మహిళలు



కరీంనగర్, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 22 (భారతశక్తి): కరీంనగర్ జిల్లా బ్యూటీ అసోసియేషన్ అధ్యక్షురాలు రూప ఆధ్వర్యంలో జాగృతి జిల్లా మహిళ అధ్యక్షురాలు మహిళలు అక్కం శివరాణి సమక్షంలో మహిళలు తెలంగాణ జాగృతిలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో కవితక్క నాయకత్వంలో పనిచేస్తామని మహిళగా కవిత ఈ సమాజానికి ఎంతగానో సేవ చేస్తున్నారని వారిని చూసి మాలాంటి వారందరము స్ఫూర్తి పొంది జాగృతి ద్వార ప్రజలకు సేవ చేయాలని ఆలోచనతో జాగృతిలో చేరడం జరిగిందని అన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ కవితక్క జాగృతి సంస్థ ద్వారా చేసే పోరాటాలతో ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం డిల్లీలో పార్లమెంటు సాక్షిగా జంతర్ మంతర్ దగ్గర దీక్షకు పూనుకొని కేంద్ర ప్రభుత్వంతో పోరాడి మహిళా రిజర్వేషన్ బిల్లు సాధించిన దైర్యం మనందరికీ తెలిసిందే.

దక్షిణ భారత దేశంలోనే అత్యంత శక్తివంతమైన మహిళగా జాగృతి అధ్యక్షురాలు కవిత ఉన్నారని, ఇప్పుడు ఉన్న రాజకీయలలో దక్షిణ భారతదేశంలో మహిళా నాయకత్వం లేదని మనకు కవితక్క రూపంలో ఆ లోటు తీరుతుందని అన్నారు. తెలంగాణలో జాగృతిని మరింత బలోపేతం చేయడంలో మహిళల పాత్ర కీలకమని కవితక్కను ఆదర్శంగా తీసుకొని చాలామంది మహిళలు జాగృతిలో చేరడం కోసం ముందుకు వస్తున్నారని అలాంటి వారందరినీ జాగృతిలోని ఆహ్వానిస్తున్నామని కవితక్క నాయకత్వంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల మీద ఈ ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకంలో 2500 ఇస్తా అని చెప్పి మోసం చేసిన విధానం మీద, అలాగే కళ్యాణలక్ష్మి క్రింద తులం బంగారం ఇవ్వకుండ మోసం చేసిందని, వృద్ధులకు నాలుగు పింఛన్ ఇస్తానని ఎగనామం పెట్టింది. డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాల ఇవ్వడం లేదు, మహిళ విద్యార్థినిలకు స్కూటీ ఇస్తామని చెప్పి కూడ మోసం చేసిందని మహిళలను ఈ ప్రభుత్వం అన్ని విధాలుగా మోసం చేస్తుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి అటో సంఘం నాయకులు కోత్తురి రఘు, మహిళ నాయకురాలు విజయ, అనుష, కవిత, శ్రీమతి, జ్యోతి, అనిష, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## ఛలో ఇందిరా పార్క్ విజయవంతం చేయాలి

**బీసీ జేఏసీ భూపాలపల్లి చేర్మెన్ పైడిపెల్లి రమేష్**

భూపాలపల్లి, భారత శక్తి, అక్టోబర్ 22: జిల్లా కేంద్రంలోని బీసీ జేఏసీ ముక్యుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ జేఏసీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటి ఛైర్మెన్ పైడిపెల్లి రమేష్, బీసీ జేఏసీ వర్కింగ్ ఛైర్మెన్ గట్ల రాజన్న, కన్వీనర్లు జోగు బుచ్చన్న, కో కన్వీనర్లు బర్ల గట్టయ్య, క్యాతరాజు సాంబమూర్తి, మాట్లాడుతు ...జస్టిస్ఈశ్వరయ్య, ఐఏఎస్ చిరంజీవులు, డా. విశారాధన్ మహారాజ్ గార్ల నాయకత్వం లో జరుగుతున్న బీసీ రిజర్వేషన్ 42% బిల్లు ను 9షెడ్యూల్డ్ లో చేర్చాలని డిమాండ్ తో ఇందిరా పార్క్ జరుగుతున్న ధర్నా విజయవంతం చేయాలని జిల్లా లో ఉన్న బీసీ సంఘాల నాయకులకు,వివిధ కుల సంఘాల నాయకులు మరియు ఎస్టీ, యస్సి సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమం లో అమృత అశోక్, కో ఆర్డినేటర్ శేఖర్ నాని కమిటి సభ్యులు తాటికంటి రవి కుమార్, కొండపర్తి ఇస్తారీ, యాదండ్ల గటయ్య, యూత్ నాయకులు పూర్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చుదాం

భూపాలపల్లి, భారత శక్తి, అక్టోబర్ 22:
కాటారం మండలంలోని మేడిపల్లి గ్రామంలో మాదకద్రవ్య రహిత జిల్లాగా మారేందుకు జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో చర్యలు ముమ్మరం అవుతున్నాయి. జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారి శ్రీమతి మల్లేశ్వరి ఆదేశాల మేరకు "మిషన్ పరివర్తన్" కార్యక్రమాన్ని మంగళవారం కాటారం మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మిషన్ పరివర్తన్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ ప్రసాద్ మాట్లాడుతూ, "మాదకద్రవ్యాల వినియోగం సమాజాన్ని, ముఖ్యంగా యువతను నాశనం చేస్తోందని తెలిపారు. మన అందరి భాగస్వామ్యంతోనే మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించగలమని తెలిపారు. ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై ఈ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వలన కలిగే శారీరక, మానసిక మరియు సామాజిక ప్రభావాలపై వివరించారు. మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగం జరిగితే వెంటనే 100, 14446, 1908 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తదుపరి మహిళ సాధికారత సిబ్బంది అనూష, "బేటీ బచావో – బేటీ పఢావో" కార్యక్రమం గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, బాలికల రక్షణ, విద్యా ప్రాముఖ్యత, మరియు మహిళా సాధికారతపై చర్చించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు, మరియు మహిళా సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరూ కలసి మాదకద్రవ్య రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేసి, "మనం మారుదాం – సమాజాన్ని మార్చుదాం" అనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు.




# కఠిన చట్టాలతోనే మానవ అక్రమ రవాణా అడ్డుకోవాలి

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచినప్పటికీ సమాజాన్ని పట్టిపీడిస్తున్న అత్యంత హేయమైన మానవ అక్రమ రవాణా వ్యారానికి అడ్డుకట్ట వేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనాయి. సంతలో పశువులను వస్తువులను అమ్మినట్లు మనుషులకు వెల కట్టి విక్రయించే విధానాన్ని23 వ రాజ్యాంగ అధికరణం నిషేధించినప్పటికీ ప్రభుత్వాలలో అమలు చేయాలన్న క్రియా శీల సంకల్పం కొరవడం వల్ల ఈ వ్యారం అప్రతిహతంగా కొనసాగుతుంది. మానవ అక్రమ రవాణా ద్వారా వ్యభిచారం' వెట్టి చాకిరి బిక్షాటన 'అవయవాలను దొంగిలించడం కోసం బాలలను మహిళలను మాయం చేసే మాఫీయా రాజ్యమేలుతుంది.



**కేంద్ర ప్రభుత్వ గణాంకాలు మానవ అక్రమ రవాణా**

2019బి2021సం" రాల మధ్య కాలంలో దేశంలో అదృశ్యమైన బాల బాలికలు మహిళలు 13 లక్షలకు పైగా వున్నారని కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో వెల్లడించిన గణాంకాల పట్ల సామాజిక ఆర్థికవేత్తలు విశ్లేషకుల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నగరాల్లో మహిళల మిస్సింగ్ కేసులు పిల్లల అపహరణ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. పోలీస్ రికార్డుల్లో కి రాని కేసులు అనేక సంఖ్యలో వున్నాయి.

దేశములో పలు రాష్ట్రాలలో మానవ అక్రమ రావాణా వ్యాపారం చాప కింద నీరులా జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ఉత్తరప్రదేశ్ 'బీహార్ రాష్ట్రాలలో అత్యధిక కేసులు నమోదు అయినట్లు నోబెల్ బహుమతి గ్రహీత కైలాస్ సత్యార్థి ఫా%శీ%డేషన్ జరిపిన అధ్యయనంలో తేలింది.

**మానవ అక్రమ రవాణా సర్వే**

తప్పి పోయిన బాలలు చాలా మంది ఇటుక బట్టిలలో బాల కార్మికులుగా వీధి బాలలుగాబస్టాండులో రైల్వే స్టేషన్లు ఫుట్పాతుల్లో బిక్షాటన చేస్తున్నారు. అక్రమ రావాణా కు గురైన వారు బిక్షాటన 'బి దొంగతనం వ్యభిచారం వృత్తుల్లో ఉన్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. కిరాతకుల చెరలో చిక్కుకొని శారీరక మానసిక లైగింక హింసకు గురౌతున్నారు. అల్పవేతనాలకు ఎక్కువ పనిగంటలు

అసంగటిత ప్రైవేట్ రంగములో దుర్భర పరిస్థితుల్లో పనిచేస్తూ అనారోగ్యానికి అల్ప పౌష్టికాహారానికి గురౌతున్నారు. వీరి సంఖ్య దేశములో సుమారు 2కోట్ల పైగా వున్నారని అంచనా.

**ప్రపంచ దేశాలు మానవ అక్రమ రవాణా నియంత్రణ చర్యలు**

ప్రపంచ వ్యాప్తంగా మానవ అక్రమ రావాణా ను ఉక్కుపాదంతో నియ%శీ%త్రిస్తుంటే మన దేశంలో ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు ఉదాసీన తను ప్రదర్శిస్తున్నాయి. మనుషుల తరలింపు లైంగిక. హింస దోపిడీ అక్రమ నిర్బంధం శ్రమ దోపిడీకి పాల్పడిన కేసుల్లో కఠినశిక్షలు విధిస్తున్నారు సింగపూర్ ఆస్ట్రేలియా కెనడా ఫిల్లిపెన్స్ .ఆస్ట్రియా దేశాల్లో మానవ అక్రమ రావాణా నిర్మూలనకు న్యాయవాదులకు న్యాయ. మూర్తులకుపోలీస్ అధికార్లకు ప్రభుత్వ అధికార్లకుకావలసిన శిక్షణ అందిస్తున్నారు పెద్ద ఎత్తున పరిశోధన వ్యూహాలను అమలు చేస్తున్నారు.

**సుప్రీమ్ కోర్ట్ సూచన అమలు**

మహిళా అభ్యుదయం బాలల సమగ్ర అభివృధి మాటలకే పరిమితమైంది ఓట్ల మీద చూపిన శ్రద్ధ మానవ అభివృధి పట్ల చూపడం లేదు. ప్రభుత్వాల వద్ద రాజకీయ సంకల్పం లోపించింది .భారత దేశ ప్రభుత్వం మానవ అక్రమ రావాణా ను అడ్డుకోవడానికి ప్రత్యేక చట్టం తీసుకురావాలన్న సుప్రీమ్ కోర్టు సూచన అమలుకు నోచుకోకవడం శోచనీయం.

పేదరికం మానవ అక్రమ రవాణా

దేశములో పేద మధ్య తరగతి యువతులను దారిద్రరేఖ కింద జీవిస్తున్న పేద బలహీన' తాడిత పీడిత 'వర్గాల గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారిని ఉద్యోగం ఆశ మాయ మాటలతో అక్రమ రావాణా వ్యాపారం చేస్తున్నారు. మానవ అక్రమ రావాణా మాఫియా గా ఏర్పడి పిల్లలను మహిళలను విదేశాలకు విక్రయిస్తున్నారు.

**కఠిన శిక్షలు**

మానవ అక్రమ రావాణా శారీరక మానసిక హింసకు పాల్పడిన వారికి పడే శిక్షలు 15 శాతానికి మించడం లేదని అధ్యయనంలో వెల్లడైంది.

ప్రభుత్వం ఒక వ్యక్తిని హత్య చేస్తే విధించే శిక్షలు మానవ అక్రమ రావాణా కు పాల్పడిన వారికి వర్తింప చెయ్యాలి. చట్టసభల్లో మహిళలకు సీట్లు రిజర్వేషన్స్ అమలు చెయ్యాలి. మహిళా రక్షణ సంక్షేమ చట్టాలు కటినంగా అమలు చెయ్యాలి. మెరుగైన మహిళా భద్రత రక్షణ సంక్షేమ%శీ% అభివృధి పునరావాస చర్యలు ప్రభుత్వం చేపట్టాలి.

మానవీయ విలువలు పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలి

పాటశాల కళాశాల స్థాయిలో మానవీయ విలువలు నైతిక విలువలు కుటుంబ వ్యవస్థ ప్రాముఖ్యత అంశాలను పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలి .యూనివర్సిటీలలో ఉమెన్ డెవలప్మెంట్ స్టడీస్ కోర్సు

ఉమెన్ డెవలప్మెంట్ రీసెర్చ్ సెంటర్ ను నెలకొల్పాలి. సామాజ అభివృద్ధిలో మహిళల పాత్ర

అంశాలపై పాఠ్యప్రణాళికప్రవేశ పేట్టి మహిళా సామాజిక ఆర్థిక రాజకీయ వికాసం కోసం పరిశోధన అధ్యయనం చేపట్టాలి.

**అభివృద్ధితో మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాలి**

ఆర్థిక వ్యవస్థలో పేదరికం 'నిరుద్యోగం నిరక్షరాస్యత ' ఆర్థిక అసమానతలు సామాజిక అసమానతలను' వలసలు లింగ వివక్ష 'ప్రాంతీయ అసమానతలు అరికట్టే ఆర్థికాభివృద్ధి వ్యూహాలను ప్రణాళికను రూపొందించి ప్రజల జీవన నాణ్యత ప్రమాణాలను పెంచాలి. మహిళలకు ఆర్థిక సామాజిక పంపిణీ న్యాయం చేకూర్చాలి.

**సామాజిక ఉద్యమం**

గ్రామస్థాయిలో గ్రామసభ తల్లుల సంఘాలు మహిళా సంఘాలు యువజన సంఘాలు ఎన్'ఎస్'ఎస్

పౌర సమాజం స్వచ్ఛంధ సంస్థలు మానవ అక్రమ రవాణా అడ్డుకోవడానికి ప్రజల భాగస్వామ్యంతో సామాజిక ఉద్యమాన్ని నిర్వహించాలి .

పోలీస్ రెవెన్యూ న్యాయ నిపుణుల సమన్వయము తో మానవ అక్రమ%ఇ% రావాణా కు అడ్డుకట్ట వేయాలి. ప్రభుత్వాలు మానవ హక్కుల ఉల్లంఘన కిందికి వచ్చే హేయమైన అమానుష మానవ అక్రమ రావాణా వ్యాపారాన్ని కఠిన చట్టాల కార్యాచరణతో అరికట్టాలి.

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరమ్
తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
నాష్విల్లి టెన్నసి
యూఎస్ ఏ
9440245771

# "వంద రూపాయల నోటు గురించి తెలుసా మీకు??..."

"తెలుసుకుందాం ఇప్పుడు."
"రాణీ కా వావ్...మన వారసత్వ సంపద



నిత్యం మన చేతుల మీదుగా ఎంతో డబ్బు చేతులు మారుతుంది. అందులో నాణెములలో అయితే 1 రూపాయి,2 రూపాయలు,5 ,10 మరియు 20 రూపాయల నాణెములు,నోట్లు అయితే 1 రూపాయి,5రూపాయలు,10,20,50,100 మరియు 500 రూపాయల నోట్లు మన చేతుల్లో తిరుగు చున్నవి. అంటే ప్రస్తుతం వాడుకలో ఉన్నాయి. గతములో 2000 రూపాయలు,1000 రూపాయ ల నోట్లు వాడుకలో ఉండేవికాని ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. ప్రతి నోటుకు, ప్రతి నాణెముకు ఒక ప్రత్యేకత ఉంటుంది. ఇందులో వందరూపాయల నోటు యొక్క ప్రత్యేకత గురించి చూద్దాం.

మన వందరూపాయల నోటు పై వెనుక ఉన్న బొమ్మ ను ఎప్పుడైనా గమనించారా.... మరొక్కసారి నోటును పరిశీలిస్తే మనకు దాని ప్రత్యేకత తెలుస్తుంది.

క్రొత్త వంద రూపాయల నోటుకు వెనుక వైపు ఉన్న ఈ చిత్రం పేరు లి"రాణీ కా వావ్".లి ఇది ఒక నీటి బావి. ఇది గుజరాత్ లోని పఠాన్ జిల్లాలో ఉంది. వంద రూపాయల నోటు మీదకు వచ్చే వరకు ఎవరికీ తెలియని ఈ అద్భుత నిర్మాణ విశేషాల గురించి తెలుసుకొని అందరికీ చెప్పడం వల్ల మన చరిత్ర ఎంత గొప్పదో ప్రస్తుత ప్రజలకు,చిన్నారులకు తెలిసే అవకాశం ఉంటుంది.

విశ్వవ్యాప్తంగా చాలా నిర్మాణాలు అలాగే మన దేశంలో ఉన్న చాలా నిర్మాణాలు రాజుల కొరకు, దేవుళ్ల కోసమో లేదా తమ రాణుల కోసమో కట్టించారు. కానీ లి"రాణీ కా వావ్"లి ను మాత్రం సోలంకి వంశానికి చెందిన రాణి ఉదయమతి తన భర్త భీమ – 1 గుర్తుగా 1050–1100 మధ్య సరస్వతి నది ఒడ్డున నిర్మించింది.

మొత్తం 7 అంతస్థుల్లో నిర్మించిన ఈ బావి పొడవు దాదాపు 213 అడుగులు. వెడల్పు 66 అడుగులు, లోతు 92 అడుగులు. భారతదేశంలో మిగిలిన నిర్మాణాలన్ని నేల మీద నుండి పైకిఅంతస్థులుగా నిర్మిస్తే దీన్ని మాత్రం భూమి లోపలికి 7 అంతస్థులుగా నిర్మించడం విశేషం. భూమి లోపలికి తవ్వుతూ నిర్మాణాలు చేయడం ఎంతో కష్టమైనప్పటికి ఈ నిర్మాణం భారతీయుల ఇంజనీరింగ్ నైపుణ్యానికి ఓ అద్భుత ఉదాహరణగా ప్రపంచస్థాయి గుర్తింపు పొందింది.

ఈ నిర్మాణంలో మరో అద్భుత విషయం ఏమంటే కథలు చెక్కిన 215 స్థంభాలు, దాదాపు 800 శిల్పాలు వాటిపై నిర్మింప చేసి ఉన్నాయి. గోడల మీద దశావతారం కథలు, ఇతర పురాణాలు, స్త్రీల గురించి ఎన్నో బొమ్మలుచెక్కబడ్డాయి.

ఈ బావిలో మరో అద్భుత విషయం దాగి ఉంది. బావి లోపలికి దిగిన కొద్ది ఉష్ణోగ్రత తగ్గి చల్లగా ఉంటుంది. 7 అంతస్తులు దిగిన తరువాత బావి ఉంటుంది. అప్పట్లో బావి చుట్టూ ఔషధ మొక్కలు కూడా పెంచారని అందుకే ఈ బావిలో స్నానం చేస్తే రోగాలు తగ్గేవని చరిత్ర వల్ల తెలుస్తుంది.

ఈ బావికి దగ్గర రహస్యమార్గాలున్నట్లు కనుగొన్నారు. బావి దగ్గరే ఓ బలమైన తలుపు మూయబడి ఉంటుంది. అప్పట్లో శత్రువులు దాడి చేసినపుడు ఆ తలుపు తెరిచి లోపల 30 కిలోమీటర్ల పొడవు ఉన్న సొరంగ మార్గంలో సిద్ధాపూర్ అనే పట్టణానికి చేరే ఏర్పాటు చేశారని ఈ మార్గాన్ని అత్యవసర మార్గం గా ఉపయోగించడానికి నిర్మించారని తెలుస్తుంది. కానీ ఒకసారి సరస్వతి నదికి వచ్చిన వరదల్లో ఈ బావి పూర్తిగా ఇసుకలో కూరుకుపోయి కొన్ని సంవత్సరాల వరకు వెలుగు చూడలేదు. 1980లో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా జరిపిన తవ్వకాల్లో ఇది బయటపడి మన దేశ గత వైభవాన్ని చాటి చెప్పింది. 2014లో UNESCO దీన్ని ప్రపంచ వారసత్వ సంపద జాబితాలోకి చేర్చి దీని కీర్తి విశ్వవ్యాప్తం చేసింది. అయినప్పటికీ 2018 జులైలో రిజర్వ్ బ్యాంకు 100 రూపాయల నోటు మీద ముద్రించే వరకు చాలా మంది భారతీయులకు ఈ అద్భుత నిర్మాణం గురించి తెలియక పోవడం బాధాకరం.

ప్రతి నోటు పై ఉన్న చారిత్రక అంశాన్ని తెలియ చేయడం వల్ల మన వారసత్వ సంపద గురించి తెలుసుకున్న వారము అవుతాము. అలాగే మన వారసత్వ సంపదను ప్రపంచానికి తెలిపిన వారము అవుతాము.

గడప రఘుపతిరావు
రాష్ట్ర ఉత్తమఉపాధ్యాయ అవార్డు గ్రహీత.
9963499282

# జిల్లా పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేసిన ఐజీ శ్రీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 22 (భారత శక్తి) : మల్టీ జోన్–% ఐజీ శ్రీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి గారు ఈరోజు నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ని,కలిసి జిల్లాలోని శాంతిభద్రతల పరిస్థితులు, నేర నియంత్రణ చర్యలు, పోలీస్ సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ జిల్లా పోలీస్ అధికారులతో సమావేశమై, అడిషనల్ ఎస్పీలకు, ఏ ఎస్పీ లకు,ఇన్స్పెక్టర్లకు వివిధ అంశాలపై దిశానిర్దేశాలు జారీ చేశారు. జిల్లాలో శాంతిభద్రతలు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని, ప్రజల భద్రత కోసం పోలీసులు అహర్నిశలు కృషి చేస్తుండడం అభినందనీయమని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా జి.జానకి షర్మిల, అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ , నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీన, ఇన్స్పెక్టర్లు, ప్రవీణ్ కుమార్. మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ జీ ఎఫ్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు అల్ఫోర్స్




కరీంనగర్, అక్టోబర్ 22 (భారతశక్తి ప్రతినిధి):
క్రీడలు విద్యార్థులకు పోటీ పరీక్షలలో విజయం సాధించడం చాలా సులువుగా అవుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం వావిలాలపల్లి లోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ లో పాఠశాల విద్యార్థి ఎస్ జీ ఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా అభినందించి మాట్లాడారు.

విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే అన్ని రంగాలలో క్రీడారంగంలో నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పించి క్రీడలలో నైపుణ్యం సాధించే విధంగా చేయూతనివ్వాలని కోరారు. పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాలుగా వనరులను సమకూర్చి క్రీడారంగంలో నైపుణ్యం సాధించే విధంగా చేయూతనివ్వాలని సూచించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన అండర్ 14 జిల్లా స్థాయి చెస్ పోటీలలో పాఠశాలకు చెందినటువంటి అక్కినపల్లి విస్తృత్ రామ్, 8వ తరగతి అత్యుత్తమ ప్రతిభ కనబరచడమే కాకుండా త్వరలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అజంతా గుహల్లో అద్భుత బౌద్ధ చిత్రాలు"

మహారాష్ట్రలోని అజంతా గ్రామానికి మూడున్నర కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవులతో కూడిన గుర్రపునాడా ఆకృతిలో ఉన్న కొండ మీద అజంతా గుహలు ఏర్పడ్డాయి. ఇవి ఔరంగాబాద్ పట్టణానికి 107 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. వీటికి దిగువన ఉన్న కొండల మధ్య వాఘర్' నది ప్రవహిస్తూ ఉంటుంది. అజంతా గుహలు ఈ కొండకు దక్షిణంగా 35 నుండి 115 అడుగుల ఎత్తులో ఉంటాయి. అజంతా గుహలు అందాలకు పుట్టినిల్లు వంటివి. 1930లో 'యునెస్కో' వీటిని ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా గుర్తించింది. ఆజంతా గుహలు 1819లో 28వ మద్రాసు అశ్విక దళానికి చెందిన 'జాన్ స్మిత్' ఈ ప్రాంతానికి వేటకు వచ్చినపుడు వెలుగులోకి వచ్చాయి.



అజంతా గుహలన్నీ బౌద్ధ గుహలే. వీటిలో కొన్ని క్రీ.పూ. ఒకటి, రెండు శతాబ్దాల నాటిహీనయానికి సంబంధించినవి కాగా హీనయాన శాఖ సంబంధమైనవి. వీటిలో తొమ్మిదవది చైత్ర గుహ. ఇందులో హీనయాన, మహాయాన శాఖలకు చెందిన కుడ్య చిత్రాలు, ఐదవ శతాబ్దం వాటి బుద్ధి విగ్రహం ఉన్నాయి. పదవ గుహ అతిప్రాచీన సుందరమైనదిగా పేరు పొందింది.

18 నుండి 20 వరకు గల గుహలు 5వ

> అజంతా గుహల పైకప్పు, గోడల మీద చెక్కిన గౌతమ బుద్ధుని జీవిత విశేషాలు, రంగురంగుల చిత్రాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. కొండకు పశ్చిమ భాగంలో ఉన్నటువంటి గుహల్లో వేటగాడు పన్నిన వలలో చిక్కిన పావురాన్ని రక్షించే శిబిచక్రవర్తి చిత్రం, జానపద కథా చిత్రాలు కనిపిస్తాయి. రెండో గుహలో బుద్ధ భగవానుడి జననాన్ని చిత్రించారు.

మరికొన్ని క్రీ.శ.5,6 శతాబ్దాల నాటి మహాయాననికి చెందినవి. హీనయాన కాలంలో బుద్ధుని ధర్మచక్రం, బోధి వృక్షం ప్రతీకలుగా చూపించారే తప్ప సాకారంగా చూపించలేదు. అయితే మహాయాన కాలంలో మాత్రం బుద్ధున్ని సాకారంగా చూపిస్తూ బౌద్ధమత సంబంధిత గాథల్ని కళాత్మకంగా శిల్పాలుగా చెక్కారు. క్రీస్తు శకం ఐదవ శతాబ్దానికి చెందిన ఏడు మహాయాన గుహల్లో ప్రథమ గుహ అత్యద్భుతమైన కుడ్య (గోడ) చిత్రాలకు పేరు పొందింది. దీని బయట బుద్ధుని జీవిత గాథలను చెక్కారు. పైకప్పు ఆధారంగా ఇరవై స్తంభాల మీద చక్కని శిల్పాలను మలిచారు. రెండవ గుహలో నాగరాజుల మూర్తులు, వారి అనుచర గణం శిల్పాలున్నాయి. ఈ గుహ పైకప్పు మీద కూడా అద్భుతమైన చిత్రాలు మనకు కనిపిస్తాయి.

8, 9, 10, 12, 13, 15 గుహలు శతాబ్దానికి ఉత్తరార్థంలో నిర్మించిన మహాయాని గుహలు. 16వ గుహలో మనకు అందమైన ద్వారపాలికల విగ్రహాలు దర్శనమిస్తాయి. పదిహేనవ గుహ లోపలికి వెళ్తే బుద్ధుని విగ్రహాలు, పద్మాలని చూడొచ్చు. 21 నుండి 27 వరకు గల గుహలు అజంతా శిల్పకళలో పరిపూర్ణమైన దశను సూచిస్తాయి. ఇరవై ఆరవ గుహలో బుద్ధుని మహాపరినిర్యాణ ప్రతిమ దర్శనమిస్తుంది. ఇక్కడ బుద్ధ భగవానుడు కళ్ళు మూసుకుని, విశ్రమిస్తున్నా భంగిమలో కనిపిస్తారు. బుద్ధుడు తనువు చాలిస్తున్నందుకు ఒక శిష్యుడు కంటతడి పెడుతుండగా, పైన బుద్ధుని దివ్యమైన శరీరాన్ని దేవతలు స్వాగతిస్తున్నట్లు చెక్కిన తీరు అపూర్వం.

అజంతా గుహల పైకప్పు, గోడల మీద చెక్కిన గౌతమ బుద్ధుని జీవిత విశేషాలు, రంగురంగుల చిత్రాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. కొండకు పశ్చిమ భాగంలో ఉన్నటువంటి గుహల్లో వేటగాడు పన్నిన వలలో చిక్కిన పావురాన్ని రక్షించే శిబిచక్రవర్తి చిత్రం, జానపద కథా చిత్రాలు కనిపిస్తాయి. రెండో గుహలో బుద్ధ భగవానుడి జననాన్ని చిత్రించారు. దానికి పైభాగంలో హంసలు బారులు తీరిన దృశ్యం ఎంతో మనోహరంగా పర్యాటకుల మనస్సును దోచుకుంటుంది.

16 వ గుహలో ద్వారపాలికలే కాకుండా బుద్ధుడి నిజ జీవితములో ఎదురైనా పలు సంఘటనలు కూడా మనం ఇక్కడ చూడవచ్చు. వీటిని పురాతన కాలములో చిత్రీకరించినట్లు చారిత్రిక ఆధారాలు కూడా ఉన్నాయి. నాటిచిత్రకారులు ఆ చిత్రాలకు వేసిన రంగులు వేటికీ అలాగే ఉన్నాయి.

యాభై ఆరు మీటర్ల ఎత్తులో ఉన్న కొండపై అజంతా గుహలు పడమటి నుండి తూర్పుకు వ్యాపించి ఉంటాయి. తొలుత 'జాన్ స్మిత్ ఈ గుహలను ఎక్కడి నుంచైతే చూశాడో ఆ ప్రదేశాన్ని 'వ్యూ పాయింట్' గా చెబుతారు. ఈ గుహల్లో తీర్చిదిద్దిన శిల్పాలు, చిత్రాలన్నీ బౌద్ధ మతానికి ప్రతీకలు అయితే వీటిలో ఏది మొదటిదో, ఏది చివరిదో చెప్పడానికి ఆధారాలు మాత్రం లేవు.

ఈ గుహల్లో అలనాటి మహా శిల్పులు చేతి గొడ్డలి,ఉలి,సుత్తి మూడు ప్రధానమైన పరికరాలతో ఓ అద్భుతమైన చిత్రాన్ని రూపొందించారు.

స్వాతంత్ర్యం తరువాత మహారాష్ట్ర ప్రభుత్వం మెరుగైన రవాణా సౌకర్యాలు,పార్కింగ్ కల్పిస్తూ ప్రచారం చేయడం వల్ల సందర్శకుల సంఖ్య క్రమంగా పెరిగింది. భారతీయ పురాతత్వ శాఖ అధికారికంగా 29 గుహలను కనుగొన్నట్లు ప్రకటించింది. చాలా మంది నిపుణులు ఈ గుహలను అధ్యయనం చేసి పరిశోధించారు. అద్భుతమైన శిల్పాలు, చక్కగా ఉంచబడిన లేఅవుట్‌లు మరియు చిత్రాలు బౌద్ధ భావజాలాలు మరియు నమ్మకాలతో నిండి ఉన్నాయి. సన్యాసుల జీవనశైలి మరియు బుద్ధుని జీవితం మరియు బౌద్ధ కథల వివరాలు అజంతా గుహలలో అంతర్భాగం.

అజంతా గుహల చిత్రాలు గుహలలో ఒక ఆకర్షణీయమైన భాగంగా ఉన్నాయి. కొన్ని చిత్రాలు శాతవాహన కాలం నాటివి మరియు కొన్ని గుప్తుల కాలం మరియు తరువాతి కాలం నాటివి.

చరిత్రను గుర్తిద్దాం... చరిత్రను కాపాడుదాం
గడప రఘుపతిరావు
PSHM 9963499282

ఈ సినిమా ఫైజాబాద్‌లోని అమీరాన్ అనే యువతిని బలవంతంగా లఖ్‌నవూలోని ఓ వ్యభిచార గృహానికి అమ్మేసిన తర్వాత..ఆమె అక్కడ ఉంటూనే కవయిత్రిగా ఎలా మారిందనే కథాంశంతో తెరకెక్కింది

# రెడ్ సీ చిత్రోత్సవాల్లో రేఖ క్లాసిక్ చిత్రం



బాలీవుడ్ అగ్రనటి రేఖ క్లాసిక్ చిత్రం 'ఉమ్రావ్ జాన్'ని సౌదీ అరేబియాలో జరగనున్న రెడ్ సీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఐదవ ఎడిషన్‌లో ప్రదర్శించనున్నారు. ఈ సినిమాని ప్రపంచవ్యాప్తంగా పునరుద్ధరించిన క్లాసిక్స్ ఫెస్టివల్ ట్రెజర్స్ విభాగంలో ప్రదర్శిస్తున్నారు. 1981లో ముజఫర్ అలీ దర్శకత్వం వహించి నిర్మించిన చిత్రమిది. ఈ సినిమాని నేషనల్ ఫిల్మ్ హెరిటేజ్ మిషన్ కింద నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎఫ్‌డీసీ), నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియా(ఎన్ఎఫ్ఏఐ) పునరుద్ధరణని చేపట్టాయి. ఈ సందర్భంగా ఈ చిత్రం పునరుద్ధరించిన ఫోర్ కే వెర్షన్‌తో డిసెంబరులో తొలి అంతర్జాతీయ ప్రదర్శనతో విదేశీ ప్రేక్షకులను అలరించనుంది. ఈ సినిమాతో పాటు 'హిచ్‌కాక్', 'స్పెల్ బౌండ్', 'లూక్ బెస్సన్', 'ది బిగ్ బ్లూ'తో పాటు పలు చిత్రాలు ప్రదర్శితమవనున్నాయి. ఈ చిత్రోత్సవం డిసెంబరు 4నుంచి 13వరకు జరగనుంది. ఈ వేడుకకు షారుక్ ఖాన్, దీపికా పదుకొణె, రణ్‌బీర్ కపూర్ లాంటి ప్రముఖ బాలీవుడ్ తారలు హాజరుకానున్నారు. ఈ సినిమా ఫైజాబాద్‌లోని అమీరాన్ అనే యువతిని బలవంతంగా లఖ్‌నవూలోని ఓ వ్యభిచార గృహానికి అమ్మేసిన తర్వాత..ఆమె అక్కడ ఉంటూనే కవయిత్రిగా ఎలా మారిందనే కథాంశంతో తెరకెక్కింది. ప్రేమ, మోసం, కళ, గౌరవం మధ్య చిక్కుకున్న మహిళల బాధ, ఒంటరితనాన్ని తెలియజేసే చిత్రమిది. ఈ సినిమా ఉత్తమ నటితో సహా నాలుగు జాతీయ చలనచిత్ర పురస్కారాలను గెలిచింది.



# రవితేజ కామెంట్.. 'వార్ 2' ఫలితంపై నాగవంశీ రియాక్షన్ ఇదీ

: 'వార్ 2' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత నాగవంశీ ఇచ్చిన స్పీచ్‌పై రవితేజ తాజాగా ఫన్నీ కామెంట్ చేశారు. అది అభిమానులకు విజ్ఞప్తి చేసినట్టుగా లేదని, థియేటర్లలో సినిమా చూసేందుకు రాకపోతే మీ పని చెబుతా అని హెచ్చరించినట్టుగా ఉందంటూ నవ్వులు పూయించారు. దానిపై నిర్మాత స్పందిస్తూ.. "నేను, ఎన్టీఆర్.. ఆదిత్యా చోప్రా, యశ్ రాజ్ ఫిల్మ్స్ సంస్థను నమ్మాం. వాళ్ల వైపు తప్పు జరిగింది. మనం దొరికిపోయాం" అని అన్నారు. 'మాస్ జాతర' ప్రమోషన్స్‌లో ఈ సందడి నెలకొంది. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన 'వార్ 2'లో ఆగస్టులో విడుదలైన సంగతి తెలిసిందే.రవితేజ హీరోగా నూతన దర్శకుడు భాను భోగవరపు తెరకెక్కించిన చిత్రమే 'మాస్ జాతర'. శ్రీలీలహీరోయిన్. నాగవంశీ నిర్మించారు. ఈ నెల 31న సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న సందర్భంగా.. రవితేజ, నాగవంశీతో డైరెక్టర్ కల్యాణ్ శంకర్ చిట్‌చాట్ నిర్వహించారు. సినిమా విషయంలో సోషల్ మీడియాలో ఎదురయ్యే విమర్శలపైనా ఈ ఇంటర్వ్యూలో మాట్లాడారు. 'ఇందులో ఏముంది?' అంటూ కమర్షియల్ చిత్రాలను కొందరు తక్కువగా చూస్తున్నారని నాగవంశీ అభిప్రాయపడ్డారు. అలాగని రవితేజతో 'గీతాంజలి' తీయలేను కదా అని పేర్కొన్నారు. అలా చేస్తే చూడరు కదా అంటూ రవితేజ తన మార్క్ కామెడీ పండించారు.

# ఈ ప్రయాణాన్ని ఎలా వివరించను...!



అగ్ర కథానాయిక రష్మిక ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'థామా'. తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ హారర్ కామెడీ ఫిల్మ్ ఆకట్టుకుంటోంది. దీని రిలీజ్ సందర్భంగా రష్మిక ఈ సినిమాజర్నీని పంచుకున్నారు. సెట్‌లో తీసిన కొన్ని బీటీఎస్ ఫొటోలను షేర్ చేశారు. చిత్రబృందం గురించి మాట్లాడారు.

"థామా.. ఈ సినిమా ప్రయాణాన్ని ఎలా వివరించాలి. ఎక్కడినుంచి మొదలుపెట్టాలి.. మొదటి కాల్‌షీట్ నుంచి చివరిరోజు కట్ వరకూ ప్రతిదీ మనసుకు హత్తుకున్నదే. కేవలం వర్క్ చేయడమే కాదు.. భరోసా, నవ్వులు, గాయాలు, నిద్ర లేవడానికి ఇష్టపడని ఉదయాలు.. షూటింగ్ ముగించడానికి అంగీకరించని రాత్రులు.. అన్నీ ఎప్పటికీ గుర్తుండిపోతాయి. దర్శకుడు ఆదిత్య సర్పోదర్‌పై గౌరవంతో నా హృదయం నిండిపోయింది. ఆయన నాపై నమ్మకంతో దీన్ని రూపొందించారు. సినిమాలో ప్రతి సన్నివేశంలోనూ ఆయన అంకితభావం కనిపిస్తుంది. సిబ్బంది గురించి ప్రత్యేకంగా చెప్పాలి. వారి వల్లే మేం షూటింగ్‌ను సజావుగా చేయగలిగాం. ఎత్తైన కొండ ప్రదేశాలకు కూడా పరికరాలను మోసుకొచ్చారు. చిత్రీకరణ సమయంలో పడిన కష్టమంతా సినిమా విడుదలయ్యాక వచ్చే పాజిటివ్ కామెంట్స్‌కు మర్చిపోతాం" అని రష్మిక తన నోట్‌లో రాసుకొచ్చారు.

ఇక తనను అభిమానించే వారిని ఉద్దేశిస్తూ.. 'మీ ప్రేమ, మద్దతు, నమ్మకం అన్నిటినీ నేను చూస్తున్నాను. మీ ప్రతి భావన నా హృదయాన్ని తాకుతుంది. అది నా మనసులో ఎప్పటికీ నిలిచిపోతుంది. అందరికీ కృతజ్ఞతలు' అని తెలిపారు. ఇక 'థామా' విషయానికొస్తే.. 'స్త్రీ', 'భేడియా', 'ముంజ్యా', 'స్త్రీ 2' లాంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన మాడాక్ ఫిల్మ్స్ దీన్ని రూపొందించింది. రష్మికతో పాటు ఆయుష్మాన్ ఖురానా వారి పాత్రలతో మెప్పించారు.



# నేను చేసిన ఐటెమ్ సాంగ్స్ అన్నీ మళ్లీ చేయాలనుంది.. షోలో సందడి చేసిన రమ్యకృష్ణ

తాను చేసిన ఐటెమ్ సాంగ్స్ అన్నీ మరోసారి చేయాలనుందని నటి రమ్యకృష్ణ చెప్పారు. జగపతిబాబు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న టాక్ షో 'జయమ్ము నిశ్చయమ్మురా'. ఇప్పటికే పలువురు సినీ తారలు ఈ షోకు వచ్చి ఎన్నో ఆసక్తికర విషయాలను పంచుకోగా, తాజాగా రమ్యకృష్ణ అతిథిగా వచ్చి సందడి చేశారు. తన డైలాగులతో పాటు, నటించిన సినిమాలకు సంబంధించిన అనేక విషయాలను పంచుకున్నారు. ఇందుకు సంబంధించిన ప్రోమోను జీ5 విడుదల చేసింది.'నువ్వు చేసిన వాటిలో ఏ సినిమా మరోసారి చేయాలనుందని' జగపతిబాబు అడగ్గా.. రమ్యకృష్ణ ఆసక్తికర సమాధానమిచ్చారు. తన ఐటెమ్ సాంగ్స్ అన్నీ మళ్లీ చేయాలనుందన్నారు. 'బాహుబలి'లో శివగామిగా నటించేటప్పుడు నిజంగానే తను రాజమాతలా మారిపోయినట్లు చెప్పారు. 'నా మాటే శాసనం..' డైలాగుతో అలరించారు. శుక్రవారం రాత్రి 8.30 గంటల నుంచి జీ5లో, ఆదివారం రాత్రి 8.30 గంటలకు జీ తెలుగులోనూ ఈ షో ప్రసారం కానుంది.

# సైయారా భామ 'శక్తి షాలిని'



ఇటీవల 'సైయారా' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చి తన తొలి సినిమాతోనే బ్లాక్‌బస్టర్ హిట్‌ని సొంతం చేసుకుంది బాలీవుడ్ నటి అనీత్ పడ్డా. తాజాగా ఆమె మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లోకి అడుగుపెడుతోంది. ఈ హారర్ కామెడీలో మొదట కియారా అద్వాణీని అనుకున్న ఆ స్థానంలో అనీత్ పడ్డా ఎంపికయ్యారని గతంలోనే వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. దీపావళి సందర్భంగా ఈ యూనివర్స్‌లో భాగంగా 'థామా' సినిమా విడుదలైంది. ఈ చిత్రం చివరలో మరో హారర్ కామెడీ 'శక్తి షాలిని' సినిమాని అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. అందులో సినిమా విడుదల తేదీతో పాటు వీడియోను పంచుకున్నారు. ఈ చిత్రంలో అనీత్‌ని ప్రధాన పాత్రధారిగా పరిచయం చేస్తూ "రక్షకురాలు, విధ్వంసకురాలు, అందరి తల్లి" అనే వ్యాఖ్యను జోడించారు.



# మా నమ్మకాన్ని నిలబెట్టిన విజయమిది : కిరణ్ అబ్బవరం

"సరైన కథను తీసుకుని కష్టపడి సినిమా చేస్తే.. తప్పకుండా విజయం దక్కుతుందని 'కె-ర్యాంప్' నిరూపించింది" అన్నారు నిర్మాత దిల్‌రాజు. కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కించిన చిత్రమిది. రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. దిల్‌రాజు, శ్రీను వైట్ల, వశిష్ఠ, సాయి రాజేశ్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. "ఈ సినిమాలో తండ్రీ కొడుకుల భావోద్వేగాల్ని కొత్తగా చూపించారు. ఒక రిచ్ కుర్రాడిని మాస్‌గా చూపించడం వర్కవుట్ అయింది" అన్నారు. "ప్రేమించిన వారి లోపాల్ని కూడా స్వీకరించాలనే పాయింట్‌ను దర్శకుడు నాని వినోదాత్మకంగా చెప్పారు" అన్నారు దర్శకుడు శ్రీను వైట్ల. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. "నేను 'క' తర్వాత అలాంటి థ్రిల్లర్స్ చేయాలనుకున్నా. కానీ, దర్శకుడు నాని 'వినోదం నీ బలం. అలాంటి ఎంటర్‌టైన్‌మెంట్ కథ చేద్దామ'ని ఈ చిత్రం చేయించాడు. మేము ఏదో గొప్ప కథ చెప్పట్లేదు నవ్విస్తామని ముందే చెప్పాం. ఈరోజు మా నమ్మకాన్ని నిలబెడుతూ అన్ని షోలు హౌస్‌ఫుల్ అవుతున్నాయి. మా నమ్మకాన్ని నిలబెట్టిన విజయమిది.

భారతశక్తి
23-10-2025 , గురువారం



# రో - కో విఫలం.. అదంతా వాతావరణం వల్లే!

భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్

భారీ అంచనాలతో బరిలోకి దిగిన భారత స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ విఫలం కావడం అభిమానులను నిరాశకు గురి చేసింది. కనీసం రెండంకెల స్కోరు కూడా చేయలేదు. దీంతో వీరిపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. అయితే, వారి ఆట తీరుపై వాతావరణం ప్రభావం చూపించిందని టీమ్ఇండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ వెల్లడించాడు. ఒక్క మ్యాచ్‌లో రాణించలేకపోయినంత మాత్రాన ఆందోళన పడక్కర్లేదని తెలిపాడు. రోహిత్, విరాట్‌కు ఎంతో అనుభవం ఉందని పేర్కొన్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌కు దూరమైనట్లు వస్తున్న వార్తలను కొట్టిపడేశాడు.

"రోహిత్ – విరాట్ కోహ్లీ విషయంలో ఎలాంటి ఆందోళన లేదు. వారు ఆటకు దూరమయ్యారని అనుకోవడం లేదు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత ఐపీఎల్‌లో ఆడారు. ఇప్పుడు అత్యుత్తమంగా సన్నద్ధమయ్యారు. అయితే, తొలి వన్డేకు వర్షం పలుమార్లు ఆటంకం కలిగించింది. వాతావరణం వల్ల ఆటపై ఏకాగ్రత కోల్పోయే అవకాశాలు ఉంటాయి. ఒకవేళ ఆసీస్ కూడా తొలుత బ్యాటింగ్ చేయాల్సివచ్చినా ఇలాంటి పరిస్థితులు ఉంటాయి. ఇన్నింగ్స్‌కు నాలుగైదు సార్లు అంతరాయం కలిగింది. సీనియర్ ప్లేయర్లకు గొప్ప అనుభవం ఉంది. ఆస్ట్రేలియాకు రాకముందు మంచిగా ప్రాక్టీస్ చేశారు. ఇప్పుడు ఒక్క మ్యాచ్‌లో సరిగా ఆడనంత మాత్రాన జడ్జ్ చేయాల్సిన అవసరం లేదు. ఫిట్‌నెస్ విషయంలోనూ ఏ ఇబ్బంది లేదు. మంచి లయలోనే ఉన్నారు. నెట్స్‌లోనూ బాగా సాధన చేశారు. తప్పకుండా రెండో వన్డేలో అదరగొట్టేస్తారని భావిస్తున్నా" అని సితాన్షు వెల్లడించాడు.

పిచ్ పాత్ర కూడా కీలకమే: రవిశాస్త్రి

"రోహిత్, విరాట్ కోహ్లీ ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి వచ్చారు. పెర్త్ పిచ్ బౌలింగ్‌కు అనుకూలం. వర్షం పడటంతో బ్యాటర్లకు ఏమాత్రం స్వేచ్ఛ దొరకలేదు. ఆస్ట్రేలియా టాస్ నెగ్గడం కూడా ఆ జట్టుకు కలిసొచ్చింది.

చాన్నాళ్ల తర్వాత ఆడుతున్నప్పుడు ఇలాంటి పరిస్థితులు ఎదురైతే ఇబ్బంది పడటం సహజమే. ఆస్ట్రేలియాలో ఆడటం ఎవరికైనా కష్టమే. పెర్త్ పిచ్, వాతావరణ పరిస్థితులకు అలవాటు కావడం కూడా పెద్ద సవాల్. అదనంగా బౌన్స్ రాబట్టే సమయంలో నాణ్యమైన బౌలర్లను ఎదుర్కోవాలంటే ఈజీ కాదు. అయితే, అడిలైడ్‌లో పరిస్థితులు కాస్త భిన్నంగా ఉండొచ్చు" అని భారత మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు.

# అలా జరిగి ఉంటే.. సచిన్ కంటే 5 వేల రన్స్ ఎక్కువ చేసేవాడిని: మైక్ హస్సీ



ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మైక్ హస్సీ భారత అభిమానులకూ సుపరిచితుడే. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఆ జట్టుకు కోచ్‌గానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్‌పై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. తాను ముందుగా అరంగేట్రం చేసి ఉంటే సచిన్ కంటే ఎక్కువగా పరుగులు చేసేవాడినని వ్యాఖ్యానించాడు. అయితే, ఇదంతా తనకు వచ్చిన కలగా పేర్కొనడం గమనార్హం.

"నేను సచిన్ కంటే కనీసం 5వేల పరుగులు ఎక్కువగా చేసుండేవాడిని. బహుశా అత్యధిక సెంచరీలు, ఎక్కువ విజయాలు, ఎక్కువ యాషెస్ సిరీస్‌లను నెగ్గడం, అత్యధికంగా వరల్డ్ కప్‌లు సాధించి ఉండేవాడిని. దురదృష్టవశాత్తూ ఉదయాన్నే నిద్ర లేవడంతో అవన్నీ మాయమైపోయాయి. అప్పుడు అర్థమైంది అదంతా కల అని. త్వరగా అరంగేట్రం చేసిఉంటే బాగుండేదని ఇప్పుడు అనిపిస్తుంది. అయితే, నాకు అవకాశం వచ్చినప్పుడు ఆటపై మరింత అవగాహనతో ఉన్నా" అని హస్సీ తెలిపాడు.

> బహుశా అత్యధిక సెంచరీలు, ఎక్కువ విజయాలు, ఎక్కువ యాషెస్ సిరీస్‌లను నెగ్గడం, అత్యధికంగా వరల్డ్ కప్‌లు సాధించి ఉండేవాడిని. దురదృష్టవశాత్తూ ఉదయాన్నే నిద్ర లేవడంతో అవన్నీ మాయమైపోయాయి.

అంకెల్లో ఇలా..

మైక్ హస్సీ 28వ ఏట అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. అప్పటికి దేశవాళీలో 61 సెంచరీల సాయంతో 23వేలకు పైగా పరుగులు చేశాడు. ఆసీస్ తరఫున 2004లో అరంగేట్రం చేసిన హస్సీ.. మూడు ఫార్మాట్లలో కలిపి 12,398 పరుగులు చేశాడు. 79 టెస్టుల్లో 6,235 పరుగులు, 185 వన్డేల్లో 5,442 పరుగులు, 38 టీ20ల్లో 721 పరుగులు చేశాడు. ఇక ఐపీఎల్‌లోనూ 59 మ్యాచులు ఆడిన హస్సీ 1,977 రన్స్ చేశాడు. చివరికి 2012లోనే హస్సీ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పేశాడు.

ఇక సచిన్ విషయానికొస్తే.. భారత క్రికెట్ దిగ్గజం 200 టెస్టుల్లో 15,921 పరుగులు, 463 వన్డేల్లో 18,426 పరుగులు, ఒకే ఒక్క టీ20లో 10 రన్స్ చేశాడు. వంద సెంచరీలు చేసిన ఏకైక క్రికెటర్. అయితే, సచిన్ 16 ఏళ్ల వయసులో అరంగేట్రం చేశాడు. దాదాపు 24 ఏళ్లపాటు అతడి కెరీర్ కొనసాగింది. బౌలర్‌గానూ ఇంటర్నేషనల్ క్రికెట్‌లో 200o వికెట్లు తీయడం గమనార్హం. సచిన్ 2013లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు.

# పాక్ ఔట్.. భారత్‌లోనే మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్



మహిళల వన్డే ప్రపంచకప్ లీగ్ స్టేజ్ ముగింపు దశకు చేరుకుంటోంది. ఇప్పటికే మూడు టీమ్‌లు సెమీస్‌కు చేరుకోగా.. నాలుగో బెర్తు ఖరారు కావాల్సి ఉంది. తమకు మరో మ్యాచ్ మిగిలి ఉండగానే మెగా టోర్నీ నుంచి బంగ్లాదేశ్, పాకిస్థాన్ ఎలిమినేట్ అయిపోయాయి. భారత్, న్యూజిలాండ్, శ్రీలంక టాప్-4లోకి వచ్చేందుకు పోటీపడుతున్నాయి. ఈ క్రమంలో మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌కు సంబంధించి అప్‌డేట్ ఒకటి వచ్చింది. ఫైనల్ మ్యాచ్ కూడా భారత్ వేదికగానే జరగనుంది. నవీ ముంబయి దీనికి ఆతిథ్యం ఇవ్వనుంది. పాకిస్థాన్ టోర్నీ నుంచి నిష్క్రమించడంతో ఐసీసీకి వెసులుబాటు దక్కింది. ఒకవేళ పాక్ ఫైనల్‌కు చేరుకుంటే.. ఆ మ్యాచ్‌ను కొలంబోలో నిర్వహించాల్సి ఉండేది. ఇప్పుడు లీగ్ స్టేజ్‌లోనే ఔట్ కావడంతో ఫైనల్ భారత్‌లోనే జరగనుంది. తొలి సెమీస్ (అక్టోబర్ 29)కు ఇంకా వేదికను ఖరారు చేయలేదు. ఆ మ్యాచ్‌కు ఇండోర్ ఆతిథ్యం ఇచ్చే అవకాశం ఉంది. రెండో సెమీస్ (అక్టోబర్ 30) నవీ ముంబయిలోనే జరగనుంది. నవంబర్ 2న మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్ ఉంది.

గురువారం మ్యాచ్ కీలకం..

తొలి రెండు మ్యాచుల్లో గెలిచి అదరగొట్టిన భారత్‌కు ఆ తర్వాత కలిసి రాలేదు. వరుసగా మూడింట్లో ఓడి సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. గురువారం న్యూజిలాండ్‌తో మ్యాచ్ టీమ్ఇండియాకు అత్యంత కీలకం. ఇందులో ఏమాత్రం ఓడినా సెమీస్‌కు చేరుకోవడం మరింత కష్టంగా మారడం ఖాయం. ఎందుకంటే నాలుగో బెర్తు కోసం రేసులో కివీస్, శ్రీలంక మాత్రమే ఉన్నాయి. కివీస్‌పై విజయం సాధిస్తే భారత్ ఇబ్బందిలేకుండా సెమీస్‌కు చేరుకుంటుంది. ఇక చివరి లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో టీమ్ఇండియా అక్టోబర్ 26న తలపడనుంది.



# పంత్ వచ్చేశాడు భారత్-ఎ కెప్టెన్‌గా ఎంపిక

దిల్లీ: భారత వికెట్‌కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ తిరిగి ఫిట్‌నెస్ సాధించాడు. గాయం నుంచి కోలుకున్న అతడు.. దక్షిణాఫ్రికా-ఎతో తలపడే భారత్-ఎ జట్టుకు కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. జులైలో ఇంగ్లాండ్‌లో నాలుగో టెస్టు సందర్భంగా పేసర్ వోక్స్ బంతి తగిలి పంత్ పాదం విరిగింది. దీంతో అతడు స్వదేశంలో వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌కు దూరమయ్యాడు. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు ముందు పంత్‌కు ఈ నాలుగు రోజుల మ్యాచ్‌లు విలువైన గేమ్ టైమ్‌ను ఇవ్వనున్నాయి. సాయి సుదర్శన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్న ఈ జట్టు తరఫున రాహుల్, సిరాజ్ సహా సీనియర్ జట్టులోని చాలా మంది ఆటగాళ్లు ఆడనున్నారు. బ్యాటర్ మార్కస్ ఆకర్‌మ్యాన్ నేతృత్వంలో దక్షిణాఫ్రికా-ఎ జట్టులో సీనియర్ టీమ్ కెప్టెన్ బవుమా కూడా ఉన్నాడు. 'ఎ' జట్ల మ్యాచ్‌లు రెండూ బెంగళూరులోనే జరుగుతాయి. తొలి మ్యాచ్ ఈ నెల 30 మొదలవుతుంది. రెండు జట్లు మూడు వన్డే మ్యాచ్‌ల్లోనూ తలపడతాయి. భారత్, దక్షిణాఫ్రికా సీనియర్ జట్ల మధ్య తొలి టెస్టు నవంబరు 14న మొదలవుతుంది. రెండో టెస్టు నవంబరు 26 నుంచి జరుగుతుంది. ఆ తర్వాత రెండు జట్లు మూడు వన్డేలు, అయిదు టీ20ల్లో ఢీకొంటాయి.

# షార్ట్ టర్మ్ గోల్స్ పెట్టుకొంటేనే ఉత్తమం: విరాట్‌కు రికీ సూచన



విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కేవలం వన్డేల్లోనే కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. అయితే, ఆసీస్‌తో తొలి వన్డేలో రాణించలేకపోయారు. వారిని ఆడించడంపై పలువురు విమర్శలు చేస్తుండగా.. మరికొందరు మాత్రం కాస్త సమయం ఇవ్వాలని చెబుతున్నారు. క్రికెట్‌లో అన్నీ సాధించారు ఇంకెంతకాలం ఆడతారనే వ్యాఖ్యలూ వినిపించాయి. ఈ క్రమంలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ స్పందించాడు. ఎవరినుంచైనా తనకు ఇలాంటి మాటలు వినడం అస్సలు నచ్చదని వ్యాఖ్యానించాడు.

"నాకు ఇలాంటివి వినడం నచ్చదు. క్రికెట్ లేదా ఇతర గేముల్లో అంతా సాధించాం అని ఎవరినోటా వినిపించకూడదు. ఎందుకంటే ఆడేటప్పుడు చేయగలిగినవి చాలా ఉంటాయి. అందుకోసం షార్ట్ టర్మ్ గోల్స్‌ను నిర్దేశించుకోవాలి. అలాకాకుండా వచ్చే వన్డే ప్రపంచకప్‌లోనే ఆడతానని భావించకూడదు. ఒక్కో అడుగు ముందుకేస్తూ సాగాలి. ఈ విషయంలో విరాట్ కోహ్లీ ప్రేరణ పొందే ప్లేయర్. తప్పకుండా అతడు ప్రశాంతంగా కూర్చొని... ఆస్ట్రేలియా సిరీస్‌లో తాను సాధించాల్సిన స్వల్పకాలిక లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. అలా చేస్తాడని భావిస్తున్నా. వచ్చే ప్రపంచ కప్ వరకూ వేచి ఉంటూ సమయం గడపాల్సిన అవసరం లేదు. విరాట్, రోహిత్ గురించి మనకు చాలా తెలుసు. వారు అత్యుత్తమ దశలో ఉన్నప్పుడు.. భారత బెస్ట్ టీమ్‌లో సభ్యులు. అయితే ఇప్పటికి.. రాబోయే వరల్డ్ కప్ నాటికి ఉత్తమ ప్రదర్శనను రాబట్టగలరా? అనేది స్టార్ ప్లేయర్లు తెలుసుకోవాలి" అని రికీ వ్యాఖ్యానించాడు.వారిద్దరి పైనే చర్చ: మెక్‌గ్రాత్"భారత్ – ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన తొలి వన్డే గురించి మాట్లాడటం కంటే రోహిత్, విరాట్‌ల పైనే ఎక్కువ చర్చ సాగుతోంది. చాలా రోజుల తర్వాత మైదానంలోకి దిగారు.

# కుల్‌దీప్ కనిపించడా!



%ఇటీవలే ఆసియా కప్ టీ20 టోర్నీ జరిగింది. అందులో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ ఎవరో తెలుసా? కుల్‌దీప్ యాదవ్. అతను 7 మ్యాచ్‌ల్లో 10 లోపు సగటుతో 17 వికెట్లు పడగొట్టాడు. రెండో స్థానంలో నిలిచిన షహీన్ అఫ్రిది (10)కి అతడికి వికెట్ల అంతరం 7. ప్రతి మ్యాచ్‌లో వికెట్ల వేటలో దూసుకెళ్లిన అతను.. పరుగులు కట్టడి చేయడంలోనూ తనకు తానే సాటి అనిపించాడు. అలాంటి బౌలర్‌కు.. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ తొలి మ్యాచ్‌లో తుది జట్టులో చోటు లేకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. మరి తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో అయినా అతడికి ఛాన్స్ ఇస్తారో లేదో!

ఈనాడు క్రీడావిభాగం : ఆస్ట్రేలియాతో తొలి వన్డేలో పిచ్ పేసర్లకు బాగా సహకరించింది కాబట్టే టీమ్ఇండియా కుల్‌దీప్‌కు అవకాశం ఇవ్వలేదమో అనుకోవడానికీ ఆస్కారం లేదు. పిచ్ ఎలా ఉన్నప్పటికీ తుది జట్టులో ఇద్దరు స్పిన్నర్లను ఆడించింది భారత్. అక్షర్ రూపంలో ఒక స్పిన్ ఆల్‌రౌండర్‌ను ఎంచుకుని, స్పెషలిస్టు స్పిన్నర్‌గా కుల్‌దీప్‌ను ఆడిస్తే అది సరైన ఎంపిక అయ్యేదేమో! కానీ మరో స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను ఎంచుకున్నారు. అతను 10 పరుగులే చేయగలిగాడు. ఒక వికెట్ పడగొట్టాడు. కొన్నేళ్ల నుంచి నిలకడగా రాణిస్తున్నప్పటికీ కుల్‌దీప్‌కు తన ప్రతిభకు తగ్గ అవకాశాలు రావట్లేదనే విమర్శలున్నాయి. ఇంగ్లాండ్ పర్యటనలో కుల్‌దీప్‌ను తుది జట్టులో ఆడించాలని గావస్కర్ సహా పలువురు మాజీల నుంచి డిమాండ్లు వచ్చినా జట్టు యాజమాన్యం పట్టించుకోలేదు. 5 టెస్టుల సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌లోనూ అతడికి ఛాన్స్ ఇవ్వలేదు. ఆల్‌రౌండర్లు నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్‌లే అవకాశాలు అందుకున్నారు. ఆ ఇద్దరూ ఆకట్టుకోలేకపోయారు. తర్వాత ఆసియా కప్ టీ20 టోర్నీలోనే కాక వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌లో కుల్‌దీప్ అదరగొట్టాడు.

విండీస్‌తో రెండో టెస్టులో అతనే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్. రెండు టెస్టుల్లో కలిపి అతను 12 వికెట్లు తీశాడు. ఆ సిరీస్ అయ్యాక ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ఎంపిక కావడంతో తుది జట్టులో అతడికి ఛాన్స్ దక్కొచ్చనే అంచనాలు కలిగాయి. కానీ తొలి వన్డేలో కుల్‌దీప్‌ను ఆడించలేదు. గత రెండేళ్లుగా కుల్‌దీప్ ఏ ఫార్మాట్లో అవకాశం దక్కినా రాణిస్తున్నాడు. ఐపీఎల్‌లోనూ సత్తా చాటుతున్నాడు. కానీ మిగతా బౌలర్లకు దక్కినన్ని అవకాశాలు కుల్‌దీప్‌కు రావట్లేదు. ఆల్‌రౌండర్ కాదు కానీ.. కుల్‌దీప్ ఒక మోస్తరుగా బ్యాటింగ్ చేయగలడు. ఇక బంతితో అతను తెచ్చే విలువే వేరు. ప్రస్తుతం టీమ్ఇండియాలో అతనే అత్యుత్తమ స్పిన్నర్ అనడంలో సందేహం లేదు.

బంతిని బాగా టర్న్ చేస్తాడు. బంతుల్లో వైవిధ్యం చూపిస్తాడు. చైనామన్ స్పిన్నర్ కావడం వల్ల అతణ్ని చదవడం బ్యాటర్లకు సవాలే. గతంలో ఒకట్రెండేళ్లు ఫామ్ లేమి, ఫిట్‌నెస్ సమస్యలతో కుల్‌దీప్ ఇబ్బంది పడ్డాడు. కానీ కొంత విరామం తీసుకుని బౌలింగ్‌కు మెరుగులు దిద్దుకుని వచ్చాక చక్కటి ప్రదర్శన చేస్తున్నాడు. అయినా అతడిపై సెలక్టర్లు, జట్టు యాజమాన్యం శీతకన్నేస్తుండడం విచారకరం. మరి చివరి రెండు వన్డేల్లో అయినా కుల్‌దీప్‌కు అవకాశం దక్కుతుందేమో చూడాలి.

# అంబేద్కర్ సచివాలయంలో జాతర ఏర్పాట్లపై సమీక్ష

ములుగు జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 (భారత శక్తి) : మేడారం మహాజాతర ఏర్పాట్లపై తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మేడారం జాతరకి గిరిజన సంక్షేమ శాఖ రూ. 150 కోట్లు మంజూరు చేయగా అందులో రూ. 90 కోట్లు సివిల్ వర్క్స్ కు, రూ. 60 నాన్ సివిల్ వర్క్స్ కు మంజూరు చేశారు. సివిల్ వర్క్స్ స్టేటస్, నాన్ సివిల్ వర్క్స్ యాక్షన్ ప్లాన్ మీద సమీక్ష నిర్వహించి సబ్యసాచి ఘోష్ ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి మాట్లాడారు. మేడారం జాతర ఏర్పాట్లను మొత్తం 8 జోన్లు, 31 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. జోన్-3 జంపన్న వాగు ప్రాంతంగా నిర్ణయించి,జాతర సమయంలో 10 నుండి 12 వేలమంది పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు. ప్రతి జోన్‌కు ఒక జోనల్ అధికారిని నియమించ నున్నట్లు తెలిపారు. 24 శాశ్వత టవర్స్, 20 సెల్ఆన్‌వీల్స్, 350 వైఫై పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కోర్ రూట్లు పార్కింగ్ ప్రదేశాలను గుర్తించారు.

మొత్తం 49 పార్కింగ్ ప్రదేశాలు (వెయ్యి 50 ఎకరాలు) గుర్తించబడి, దాదాపు 4.5 నుండి 6 లక్షల వాహనాలు నిలిపే సదుపాయం కల్పించబడుతుందని, ఈ ఏర్పాట్లు నవంబర్ 30 నాటికి పూర్తవుతాయని తెలిపారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో 24+9 ఫారెస్ట్ రోడ్లు (కచ్చా నుండి డబుల్ లేన్) రూపంలో అభివృద్ధి చేస్తున్నారు. వీటిలో భాగంగా వైల్డ్ లైఫ్ శాంక్చువరీలోని రహదారులు కూడా చేర్చబడ్డాయి. ఆర్ & బీ శాఖ ద్వారా 42 కోట్లతో ఆలయం చుట్టూ రహదారులు, 92 కోట్లతో ప్రధాన రహదారులు నిర్మించబడుతున్నాయి. జాతర సమయానికి ముందు, మధ్య మరియు తరువాత ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక జాతర సందర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు. జంపన్న వాగు వద్ద తాత్కాలిక రహదారి కూలిపోయిన కారణంగా



మరమ్మత్తు పనులు వేగంగా జరుగుతున్నాయి. 517 బోరుపాయింట్లు/నీటి వనరులు, 250 కిలోమీటర్ల రహదారులపై లైటింగ్ పనులు జరుగుతున్నాయి. స్థానికుల సహకారంతో 6 స్లాటర్ సెంటర్లు ఏర్పాటు చేయబడ్డాయి. జంపన్న వాగు పునరుద్ధరణ పనులు సాగిస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. 9,111 విద్యుత్ స్తంభాలు, 259 ట్రాన్స్ఫార్మర్లు అమర్చే పనులు విద్యుత్ శాఖ చేపట్టింది. జాతర ప్రాంతమంతా ఎండోమెంట్స్ శాఖ ఆధ్వర్యంలో ప్రకాశ ఏర్పాట్లు (ఇల్యూమినేషన్) చేయనున్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర విజయవంతంగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని సబ్యసాచి ఘోష్ ఆదేశించారు. ఈ సమావేశంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మహేష్ భగత్, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, ములుగు ఎస్పీ, ఐ టి డి ఏ పి ఓ చిత్ర మిశ్రా, డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, ఎలక్ట్రిసిటీ CMD వరుణ్ రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక, ఇతర సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొని తమ తమ ఇన్పుట్ అందించారు.

## పత్రికా కార్యాలయల పై దాడులు అనైతికం

**: టీయూడబ్ల్యూజేరాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎ.కొమురయ్య**



ములుగు జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 (భారత శక్తి): మడికొండలోని నమస్తే తెలంగాణ దినపత్రిక వరంగల్ యూనిట్ కార్యాలయంపై దాడినీ తీవ్రంగా ఖండిస్తున్నామని పత్రిక కార్యాలయాలపై దాడులు చేయడం అనైతికమని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎనగందుల కొమురయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ రాజకీయ పార్టీల, ప్రజాప్రతినిధి అయినా ప్రజాస్వామ్యంలో నాలుగోస్థంభంగా ఉన్న మీడియా, పత్రిక విలేకరులపై బెదిరింపులకు దిగటం సరియైనవి కాదని, సమాజంలో జరుగుతున్న పరిణామాలపై వార్తలు రాసే స్వేచ్ఛ పత్రికలకు ఉంటుందని, పత్రికల్లో తమకు వ్యతిరేక వార్తలు వస్తే, వాటిని ఖండిస్తూ వివరణలు ఇవ్వాలే తప్ప , బెదిరింపులకు పాల్పడటం, భౌతిక దాడులకు దిగడం అప్రజస్వామికమన్నారు. పత్రికా కార్యాలయంపై దాడికి దిగిన దుండగులను వెంటనే అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## నిరుపేద పిల్లలకు ఆధార్ రిజిస్ట్రేషన్ మొదలగు అంశాలపై ఆధార్ సెంటర్ విజిట్

కడప, అక్టోబర్ 22 (భారత శక్తి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి.యామిని వారి సూచనల మేరకు గౌరవ శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీకంసీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు ఆధార్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న నిరుపేద పిల్లల ఆధార్ ప్రోగ్రెస్ కొరకు కడప నగరం మోచంపేట నందుగల ఆధార్ సెంటర్ ను విజిట్ చేయడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధార్ రిజిస్ట్రేషన్, ఆధార్ కార్డుకు పట్టే సమయము, ఆధార్ లో ఏమైనా సమస్యలు వస్తే తిరిగి ఎలా చేయించుకోవాలి మొదలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. నిరుపేద పిల్లల ఆధార్ రిజిస్ట్రేషన్ లను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆధార్ సెంటర్ నిర్వాహకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.



## ఖమ్మం లో అయ్యప్పల అన్నదానం ప్రారంభం

ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 22 (భారత శక్తి ప్రతినిధి): శ్రీ దివ్య మణికంఠ అన్నదాన సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో 41రోజుల పాటు జరుగు అన్నదానం కార్యక్రమం బుధవారం ముస్తఫానగర్ లో ప్రారంభం అయినది. ఈ సందర్భంగా నారాయణ నంబూద్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ చిర్ర రవి మాట్లాడుతూ..... ప్రతి సంవత్సరం లాగే ఈ సారి కూడా నవంబర్ 22నుండి డిసెంబర్ 01 వరకు 41రోజుల పాటు అయ్యాప్ప, భవాని, శివ మాలదారులకు అన్న ప్రసాదం అందిస్తామన్నారు. ప్రతి రోజు 600 1000మంది స్వాములు ఈ అన్నదానం లో పాల్గొంటున్నారు అని తెలిపారు. స్వాములు అందరు ఈ అన్నదానం కార్యక్రమం లో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ మందడుపు మనోహర్, టి పుల్లం రాజు,మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాల (బాలికలు) విజిట్ మరియు న్యాయవిజ్ఞాన



కడప, అక్టోబర్ 22 (భారత శక్తి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి.యామిని వారి సూచనల మేరకు గౌరవ శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీకంసీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు కడప నగరం చిన్న చౌక్ నందు గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాల (బాలికలు) ను విజిట్ చేయడం జరిగినది. ఈ సందర్భంగా టీచర్ల కొరత, భవన రిపేర్లు, గత ఐదు సంవత్సరముల నుండి కాస్మోటిక్ చార్జీలు ఇవ్వడం లేదు, సీసీ కెమెరాలు పనిచేయడం లేదు, ఆరో ప్లాంట్ లేదు మొదలగు విషయాలను విద్యార్థినిలు గౌరవ జడ్జి గారి దృష్టికి తీసుకురావడం జరిగినది, ఈ విషయాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తాను అని చెప్పడం జరిగినది. అనంతరం వసతిగధులను, టాయిలెట్స్, నీటి సదుపాయాలు, వారికి అందుతున్న భోజనం సదుపాయాలను, మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024, గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరము, పోక్సో చట్టము, క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి, చదివిన సంస్థకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి, గౌరవ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ న్యాయ సహాయం కోసం హెల్ప్‌లైన్ 15100, చైల్డ్ లైన్ నెంబర్ 1098, క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి, చదివిన సంస్థకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి, ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, వార్డెన్, ఉపాధ్యాయునిలు మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## భక్తుల మనోభావాలతో ఆలయ అధికారుల ఆటలు



*** పరిరక్షణ సమితి సభ్యులు పోతు అనిల్..**

వేములవాడ,అక్టోబర్ 22 (భారత శక్తి) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ మునివేత పై పలు ఛానలలో సోషల్ మీడియా వేదికగా బుధవారం ప్రసారం కావడం రాజన్న భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని,ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు పోతు అనిల్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పేరుతో రోజుకో విధంగా ఆలయ అధికారులు ప్రవర్తించడం వారి మనోభావాలతో ఆటలాడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్తీక మాసం లో శివయ్యకు భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో దీపారాధన పూజలు నిర్వహిస్తారని,వారి మనోభావాలను గుర్తించి మహాశివరాత్రి తర్వాత ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని, అప్పటివరకు భక్తులకు రాజన్న దర్శనం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## తెలంగాణ తల్లి విగ్రహ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 22 (భారత శక్తి): బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహ పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. విగ్రహ నిర్మాణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన నమూనాలో, అత్యంత నాణ్యంగా తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన జరగాలన్నారు. నిర్ణీత గడువులోగా విగ్రహ నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షకులు సూర్యారావు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పోలీసుల సేవలు, త్యాగాలు విద్యార్థులకు స్ఫూర్తి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 22 ( భారత శక్తి): పోలీస్ అమరవీరుల దినం* (పోలీస్ ఫ్లాగ్ డే) వారోత్సవాల్లో భాగంగా, *జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఈరోజు నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీన ఐపీఎస్ ఆధ్వర్యంలో నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాల విద్యార్థినీ-విద్యార్థులు పాల్గొన్నారు. వారికి పోలీసులు వినియోగించే *ఆయుధాలు, సాంకేతిక పరికరాలు, సైబర్ నేరాల గురించి, గంజాయి వాడకం పై కలిగే అనర్థాలు, పోలీసు విధులు,షీ టీమ్, భరోసా, సెక్యూరిటీ, ఆంటీ



నార్కోటిక్ డ్రగ్, డాగ్ స్క్వాడ్ విభాగాల విధులు, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, పోలీసులు చేసిన ప్రతిభ, త్యాగాలు తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. పోలీస్ స్టేషన్‌లో పని చేసే ప్రతి సిబ్బంది విధులు, బాధితులు పోలీస్ స్టేషన్‌కు ఎలా ఫిర్యాదు ఇవ్వాలి, ఆ ఫిర్యాదు తర్వాత ఏ శాఖ ఎలా విచారణ జరుపుతుందన్న అంశాలను విద్యార్థులకు వివరించారు. కొన్ని పరికరాల పనితీరును ప్రాక్టికల్‌గా చూపించారు. డయల్ 100 విధానం గురించి, బాధితులు కాల్ చేసిన వెంటనే పోలీసులు ఎలా స్పందిస్తారన్న విషయాలను కూడా క్లుప్తంగా వివరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చి, ఆయుధాల వినియోగం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ రాజేష్ మీన, విద్యార్థులకు ఆయుధాలు, పోలీస్ చట్టాలు, సీసీ కెమెరాల ప్రాధాన్యం, డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ ఎక్విప్మెంట్, రోడ్డు భద్రతా నిబంధనలు, సైబర్ నేరాల అవగాహన అంశాలను వివరిస్తూ మార్గదర్శనం చేశారు. పోలీసులు ఉపయోగించే ఆయుధాలు ఏకే47, ఎస్ఎల్ఆర్, కార్బైన్, 9mm పిస్టల్ అలాగే బీడీ టీమ్, ఫింగర్ ప్రింట్, క్లూస్ టీమ్, షీ టీమ్, భరోసా, కమాండ్ కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాలు, స్పీడ్ లేజర్ గన్, ట్రాఫిక్ కిట్లు, గంజాయి* మరియు ఇతర మత్తు పదార్థాల నిరోధక పరికరాలు, డాగ్ స్క్వాడ్, సైబర్ క్రైమ్ తదితర స్టాళ్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన కల్పించారు.

# దేశానికి పొలిటికల్ ఇస్లాం పెను ప్రమాదం: యోగి ఆదిత్యనాథ్

ఉత్తరప్రదేశ్ , అక్టోబర్ 22 (భారత శక్తి) : భారతదేశానికి పొలిటికల్ ఇస్లాం పెను ప్రమాదమని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హెచ్చరించారు. ఈ ముప్పుతో మన పూర్వీకులు పోరాడారని, అయితే దాని గురించి అంతగా చర్చ జరగలేదని ఆయన అన్నారు. చరిత్రలో బ్రిటిష్, ఫ్రెంచ్ వలసదారుల ప్రస్తావన ఉన్నప్పటికీ, పొలిటికల్ ఇస్లాంపై ప్రస్తావన చాలా తక్కువగా వచ్చిందని అన్నారు. గోరఖ్‌పూర్‌లో జరుగుతున్న ఆరెస్సెస్ శతజయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ, గురుగోవింద్ సింగ్, మహారాణా ప్రతాప్, మహారాణా సంగా వంటి వీరులు పొలిటికల్ ఇస్లాంపై పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ చరిత్రను ఎవరూ పెద్దగా పట్టించుకోలేదని అన్నారు. పొలిటికల్ ఇస్లాం ద్వారా దేశాన్ని విడగొట్టేందుకు చాంగూర్ బాబా వంటి శక్తులను ఉపయోగించుకుంటారని, అలాంటి శక్తుల నుంచి రక్షించేందుకు సమాజాన్ని ఏకం చేసే కృషిని ఆరెస్సెస్ కొనసాగిస్తోందని అన్నారు. మతమార్పిడులకు సిద్ధపడేవారికి కులం ఆధారంగా చాంగూర్ బాబా డబ్బులు ఆఫర్ చేసేవారిని ఆదిత్యనాథ్ తెలిపారు. ఈ డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయో ఎవరికీ తెలియదని అన్నారు. ఎక్కడో విదేశాల నుంచి రావడం లేదని, మీ నుంచే వస్తున్నాయని ప్రజలను ఉద్దేశించి అన్నారు. మీరు ఏదైనా వస్తువులు కొన్నప్పుడు దానిపై హలాల్ సర్టిఫికెట్ ఉందో లేదో చూసుకోవాలని అన్నారు. ఉత్తర ప్రదేశ్‌లో హలాల్ సర్టిఫికెట్‌ను జారీ చేశామని అన్నారు. ఆశ్చర్యకరమేమంటే హలాల్ సర్టిఫికెట్ ఉన్న వస్తువుల్లో సబ్బులు, దుస్తులు, అగ్గిపెట్టెలు ఉన్నాయని అన్నారు. కేంద్రం నుంచి లేదా రాష్ట్రం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే హలాల్ సర్టిఫికేషన్ పేరుతో రూ. 25,000 కోట్లు పోగు చేశారని ఆరోపించారు. ఈ డబ్బును ఉగ్రవాదం, లవ్ జిహాద్, మతమార్పిడులకు ఖర్చు చేస్తుంటారని యోగి ఆరోపించారు. ఏదైనా వస్తువు కొనేటప్పుడు ఎవరు తయారు చేశారో చూసుకోవాలని అన్నారు.

## మంటలు అంటుకుని
## దగ్ధమైన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సు

హైదరాబాద్, అక్టోబర్ 22 (భారత శక్తి) : హైదరాబాద్‌లోని నాదర్‌గుల్‌లో ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సులో అగ్ని ప్రమాదం సంభవించింది. బస్సు నుండి ఒక్కసారిగా పొగలు రావడాన్ని గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమై బస్సును నిలిపి దిగిపోయారు. ఆ తరువాత బస్సు పూర్తిగా కాలిపోయింది. పాఠశాల ముగిసిన అనంతరం విద్యార్థులను వారి ఇళ్ల వద్ద దింపి తిరిగి వస్తుండగా కాటేదాన్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సమయానికి బస్సులో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బస్సులో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

## ఒలింపిక్ హీరో నీరజ్ చోప్రాకు సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్ హోదా

ఢిల్లీ, అక్టోబర్ 22 (భారత శక్తి) : భారత జావెలిన్ సంచలనం, రెండుసార్లు ఒలింపిక్ పతకాల విజేత నీరజ్ చోప్రా ఖాతాలో మరో అరుదైన గౌరవం చేరింది. ఆయనకు భారత ప్రాదేశిక సైన్యంలో (టెరిటోరియల్ ఆర్మీ) గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదాను ప్రదానం చేశారు. ఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లో ఈరోజు జరిగిన ఓ కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ లాంఛనాన్ని పూర్తి చేసి, నీరజ్ భుజంపై గౌరవ చిహ్నాలను అలంకరించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. నీరజ్ చోప్రా పట్టుదల, దేశభక్తి, నిబద్ధతకు నిలువుటద్దం వంటి వారని కొనియాడారు. క్రీడారంగంలో ఆయన సాధించిన అద్భుత విజయాలు దేశానికి గర్వకారణమని, ఆయన క్రీడాకారులకు, సైనిక దళాలకు ఒకేలా స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఇతర ఉన్నతాధికారులు, నీరజ్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. నీరజ్ చోప్రా 2016 ఆగస్టు 26న రాజ్‌పుతానా రైఫిల్స్‌లో నాయబ్ సుబేదార్‌గా భారత సైన్యంలో చేరారు. అప్పటి నుంచి క్రీడల్లో రాణిస్తూనే దేశానికి సేవ చేస్తున్నారు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించి చరిత్ర సృష్టించిన ఆయన, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజతం గెలుచుకున్నారు. ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్‌లోనూ ఆయన స్వర్ణ పతకాలు సాధించారు. దేశానికి ఆయన అందించిన సేవలు, క్రీడల్లో సాధించిన విజయాలకు గుర్తింపుగా.. నీరజ్ చోప్రాకు ఈ గౌరవ హోదాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ ఏడాది ఏప్రిల్ 16నే ఆమోదించారు. దీనికి సంబంధించిన అధికారిక కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. నీరజ్ చోప్రా ఇప్పటికే పద్మశ్రీ, మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న, అర్జున అవార్డులతో పాటు పరమ విశిష్ట సేవా పతకం, విశిష్ట సేవా పతకం వంటి సైనిక పురస్కారాలను కూడా అందుకున్నారు.

## గల్ఫ్ ప్రవాసులకు అండగా 'ప్రవాసాంధ్ర భరోసా'..
## దుబాయ్‌లో సీఎం చంద్రబాబు

దుబాయ్, అక్టోబర్ 22 : గల్ఫ్ దేశాల్లోని ప్రవాసాంధ్రులకు భరోసా కల్పించే దిశగా ఏపీ ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. సీఎం చంద్రబాబు తన యూఏఈ పర్యటనలో భాగంగా 'ప్రవాసాంధ్ర భరోసా' అనే ప్రత్యేక బీమా పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద దురదృష్టవశాత్తు ప్రవాసీయులు మరణిస్తే వారి కుటుంబానికి రూ. 10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందనుంది. మూడు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం దుబాయ్ చేరుకున్న సీఎం చంద్రబాబుకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. స్థానిక భారత కాన్సుల్ జనరల్ సతీశ్ కుమార్ శివన్, టీడీపీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ, దుబాయ్ నగర టీడీపీ అధ్యక్షుడు విశ్వేశరరావు, ఇతర అధికారులు ఆయనను సాదరంగా ఆహ్వానించారు. పెద్ద సంఖ్యలో ప్రవాసాంధ్ర మహిళలు కూడా తరలివచ్చి స్వాగతం పలకడం విశేషం. ఈ సందర్భంగా టీడీపీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ మాట్లాడుతూ, ప్రవాసాంధ్ర భరోసా పథకం ఆపదలో ఉన్న ప్రవాసీ కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తుందని తెలిపారు. కష్టకాలంలో వారిని ఆదుకునేందుకే ఈ పథకాన్ని రూపొందించినట్లు ఆయన వివరించారు. సీఎం పర్యటన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ప్రవాసీయులతో భారీ సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వివిధ గల్ఫ్ దేశాల నుంచి టీడీపీ అభిమానులు, ప్రముఖులు, ప్రవాసాంధ్రులు దుబాయ్‌కు చేరుకుంటున్నారు.

## ఒక్కరోజే రూ. 9 వేలు తగ్గిన బంగారం ధరలు..

హైదరాబాద్, అక్టోబర్ 22 (భారత శక్తి) : బంగారం ధరలు భారీగా తగ్గుముఖం పడుతున్నాయి. కొద్ది రోజుల క్రితం తులం రూ. 1,30,000 దాటి రికార్డు స్థాయికి చేరిన బంగారం ధర ప్రస్తుతం తగ్గుతోంది. హైదరాబాద్ నగరంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,25,250కి చేరుకుంది. 22 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ. 1,14,843గా నమోదైంది. నిన్నటితో పోలిస్తే బంగారం ధర దాదాపు రూ. 9 వేలు తగ్గింది. వెండి ధరలు కూడా గణనీయంగా తగ్గాయి. బుధవారం సాయంత్రానికి కిలో వెండి రూ. 7 వేలు తగ్గి, రూ. 1,58,000కి చేరింది. వారం రోజుల్లో వెండి ధర రూ. 28 వేలు తగ్గడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,022 డాలర్లకు పడిపోయింది. వెండి ధర 47.84 డాలర్లకు చేరింది. అమెరికాలో షట్ డౌన్, అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ఇటీవల బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. ధరలు నిత్యం సరికొత్త గరిష్ఠ స్థాయిలను తాకాయి. విలువైన లోహాలు రికార్డు స్థాయికి చేరుకోవడంతో పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు ఆసక్తి చూపారు. దీనికి తోడు డాలర్ బలోపేతం కావడం, అంతర్జాతీయ ఉద్రిక్తతలు తగ్గడం కూడా కారణమని బులియన్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణంపై
## రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 22 (భారత శక్తి) : ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రి కొత్త భవనాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భవన నిర్మాణ పనుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు ఆధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లుగా గదుల నిర్మాణం, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలని అన్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో పదిరోజులకు ఒకసారి పర్యటించాలని సూచించారు.

## శబరి గిరుల్లో చారిత్రక ఘట్టం.. ఇరుముడితో పడిమెట్లెక్కిన రాష్ట్రపతి



శబరిమల, అక్టోబర్ 22 (భారత శక్తి) : శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం ఒక చారిత్రక ఘట్టానికి వేదికైంది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం స్వామివారిని దర్శించుకున్నారు. తద్వారా, ఈ ప్రఖ్యాత పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన తొలి మహిళా దేశాధినేతగా ఆమె చరిత్ర సృష్టించారు. గతంలో 1970లలో మాజీ రాష్ట్రపతి వీవీ గిరి శబరిమలను సందర్శించగా, ఆ తర్వాత అయ్యప్పను దర్శించుకున్న రెండో భారత రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము నిలిచారు. కేరళలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆమె శబరిమలకు చేరుకున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు పంబా బేస్ క్యాంపు వద్దకు వచ్చిన ఆమె, మొదట పంపా నదిలో పాదాలను శుభ్రం చేసుకుని, సమీపంలోని గణపతి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం నల్ల చీర ధరించి సంప్రదాయబద్ధంగా 'కెట్టునిర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆమె 'ఇరుముడికెట్టు'ను సిద్ధం చేశారు. రాష్ట్రపతితో పాటు ఆమె అల్లుడు గణేష్ చంద్ర హోంబ్రామ్, ఇతర సిబ్బంది కూడా ఇరుముడిని సిద్ధం చేసుకున్నారు. పంబ నుంచి ప్రత్యేక వాహనంలో సన్నిధానానికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ తంత్రి కందరారు మహేష్ మోహనారు 'పూర్ణకుంభ' స్వాగతం పలికారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి వీఎన్ వాసవన్ కూడా ఆమెకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ద్రౌపది ముర్ము పవిత్రమైన ఇరుముడిని తలపై పెట్టుకుని, 18 మెట్లను ఎక్కి అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఆమె ఇరుముడిని ప్రధాన అర్చకులు తీసుకుని పూజలు నిర్వహించారు. ఆ తర్వాత మాలికాపురం ఆలయాన్ని కూడా ఆమె సందర్శించారు. రాష్ట్రపతి పర్యటనపై బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "ఆమె వయసు 67. ఆమె ఏ నిబంధనలను ఉల్లంఘించలేదు, ఏ విశ్వాసాన్ని గాయపరచలేదు - కేవలం గౌరవించారు. ఇరుముడితో అయ్యప్పను దర్శించుకున్న తొలి రాష్ట్రపతిగా నిలిచారు" అని ఆయన పేర్కొన్నారు. "భక్తి అనేది నిశ్శబ్దంగానే నిలబడుతుందని ఈ పర్యటన గుర్తుచేసింది. కోట్లాది అయ్యప్ప భక్తులను ఏకం చేసే విశ్వాసానికి ఈ క్షణం అద్దం పడుతోంది" అని ఆయన తన పోస్టులో రాశారు. మహిళల ప్రవేశంపై 2018లో సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఒక మహిళా దేశాధినేత ఆలయాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, రాష్ట్రపతి పర్యటన సందర్భంగా సాధారణ భక్తుల ప్రవేశాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు అధికారులు తెలిపారు.




## హైడ్రా రంగనాథ్ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన శివానేత

ఎల్బీనగర్ , అక్టోబర్ 22 (భారతశక్తి) : ప్రజల భవిష్యత్తే ధ్యేయంగా హైదరాబాద్ అభివృద్ధే లక్ష్యంగా కనుమరుగైన చెరువులకు జీవం పోస్తూ నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమైన హైడ్రా కమిషనర్ రంగనాథ్ సార్ గారినీ కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన లైఫ్ సేవర్స్ ఆర్గనైజేషన్ ఫౌండర్ శివ నేత హైడ్రా కమిషనర్ రంగనాథ్ పుట్టినరోజుని తెలంగాణ ప్రజలు, డిఆర్ఎస్ మరియు హైడ్రా బృందలు పండగల జరుపుకుంటున్నాయని శివ నేత తెలియజేశారు...

## సామాన్యుడి అభిమానం..
## రంగనాథ్‌గారికి జన్మదిన శుభాకాంక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 22 (భారతశక్తి) : చేసిన మేలు మరిచిపోరనడానికి ఇదో తార్కాణం. వరంగల్ పోలీసు కమిషనర్ ఉన్నప్పుడు ఏవీ రంగనాథ్ చేసిన మేలు ఓ సామాన్యుడు గుర్తుంచుకున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గారి పుట్టిన రోజున హైడ్రా కార్యాలయానికి వచ్చి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తనకు జరిగిన న్యాయాన్ని వివరించారు. స్థానిక నాయకుడి కబ్జాల చెర నుంచి తన ప్లాట్‌కు విముక్తి కల్పించారని పేర్కొన్నారు. బైపాస్ సర్జరీ చేసుకుని బెడ్ రెస్టులో ఉన్నప్పుడు ఏవీ రంగనాథ్ , ఈ సాయం చేశారన్నారు. తర్వాత తన ప్లాట్‌ను అమ్ముకుని కూతురు పెళ్లి చేశానని సదరు సామాన్యుడు తెలిపారు. వరంగల్‌లోని పైడిపల్లి ప్లాట్స్ కు కబ్జాల నుంచి విముక్తి కల్పించడం వల్ల తనతో పాటు.. 8 మంది వాటిని అమ్ముకుని పిల్లలకు పెళ్లిళ్లు చేశారంటూ తెలిపారు. ఆ అభిమానంతోనే బుధవారం ఏవీ రంగనాథ్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు వరంగల్ నుంచి వచ్చామని చెప్పారు.



# మరో మహమ్మారి కబళించబోతోందా..?

**పొద్దున్నే నిద్రలేవగానే వేపచెట్టును దర్శించుకోవాలని పెద్దలు చెబుతుంటారు.. తెల్లవారుజామున వేపచెట్టునుంచి వచ్చే అత్యంత విలువైన ప్రాణవాయువు ఆక్సిజన్ పీల్చుకుంటే మన శరీర రుగ్మతలు మటుమాయం అయిపోతాయి.. మనసు కూడా ప్రశాంతంగా మారుతుంది.. ఓ రకంగా చెప్పుకోవాలంటే మానవాళి జీవితాల్లో వేపవచెట్టు ఒక ప్రాముఖ్యతను సంతరించుకుంది.. లెక్కలేని ఔషధ గుణాలున్న వేపచెట్టును పరిరక్షించుకోకపోతే.. మనకు రక్షణ కరువవుతుంది.. అన్ని చెట్లల్లోనూ వేపచెట్టు అత్యధికంగా ఆక్షిజన్ ను విడుదల చేస్తుంది.. గాలిలోని ప్రమాదకర సూక్ష్మక్రిములను నాశనం చేస్తుంది.. అలాంటి వేపచెట్టు కనుమరుగైపోతే మన పరిస్థితి ఏమిటి అన్నది ఒక్కసారి అవలోకనం చేసుకోవాలి.. ఇంతకు ముందే చూసాం.. అప్పట్లో వేపచెట్లు చనిపోవడం మొదలయ్యాక.. ఆ వెంటనే కోవిడ్ అనే మహమ్మారి ప్రపంచాన్ని చుట్టేసింది.. లక్షల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.. కారణం ఆక్షిజన్.. గాల్లో ఎప్పుడైతే ఆక్సిజన్ తగ్గిపోతుందో.. అప్పుడు ప్రమాదకర సూక్ష్మ క్రిములు విజృంభిస్తాయి.. అదే జరిగింది.. ఇప్పుడు కూడా అదే జరుగబోతోంది.. వేపచెట్లు వేలసంఖ్యలో చనిపోతున్నాయి.. గాలిలో ఆక్షిజన్ మాయం అయిపోతున్నది.. దీంతో మరో ప్రమాదం ఈ విశ్వాన్ని చుట్టుముట్టబోతోంది అన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు విశ్లేషకులు, వైద్య నిపుణులు.. ఇలాంటి ప్రమాదం ముంచుకురాకముందే మేలుకోవాలి.. ప్రభుత్వాలు స్పందించాలి.. ఫారెస్ట్, హార్టికల్చర్ శాఖలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి.. ప్రజలందరూ వేప చెట్లను సంరక్షించుకోవాలి.. అమెరికా లాంటి దేశాలు వేపచెట్టుపై పేటెంట్ హక్కులు పొందడానికి ప్రయత్నం చేస్తున్నారు.. అలాంటిది వేపచెట్లకు ఆలవాలమైన భారతావని ఏమి చేస్తోంది..? వేపచెట్లను కాపాడుకోలేకపోతే మన జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..**

- ప్రపంచాన్ని కుమ్మేసిన కోవిడ్..
- అలాంటి ప్రళయం రాబోతోందని సంకేతాలు..
- కారణం తెలిస్తే ఒళ్ళు జలదరిస్తుంది..
- ఔషధాల గని వేపచెట్టుకు ప్రమాదం..
- వాతావరణంలో తగ్గనున్న ఆక్షిజన్..
- ఎన్నో ఆయుర్వేద ఔషధాల్లో వేపచెట్టు వినియోగం..
- వేప ఆకులు, చిరును, వేపనూనె, వేపచెక్క ఇలా ఎన్నెన్నో..
- తెగుళ్లతో చనిపోతున్న వేపచెట్లు..
- కోవిడ్ కు ముందు ఇలాగే జరిగింది..
- మళ్ళీ ఆ పరిస్థితులు రాబోతున్నాయన్నది నిపుణుల ఆందోళన..
- ప్రభుత్వం మేలుకోవాలి.. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలి..
- ప్రజలు అప్రమత్తం అవ్వాలి.. విలువైన వేప సంపదను కాపాడుకోవాలి..
- మానవాళి సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న వేపచెట్టును కాపాడుకోవాలని పిలుపునిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "

**(స్పెషల్ కరస్పాండెంట్)**

**హైదరాబాద్, అక్టోబర్ 22 (భారత శక్తి) :**

వేపచెట్టు ఎన్నెన్నో విశిష్టతలు కలిగిన మహత్తరమైన వృక్షరాజం.. ప్రకృతికి ఈ చెట్టు ప్రాణాధారము.. వేపచెట్టు వాతావరణాన్ని శుద్ధి చేస్తుంది, ఎక్కువ ఆక్సిజన్ విడుదల చేస్తుంది. ఇక ఔషధ విలువలకు కొదవలేదు.. ఆకులు, చిగురు, వేపనూనె, వేపచెక్క.. ఇవన్నీ ఆయుర్వేద ఔషధాలుగా ఉపయోగిస్తారు. పర్యావరణ ప్రధమ రక్షకుడు వేపచెట్టు.. వేప మొక్క దోమలు, పురుగులు, బ్యాక్టీరియా వంటి వాటిని దూరంగా ఉంచుతుంది. వాతావరణ సమతుల్యతను కాపాడుతుంది.. అధిక వేడి, పొడి వాతావరణంలో కూడా వేప నిలబడగలదు.



భారతీయ సంప్రదాయంలో ఒక భాగంగా నిలుస్తుంది వేప.. వేపతో కలశం, ఉగాది పచ్చడి, ఇంటి ముందు వేపచెట్లు పెంచడం మన జీవనశైలిలో భాగం.

*** చనిపోతున్న వేపచెట్లు అసలు కారణాలు ఏమిటి..?**

వాతావరణ మార్పులు ఒక కారణంగా చెప్పుకోవచ్చు.. అసాధారణ వేడి, తేమ తగ్గడం, వర్షాభావం ఇలాంటి పరిస్థితులు వేపను నిర్మూలిస్తున్నాయి.. మరీ ముఖ్యంగా ఫంగల్ వ్యాధులు.. డై బ్యాక్ డిసీజెస్ వంటి ఫంగస్ వేప రంధ్రాల్లోకి ప్రవేశించి చెట్టును చంపేస్తుంది.

దీనికి తోడు మట్టి కాలుష్యం.. ప్లాస్టిక్, రసాయనాల వల్ల వేర్లు దెబ్బతినడం జరుగుతోంది.. అనాలోచిత నిర్మాణాలు సైతం వేపచెట్లను నాశనం చేస్తున్నాయి.. రోడ్లు, భవనాలు, కేబుల్ పనుల సమయంలో వేర్లు కోయడం ప్రమాదకరంగా మారుతోంది.. అవగాహన లోపం కూడా ఒక పెద్ద కారణం అవుతోంది.. వేప విలువ తెలియక నరికివేయడం లేదా దానికి సరైన సంరక్షణ లేకపోవడం విచారకరం..

*** ఎదురవబోతున్న వినాశనం :**


వేపచెట్లు చనిపోతే పర్యావరణ సమతుల్యత భంగం కలుగుతుంది. దోమలు, పురుగులు పెరిగి స్వచ్ఛత సమస్యలు తలెత్తుతాయి.

ఆక్సిజన్ ఉత్పత్తి తగ్గి, పట్టణాల్లో వేడి పెరుగుతుంది. ఔషధ విలువలతో ఉన్న సహజ రక్షణ కవచం నశిస్తుంది. దీనితో హానికరమైన సూక్ష్మజీవులు ప్రాణం పూసుకుంటాయి.. మనిషి మనుగడను ప్రమాదంలో పడేస్తాయి..



*** ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థల తక్షణ కర్తవ్యం :**

వేప సంరక్షణ ప్రాజెక్టు ప్రారంభించాలి.. ప్రత్యేక " నీమ్ కన్సర్వేషన్ మిషన్ అలాగే నీమ్ హెల్త్ సర్వ్ తక్షణమే ప్రారంభించాలి.. వెంటనే ఫంగస్ నియంత్రణ చేపట్టాలి.. ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ఫంగల్ వ్యాధులపై నిపుణుల సలహాతో స్ప్రే ప్రోగ్రాములు చేపట్టాలి. హార్టికల్చర్ శాఖ ప్రత్యేకమైన నివారణ చర్యలు చేపట్టాలి.. నాట్లు వేయడం చేయాలి.. ప్రతి పట్టణంలో, గ్రామంలో వేపనాట్ల కార్యక్రమాలు యుద్ధ పాతిపదికన నిర్వహించాలి. వీటితోపాటు పరిశోధనలు వేగవంతం చేయాలి.. వ్యవసాయ, హార్టికల్చర్ విశ్వవిద్యాలయాలు వేప వ్యాధులపై పరిశోధనలు



విస్తృతంగా చేపట్టాలి.. నివారణ మార్గాలు కనిపెట్టాలి.. దీనికోసం ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు జారీ చేయాలి..

*** చట్టపరమైన రక్షణ కల్పించాలి.. :**

వేపచెట్లను నరికేవారికి జరిమానాలు విధించాలి.. అవసరమైతే కఠిన చర్యలు తీసుకోవాలి. శిక్షలు అమలుచేయాలి.. దీనికోసం ప్రభుత్వం ఒక స్పెషల్ విభాగాన్ని ఏర్పాటు చేస్తే ఎంతో మేలు జరుగుతుంది..

*** ప్రజా అవగాహన :**

పాఠశాలలలో, కార్యాలయాల్లో నీమ్ అవేర్నెస్ వీక్స్ లాంటి కార్యక్రమాలు ఖచ్చితంగా నిర్వహించాలి.. నిర్వహించాలి. ప్రజలను



అప్రమత్తం చేయాలి.. వేపచెట్టు విలువ ఏమిటో మేధావులతో చెప్పించాలి.. ప్రజల్లో ఒక బాధ్యతను కలిగించాలి.. తమను తాము రక్షించుకోవడానికి వేపచెట్లను రక్షించాలి అన్న విషయాన్ని క్షుణ్ణంగా తెలియజేయాలి..

*** ఫారెస్ట్, హార్టికల్చర్ శాఖలు చేయవలసిన పనులు :**

వేప వ్యాధుల పరిశీలన చేయాలి.. వాటి నమూనాలు సేకరించాలి.. కారణాలను పరిశోధన చేయాలి.. నివారణకు అవసరమైన ఔషధాలను ఉత్పత్తి చేయాలి.. జీవవైద్య నియంత్రణ పద్ధతులు ఖచ్చితంగా పాటించాలి.. వేప చిగుర్లు నాటడానికి ప్రత్యేక నర్సరీలు ఏర్పాటు చేయాలి.. వేపకు అనుకూలమైన నేల, నీటి పరిస్థితులపై అధ్యయనాలు చేయాలి.. ప్రతి ప్రాంతంలో "వేప హెల్త్ రిజిస్టర్" రూపొందించి శాస్త్రీయంగా అమలు చేయాలి..

**ప్రజల కర్తవ్యం ఎంతో ముఖ్యం :**

ప్రతి ఒక్కరు తమ ఇంటి వద్ద వేప మొక్కలు నాటాలి.. నాటిన చెట్లను కాపాడటం కోసం రెగ్యులర్ గా నీరు పోయడం చేయాలి.. ఫంగస్ లేదా వ్యాధి లక్షణాలు గమనిస్తే సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేయాలి.. ప్లాస్టిక్, రసాయనాలు చెట్ల వద్ద వేయకూడదు.

మరీ ముఖ్యంగా పిల్లల్లో వేప విలువపై అవగాహన కల్పించడం చేయాలి.. కొన్ని విషయాలు గుర్తు పెట్టుకోవాలి.. వేప నశిస్తే వాతావరణం నశిస్తుంది, వేప నిలిస్తే జీవం నిలుస్తుంది. ఒక వేప చెట్టు.. వేలమందికి ఆరోగ్యాన్నిస్తుంది.. వేపచెట్టు నీడ కేవలం చల్లదనం కాదు, అది ప్రకృతికి ఆశీర్వాదం. అని గ్రహించాలి.. వేపచెట్టు మన ప్రకృతికి రక్షకుడు! అని గుర్తుపెట్టుకోండి.. వేపచెట్లు చనిపోతున్నాయి... ప్రమాదం ముంచుకొస్తోంది.. వేపచెట్టు మన పర్యావరణానికి, ఆరోగ్యానికి, సంప్రదాయానికి జీవాధారంగా నిలిచింది.

అమ్మవారు లాంటి వ్యాధులు కలిగితే వేపాకు దగ్గర పెట్టుకుంటాం.. దుర్గామాత సంబరాల్లో వేపాకు ప్రధాన భూమిక పోషిస్తుంది.. వేపాకు కొమ్మలు తలకింద పెట్టుకుంటే మంచి నిద్ర వస్తుంది.. చక్కర వ్యాధిని వేపాకు తగ్గిస్తుంది.. చర్మానికి గాయాలైతే వేపాకు పేస్ట్ రాస్తే తగ్గిపోతుంది.. ఇలా చెప్పుకుంటూ పోతే వేపాకు మానవాళికి అందించే అద్భుత గుణాలు ఎన్నెన్నో ఉన్నాయి..

మనందరం కలసి ముందుకు రావాలి.. వేపను కాపాడుకుంటే వాతావరణాన్ని కాపాడినట్టే.. అసలే కాలుష్యంతో సతమతమవుతున్నాం.. అలాంటిది అంతో ఇంతో రక్షణ ఇచ్చే వేపను కాపాడుకోలేకపోతే పెను ప్రమాదాలు జరుగుతాయి.. ఒక్కటి గుర్తుపెట్టుకోండి మన పిల్లలకు పచ్చని భూమిని అందిద్దాం.. దాని కోసం మాతో కలిసి కృషి చేయండి అని ప్రాధేయపడుతోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హైమన్ రైట్స్ సంస్థ "..

# జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని కాపాడిన హైడ్రా

*** 38 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ కంచె నిర్మాణం**

హైదరాబాద్, అక్టోబర్ 22 (భారత శక్తి): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం పేట్ బషీరాబాద్‌లో జర్నలిస్టులకు కేటాయించిన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 25/2 లోని 38 ఎకరాల భూమి చుట్టూ బుధవారం ఫెన్సింగ్ వేసింది.గతంలో భూమిని జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచ్యువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి రాష్ట్ర ప్రభుత్వం 2008లో కేటాయించింది. ఈ భూమిని జర్నలిస్టులకు కేటాయిస్తూ హెచ్‌ఎండీఏ కస్టడీలో ప్రభుత్వం ఉంచిన విషయం విధితమే. అయితే ఈ కేటాయింపులపై కొంత మంది కోర్టుకెళ్లడంతో అక్కడ జర్నలిస్టులకు ప్లాట్ల పంపిణీ జరగలేదు. కోర్టులో వివాదం ఉంటుండగానే, మరోవైపు అక్కడ ఆక్రమణలు జరుగుతున్నాయని హైడ్రాకు సొసైటీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై అక్కడ రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులు కూడా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్, హెచ్‌ఎండీఏ అధికారులతో కలిసి హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. ఆక్రమణలు జరిగినట్టు నిర్ధారించుకుంది. ఇప్పటికే కొంత మంది ఇళ్లు కట్టుకుని ఉండగా, వాటి జోలికి పోకుండా ఇంకా ఖాళీగా ఉన్న భూమి



చుట్టూ ఫెన్సింగ్ వేసింది. ఈ విషయమై కొంత మంది అభ్యంతరాలు వ్యక్తం చేయగా, కోర్టు తీర్పు ప్రకారం ఆ స్థలం కేటాయింపులు జరుగుతాయి.. ఈ లోగా ఆక్రమణలు జరగకుండా ప్రభుత్వ భూమిని కాపాడుతున్నట్టు హైడ్రా స్పష్టం చేసింది. అలాగే అక్కడ ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారితో త్వరలోనే సమావేశాన్ని ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో రికార్డులను పరిశీలిస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. ఈ సమావేశంలో హైడ్రా, రెవెన్యూ, హెచ్‌ఎండీఏ, మున్సిపల్ అధికారులు కూడా ఉంటారని తెలిపారు.

# రైతుల ఉసురు తీసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

*** తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు - కప్పాటి పాండురంగా రెడ్డి**

హైదరాబాద్, అక్టోబర్ 22 (భారత శక్తి): మొక్కజొన్న రైతులు దళారుల బారిన పడుతున్నారు. మొక్క జొన్నకు మంచి గిరాకీ ఉండడంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 80 వేల ఎకరాల్లో రైతులు సాగు చేసారు. మొక్కజొన్న పశువులు, కోళ్ల దాణాకు ఎక్కువగా వినియోగించడంతో ఎక్కువ డిమాండ్ ఉండడం వల్ల జిల్లా వ్యాప్తంగా మెట్టు, వర్షాధారంగా సాగు చేస్తున్న పల్లం భూములలో మొక్కజొన్నను రైతులు సాగు చేస్తున్నారు. వారం రోజుల క్రితం నుంచి కోత దశకు రావడంతో



రైతులు మొక్కజొన్న కోసేసి నూర్పిడి చేసే పనుల్లో బిజీగా ఉన్నారు. వర్షాలు కురవడంతో నిల్వ చేసుకునేందుకు అవకాశం లేకపోవడంతో రైతులు కల్లంలోనే పంటను, వ్యాపారులకు, రైతులకు అమ్మేస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న దళారులు, వ్యాపారులు, తక్కువ ధరకు కొనుగోలు చేసి నిలువునా రైతులను దోపిడీ చేస్తున్నారు. మొక్కజొన్నకు ప్రభుత్వం గిట్టు బాటు ధర రూ. 2,300/ ప్రకటించింది. అయినప్పటికీ ప్రభుత్వం ధరకు కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు, వ్యాపారులు క్వింటాలు మొక్కజొన్న రూ. 1900 నుంచి రూ. 2 వేలు వరకు కొనుగోలు చేసి డబ్బులను వాయిదాలు వేస్తూ రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులకు పెట్టుబడులు కూడా రావడం లేదని, నిల్వ చేసేందుకు అవకాశం లేకపోవడం వల్ల కూడా దళారులకు అమ్మేస్తున్నారని అన్నారు. రైతు భరోసా, రుణమాఫీ ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలకు సమయానికి విత్తనాలు, ఎరువులు కూడా ఇవ్వలేకపోయింది.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయలేకపోతోంది..రాజకీయ ప్రయోజనాలు తప్ప ప్రజల వ్యథలు పట్టించుకోని ఈ ప్రభుత్వానికి ప్రజల చేతిలో గుణపాఠం తప్పదు. ఇప్పటికైనా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 2,400 మద్దతు ధరతో కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# నేడు జర్నలిస్టుల మెగా వైద్య శిబిరం

ఎల్బీనగర్, అక్టోబర్ 22 (భారత శక్తి): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజెయు) రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో లిఖిత డయాగ్నస్టిక్ సెంటర్ వారి సౌజన్యంతో గురువారం జర్నలిస్టుల మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టీయూడబ్ల్యుజె ఐజెయు రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు నరసింహ మొగిలి, హెల్త్ క్యాంప్ కన్వీనర్ ఆర్. శేఖర్లు వెల్లడించారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ లో గల లిఖిత డయాగ్నస్టిక్ సెంటర్ ఆవరణలో గురువారం ఉదయం 10 గంటల నుండి ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వర్కింగ్ జర్నలిస్టులకు ఉచితంగా మాస్టర్ హెల్త్ చెకప్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. లిఖిత డయాగ్నస్టిక్ యజమానులు డాక్టర్ ఎవి.నాయుడు, డాక్టర్ శ్రీధర్ రెడ్డి ఇరువురి ఆధ్వర్యంలోని వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి జర్నలిస్టు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.